thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 35 కరీంనగర్ బుధవారం, 16 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఇస్రో కోసం స్వదేశీ 32-బిట్ మైక్రోప్రాసెసర్లు

బెంగళూరు : ఇస్రోకు చెందిన విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, చండీగఢ్‌లోని సెమీకండక్టర్ లేబొరేటరీ (ఎస్‌సీఎల్) సంయుక్తంగా స్పేస్ అప్లికేషన్ల కోసం విక్రమ్ 3201, కల్పన 3201 అనే 32-బిట్ మైక్రోప్రాసెసర్లను అభివృద్ధి చేశాయి.

ఈ మేరకు తొలి ఉత్పత్తులను కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్.. ఇస్రో చైర్మన్ వి నారాయణన్‌కు అందజేశారు. విక్రమ్ 3201ను లాంచ్ వెహికిల్స్ కోసం స్వదేశీయంగా తయారు చేశారు. ఇది కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనైనా ఉపయోగించడానికి అర్హత సాధించిన మొట్టమొదటి భారతీయ తయారీ 32 బిట్ మైక్రోప్రాసెసర్.




# మంటలు రేపుతున్న మంత్రివర్గ విస్తరణ...

## రేవంత్ గట్టెక్కిస్తారా?


హైదరాబాద్ : తెలంగాణలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి వర్గ విస్తరణ వ్యవహారం.. భోగి మంటలు రేపుతోంది. ఎవరిని కదిపినా.. భగ్గుమంటున్నారు. నిప్పులు చెరుగుతున్నారు. మాజీ మంత్రి జానా రెడ్డిని.. ఈ విషయంలో 'ధ్రుతరాష్ట్రుడి' పాత్ర పోషిస్తున్నారంటూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శలు గుప్పించి 24 గంటలు కూడా గడవకముందే.. మరో ఎమ్మెల్యే ఇప్పుడు ఖస్సు మంటున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సైతం.. కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. మంత్రి వర్గ విస్తరణలో తన పేరు ఉంటుందని ఆయన.. ధీమా వ్యక్తం చేశారు. అయితే.. ఇదేసమయంలో తన పేరును మంత్రి వర్గ జాబితా నుంచి తీసేసేందుకు ఓ 'కుటుంబం'(పేరు చెప్పలేదు) తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. దీనికి సంబంధించి తనవద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని ప్రేమ్ సాగర్ రావు ఆరోపించారు. అధిష్టానానికి తనపై ఫిర్యాదులు చేస్తున్నారన్న ఆయన.. ఇలా తనను మంత్రివర్గం జాబితా నుంచి తొలగించడం అంటే.. తన గొంతును కోసిన ట్టేనని వ్యాఖ్యానించారు. ఇలా చేస్తే.. మంచిర్యాల ప్రజలు ఎవరినీ క్షమించరంటూ.. మరో సంచలన కామెంట్ చేశారు. తనకు మంత్రి వర్గంలో చోటు ఇవ్వకపోతే.. అప్పుడు మాట్లాడతానని ఒక రకంగా హెచ్చరికలు జారీ చేశారు.

**అసలేంటి వివాదాలు?...** తెలంగాణలో రాక రాక దక్కిన అధికారం.. మళ్లీ ఎన్నికల్లో ఈ తరహా విజయం ఉంటుందో ఉండదోనన్న ఆలోచనల నేపథ్యంలో ఎక్కువ మంది సీనియర్లు ఇప్పుడే మంత్రివర్గంలో చోటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

అంతేకాదు.. ఇప్పుడు విస్తరణలలో కనుక చోటు దక్కించుకోకపోతే.. మరో మూడేళ్ల పాటు విస్తరణ లేదా కూర్పు చేర్పులకు అవకాశం లేదని భావిస్తున్నారు. దీంతో ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే జానారెడ్డి కుటుంబానికి ఒక్కటే సీటు అంటూ.. నల్లగొండలో చేసిన వ్యాఖ్యలు.. అదేసమయంలో హైదరాబాద్‌కు అన్యాయం చేస్తున్నారంటూ.. అన్న మాటలు.. మంటలు పుట్టించాయి. ఇక, ఇప్పుడు ప్రేమ్‌సాగర్ వంతు వచ్చింది. ఇలా అయితే.. రాబోయే రోజుల్లో మరింత మంది నాయకులు తెరమీదికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. పైగా.. ఆలస్యమయ్యే కొద్దీ.. పార్టీకి కూడా నష్టమేనన్న అభిప్రాయం ఉంది. ఇప్పటికి మూడు సార్లు ఇంకేముంది.. విస్తరణ ఖాయమని సంకేతాలు ఇచ్చిన నాయకులు.. ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్నారు. వచ్చే ఏడాది స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అప్పటి వరకు వెయిట్ చేస్తే.. నాయకుల అసంతృప్తి స్థానికంలో కాంగ్రెస్‌కు ఇబ్బందిగా మారే అవకాశం ఉంటుందని అంటున్నారు పరిశీలకులు.

## కాళేశ్వరంలో సరస్వతి నదీ పుష్కరాలు.. వెబ్‌సైట్, యాప్‌ను ఆవిష్కరించిన మంత్రులు

హైదరాబాద్ : తెలంగాణ సెక్రటేరియట్‌లో ఒక చారిత్రక కార్యక్రమం జరిగింది. కాళేశ్వరంలో జరగనున్న సరస్వతి నదీ పుష్కరాల కోసం అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్, వాల్ పోస్టర్‌లను మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం పుష్కరాల ఏర్పాట్లలో ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధను స్పష్టం చేసింది. మే 15 నుంచి 25 వరకు జరగనున్న ఈ పుష్కరాల కోసం ప్రభుత్వం రూ. 35 కోట్లను కేటాయించి, భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించేందుకు సన్నాహాలు చేస్తోంది. కాళేశ్వరం, గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నది కలిసే త్రివేణి సంగమం ఈ పుష్కరాలకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను ఇస్తోంది. ఈ సందర్భంగా త్రివేణి సంగమం వద్ద ఘాట్ నిర్మాణం, 17 అడుగుల ఏకశిల విగ్రహ ఏర్పాటు, భక్తుల సౌకర్యార్థం టెంట్ సిటీ నిర్మాణం వంటి పనులు జరుగుతున్నాయి. రోజుకు ఒక లక్ష మంది భక్తులు రానున్నట్లు అంచనా వేసిన ప్రభుత్వం, 12 రోజుల పాటు ప్రత్యేక హారతి కార్యక్రమాలను నిర్వహించనుంది. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, "గత ప్రభుత్వం యాదగిరిగుట్ట తప్ప మిగతా ఆధ్యాత్మిక కార్యక్రమాలను పట్టించుకోలేదు. మా ప్రభుత్వం దేవాదాయ శాఖను కేంద్రీకరిస్తూ, వంద కోట్లకు పైగా ఆదాయం ఉన్న దేవాలయాలను యాదగిరిగుట్ట పాలకమండలి కిందకు తెస్తోంది. టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించాం," అని తెలిపారు. వెబ్‌సైట్, యాప్ ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని,




ఈ పుష్కరాలు భక్తులకు సౌకర్యవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, "కాళేశ్వరం త్రివేణి సంగమం ఒక పవిత్ర క్షేత్రం. 2013లో ఇక్కడ సరస్వతి పుష్కరాలు జరిగాయి. 12 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ పుష్కరాలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. దేశవ్యాప్తంగా పలు పీఠాధిపతులను ఆహ్వానించాం," అని చెప్పారు. నదిలో సమృద్ధిగా నీళ్లు ఉండి, పుష్కరాలు విజయవంతంగా జరగాలని ఆయన కోరారు. ఈ పుష్కరాలు కాళేశ్వరం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను మరింత ఉన్నతంగా చాటడమే కాక, టెంపుల్ టూరిజంపై తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న ఆసక్తిని కూడా ప్రతిబింబిస్తున్నాయి. భక్తుల సౌకర్యం కోసం చేస్తున్న ఈ ఏర్పాట్లు రాష్ట్రంలో ఆధ్యాత్మిక రంగంలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తాయని అంతా ఆశిస్తున్నారు.




నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులోఈడీ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. ఈ ఛార్జ్ షీట్ లో కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, సోనియాగాంధీ పేర్లు ఉన్నాయి. కాంగ్రెస్ ఓవర్సీస్ చీఫ్ సామ్ పిట్రోడా, సుమన్ దూబేలతో పాటు ఈ కేసుతో సంబంధమున్న సంస్థలు, మరికొంత పేర్లు చేర్చారు. గాంధీ కుటుంబంపై ఇది తొలి ఛార్జ్?షీట్. ఈ కేసులో ఏప్రిల్ 25న కోర్టు విచారణ చేపట్టనుంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 లోని సెక్షన్ 44,45 ,సెక్షన్ 3 ,4, సెక్షన్ 70 కింద నేరానికి పాల్పడినందుకు ప్రాసిక్యూషన్ ఫిర్యాదును ఈడీ దాఖలు చేసింది.

**ఏంటీ నేషనల్ హెరాల్డ్ కేసు..?**.... ఏజేఎల్, దాని యాజమాన్య కంపెనీ యంగ్ ఇండియన్ కంపెనీపై మనీ లాండరింగ్ కేసు ఇది. నేషనల్ హెరాల్డ్ కేసుగా ప్రచారంలో ఉంది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు పబ్లిషర్స్‌గా ఏజేఎల్ ఉండగా, యంగ్ ఇండియన్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి 38 శాతం చొప్పున మెజారిటీ షేర్లు ఉన్నాయి. కాంగ్రెస్‌కు ఏజేఎల్ బకాయి పడిన రూ. 90 కోట్లను వసూలు చేసుకునే విషయంలో యంగ్ ఇండియన్‌లో ఆర్థిక అవకతవకలు జరిగాయని ఈడీ ఆరోపిస్తున్నది. ఇప్పటికే ఈ కేసులో సోనియా, రాహుల్ లకు సంబంధమున్న ఆస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు జారీ చేసింది. రాహుల్, సోనియాగాంధీ మెజారిటీ వాటాదారులుగా ఉన్న అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్,యంగ్ ఇండియన్ లిమిటెడ్‌కు సంబంధించిన ఆర్థిక అవకతవకలపై ఈడీ కేసు నమోదు చేసింది. యంగ్ ఇండియన్, AJL ఆస్తులను కూడబెట్టేందుకు నేరపూరిత కుట్ర,నిధుల దుర్వినియోగం జరిగినట్లు ED ఆరోపించింది.





# గీత దాటితే ఊరుకునేది లేదు

## పార్టీ ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

### మంత్రివర్గ విస్తరణ అధిష్టానం చూసుకుంటుందని స్పష్టీకరణ

హైదరాబాద్: పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్షం(సీఎల్పీ) సమావేశం జరిగింది. శంషాబాద్ నోవాటెల్ హొటల్‌లో జరిగిన ఈ భేటీలో.. ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది.

" పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదు" అని సీఎం తేల్చి చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. " రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి.. బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. భాజపా, భారాస కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది.

మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెలంగాణ మోడల్‌పై దేశంలో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే భాజపా, భారాస ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్. భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలి" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

**సీఎం రేవంత్‌రెడ్డికి తప్పిన ప్రమాదం...** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది. నోవాటెల్ హొటల్‌లో సమావేశం పూర్తయిన తర్వాత హొటల్‌లో కిందకు వస్తుండగా.. సీఎం ఎక్కిన లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో లిఫ్ట్ మొరాయించింది.

ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తు కంటే లోపలికి దిగిపోయింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది లిఫ్ట్‌ను ఓపెన్ చేసి వేరే లిఫ్ట్‌లో సీఎంను కిందకు పంపించారు.

చురకలు






# అమల్లోకి భూ భారతి.. పోర్టల్‌లోని సేవలివే..

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. ఈ పోర్టల్‌లో పది మాడ్యూల్స్ ఉన్నాయి. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్‌ఓఆర్ కరెక్షన్, నాలా, అప్పీల్, భూముల వివరాలు, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూములు, ఈ చలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వివరాలు, ఇతరాల పేరిట ప్రత్యేక మాడ్యూల్స్‌ను పొందుపరిచారు. పోర్టల్‌లో సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫొటోలు ఉన్నాయి. తెలంగాణ రాజముద్ర, తెలంగాణ రైసింగ్ లోగోలు, ప్రతి మాడ్యుల్లో ప్రత్యేకంగా రూపొందించిన తెలంగాణ తల్లితో కూడిన లోగోను పొందుపరిచారు. నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద భూభారతి పోర్టల్ జూన్ 2వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.

# గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. "ఢిల్లీ, చెన్నైలాంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో 56 శాతం వృద్ధి రేటు ఉంది. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను సంస్థలు లీజుకు తీసుకున్నాయి.

ఆమెజన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియట్, సిగ్నాలాంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి వచ్చాయి. ఏడాది వ్యవధిలో 70కి పైగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌లు ఏర్పాటయ్యాయి. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు" అని శ్రీధర్‌బాబు అన్నారు.

# భూముల అమ్మకంలో భారాసతో కాంగ్రెస్ పోటీ: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణలో భూములు, మద్యం విక్రయాలు, అప్పులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. భూముల అమ్మకంలో భారాసతో కాంగ్రెస్ పోటీపడుతోందన్నారు. హెచ్‌సీయూ అంశంలో తనపై కేసు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధమని తెలిపారు. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి చెట్లను నరికిన ప్రభుత్వాలను చూశామా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు తొందరేమీ లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికకు మరో వారం రోజుల సమయం పట్టే అవకాశముందని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి ప్రతిపాదనలో తన పేరు లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడులో ఎన్డీఏను పునరుద్ధరించామని.. తెలంగాణలోనూ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ తమ పార్టీ నేత అని.. ఆయన అంశంపై అంతర్గతంగా చర్చించుకుంటామని తెలిపారు.

# కేసీఆర్ సూచనతోనే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి, ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజలు మద్దతిచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని పలువురు కోరుతున్నారంటూ భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే అధికార దాహంతో కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పొంగులేటి తెలిపారు. అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే జీవోను విడుదల చేశామన్నారు. "భూభారతి' వచ్చాక కొత్త ప్రభాకర్‌రెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గతంలో అక్రమంగా భూములు కొల్లగొట్టారు. వాటిని భూభారతి ద్వారా ప్రభుత్వం తిరిగి తీసుకుంటుంది. అందుకే ఆయన భయాందోళనకు గురవుతున్నారు. కేసీఆర్ సూచన మేరకే ప్రభాకర్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారు. 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని భారాస నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. భూభారతితో పేదల ఆస్తులను తిరిగి పేదలకు పంచుతాం. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూలుస్తామని పగటి కలలు కంటున్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ ఆత్మ. ఈ ప్రభుత్వంపై మొదటి నుంచి కుట్రలు జరుగుతున్నాయి. వెంటనే సీఎం అయిపోవాలని తండ్రి, కుమారుడు చూస్తున్నారు" అని పొంగులేటి వ్యాఖ్యానించారు.

**కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు.. కుట్రకోణంగా భావిస్తున్నాం: ఆది శ్రీనివాస్...** భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలనే యత్నాన్ని కుట్రకోణంగా భావిస్తున్నామన్నారు. ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతామని చెప్పారు. కుట్రకోణం ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.




## సీఎం రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం.. అసలు విషయం ఇదే..

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నోవాటెల్ హోటల్?లో రేవంత్ రెడ్డి ఎక్కిన లిఫ్ట్‌లో స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఓవర్ వెయిట్‌తో ఉండాల్సిన ఎత్తు కంటే లిఫ్ట్ లోపలికి దిగిపోయింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి సహా అధికారులు, సిబ్బంది ఆందోళన చెందారు. ఏం జరుగుతుందో అర్థంకాక కాసేపు అయోమయానికి గురయ్యారు. అనంతరం పెద్ద ప్రమాదం ఏమీ లేదని తెలుసుకుని లిఫ్ట్ నుంచి బయటకు వచ్చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రమాదం తప్పడంతో అక్కడున్న అధికారులు, పోలీసులంతా ఊపిరి పీల్చుకున్నారు.

# హైదరాబాద్‌లో ఈదురు గాలులతో వర్షం

హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో వర్షం కురిసింది. బేగంబజార్, కోఠి, బషీర్ బాగ్, నాంపల్లి, లక్డీకపూల్, ట్యాంక్ బండ్, అమీర్‌పేట్, ఖైరతాబాద్, ప్యాట్నీ, మారేడుపల్లి ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వరద నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి.

ఈ ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఇప్పటికే ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.







దిల్లీ: నవజాత శిశువుల అక్రమ రవాణా కేసులపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ ఆస్పత్రిలోనైనా చిన్నారుల అక్రమ రవాణా జరిగినట్లు తేలితే లైసెన్స్ రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేరాలను నిరోధించేందుకు ప్రభుత్వానికి కఠిన మార్గదర్శకాలు ఇచ్చింది. యూపీలో ఇటీవల ఒక ఆస్పత్రిలో నవజాత శిశువు చోరీకి గురయ్యాడు. దీన్ని గమనించిన ఆ చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే ఆ శిశువును దుండగుడు విక్రయించాడు. నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. అనంతరం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించిన దంపతులకు నిరాశే మిగిలింది. కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. దీంతో తమకు న్యాయం జరగలేదని ఆరోపిస్తూ.. బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఈ కేసును అత్యున్నత న్యాయస్థానం విచారించింది. చిన్నారుల అక్రమరవాణా కేసులపై యూపీ ప్రభుత్వ తీరు, నిందితుడికి బెయిల్ మంజూరుచేసిన అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అక్రమ రవాణా పెండింగ్ కేసులకు సంబంధించి విచారణ ఎలా కొనసాగుతోందో తెలియజేయాలని దేశవ్యాప్తంగా హైకోర్టులను జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. నిందితుడి బెయిల్ రద్దు చేసింది. "ఇలాంటి కేసులకు సంబంధించిన విచారణను 6 నెలల లోపు పూర్తిచేయాలి. రోజూవారీ విచారణను కూడా నిర్వహించాలి" అని ఆదేశాలు జారీ చేసింది. ఏ ఆస్పత్రిలోనైనా అక్రమ రవాణా జరిగినట్లు తేలితే లైసెన్స్ రద్దు చేయాలని సంబంధిత అధికారులకు సుప్రీంకోర్టు ఆదేశించింది. "కుమారుడిని పొందేందుకు ఆశపడిన నిందితుడు.. రూ.4 లక్షలకు చిన్నారిని పొందాడు. ఒకవేళ బిడ్డ కావాలని అనుకుంటే అక్రమ రవాణా చేసేవారిని సంప్రదించాల్సింది కాదు. ఆ చిన్నారిని దొంగతనం చేసి తనకు అందించారనే విషయం నిందితుడికి బాగా తెలుసు. ఇలాంటివారు సమాజానికి ముప్పు. నిందితులు ప్రతి వారం పోలీస్ స్టేషన్‌లో తప్పకుండా హాజరుకావాలి. కానీ, దీనిపై దృష్టిసారించకుండా హైకోర్టు బెయిల్ ఇచ్చింది. నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



# కంచె గచ్చిబౌలి భూముల వ్యవహారంలో మరో కీలక పరిణామం

హైదరాబాద్: తెలంగాణలో కంచె గచ్చిబౌలి భూముల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా కొంతమంది ప్రచారం చేశారని తెలంగాణ ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో రాష్ట్ర పోలీసులను సర్కార్ రంగంలోకి దింపింది. నకిలీ వీడియోలు, ఫొటోలు ఎవరైతే ప్రచారం చేశారో వారిని గుర్తించాలని ఆదేశించింది. దీంతో పోలీసులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. కాగా.. కంచె గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఫేక్ పోస్ట్‌లపై తెలంగాణ పోలీస్ శాఖ అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేయనున్నారు. ఫేక్ వీడియోలు, ఏఐ ఫేక్ ఫొటోలు పెట్టిన పలువురిని గుర్తించారు. ఫేక్ పోస్ట్‌లపై పోలీసులు నిఘా పెట్టడంతో పోస్ట్‌లను పలువురు సెలబ్రిటీలు డిలీట్ చేశారు. ఫేక్ పోస్ట్‌లు పెట్టి వైరల్ చేసి డిలీట్ చేసిన వారి వివరాలను పోలీసులు సేకరించారు. మార్చ్ 31వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు మధ్యలో ఫేక్ పోస్ట్‌లు పెట్టినట్లుగా గుర్తించారు. వారి సోషల్ మీడియా ఖాతా %ఖ=ా%తో సహా వివరాలను పోలీసులు సేకరించారు. పోస్టులు తొలగించని వ్యక్తులకు పోలీసులు నోటీసులు పంపుతున్నారు. 25 మంది సెలబ్రెటీలు పోస్ట్‌లు తొలగించినట్లు పోలీస్ శాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఇదే వ్యవహారంలో బీఆర్ఎస్ నేతలను పోలీసులు గుర్తించారు. బీఆర్ఎస్ నేతలు మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్ కుమార్‌లకు పోలీసులు ఏప్రిల్ 9,10వ తేదీల్లో నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. వారు విచారణకు హాజరై పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

వారు సరైన సమాధానాలు చెప్పకపోవడంతో మళ్లీ విచారణ చేస్తామని పోలీసులు అన్నారు. మరింత లోతుగా ఈ కేసును దర్యాప్తు చేయాలని పోలీసులు నిర్ణయించుకోవడంతో నకిలీ వీడియోలు, ఫొటోలు పెట్టిన వారు భయపడిపోతున్నారు.

# పార్టీ మారుతున్నారా?.. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఏమన్నారంటే..

హైదరాబాద్: పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సీనియర్ నేత జీవన్‌రెడ్డి స్పందించారు. అవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేశారు. జిల్లాలో దశాబ్దకాలం ఒంటరిగా పోరాటం చేశానన్నారు. కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి.. అనే విధంగా పార్టీ బలోపేతానికి కృషి చేశానని చెప్పారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్‌లో వీహెచ్ తర్వాత నేనే సీనియర్‌ను. జానారెడ్డి కూడా నాకంటే నాలుగేళ్ల తర్వాత వచ్చారు. పార్టీలో సీనియార్టీకి స్థానం ఏమిటనే బాధ నాలో ఉంది. కొందరు సీనియర్లు వారి అభిప్రాయాలతో మాట్లాడి ఉండొచ్చు"అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.




# తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం.. ఇక నుంచి రూ. 4 లక్షలు..

హైదరాబాద్, ఏప్రిల్ 15: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి ఎండల తీవ్రత అధికంగా ఉండనున్న నేపథ్యంలో కీలక ప్రకటన విడుదల చేసింది.

2025లో వడదెబ్బల తీవ్రత పెరగనున్నట్లు ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అలర్ట్ అయిన రాష్ట్ర ప్రభుత్వం.. ముందస్తు చర్యలు చేపట్టింది. హీట్‌వేవ్, సన్ స్ట్రోక్‌ను స్టేట్ స్పెసిఫిక్ డిజాస్టర్‌గ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. వడదెబ్బతో చనిపోయిన వారికి ఇక నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ కింద అపద్బంధు పేరుతో ఒక్కొక్కరికి రూ. 4 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించింది.



కాగా, ఇప్పటి ఆపద్బంధు పథకం కింద బాధిత వ్యక్తులకు రూ. 50,000 వేలు మాత్రమే ఎక్స్‌గ్రేషియా ఇచ్చారు. ప్రభుత్వ తాజా ప్రకటనతో ఈ పరిహారం భారీగా పెరుగనుంది.

# అరుదైన 'నారాయణ పక్షి' ప్రత్యక్షం



కరీంనగర్ సమీపంలోని ఎల్ఎండీ డ్యామ్ సమీపంలో అరుదైన పక్షి సోమవారం కనిపించింది. ఆ పక్షి రెక్కలు నలుపు, బూడిద రంగుల్లో కనిపించాయి. దాని శాస్త్రీయనామం ఆర్డీయా సినిరియా అని, తెలుగులో నారాయణ పక్షిగా పిలుస్తారని కరీంనగర్ ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి కిర్మణయి తెలిపారు.

పొడవాటి కాళ్లు, ముక్కును కలిగి ఉండే ఈ పక్షి యూరప్, ఆసియా, ఆఫ్రికాలో ఎక్కువగా కనిపిస్తుందన్నారు. సాధారణంగా ఇవి చిత్తడి నేలలు, నదులు, సరస్సుల తీరప్రాంతాల్లో నివసిస్తాయని చెప్పారు.

చురకలు



# చిర స్మరణీయాలు...కాకర్ల అమూల్య సేవలు - ఏప్రిల్ 16... కాకర్ల సుబ్బారావు వర్ధంతి




ప్రముఖ వైద్యులు, నిమ్స్ ఆసుపత్రి తొలి డైరెక్టర్, కాకర్ల సుబ్బారావు పేరొందిన రేడియాలజిస్ట్. నిమ్స్ ఆసుపత్రి ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. వైద్యశాస్త్రంలో ఆయన చేసిన సేవలకుగాను 2000 సంవత్సరంలో భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారాన్ని ఇచ్చింది. సుబ్బారావు 1925 జనవరి 25 న, కృష్ణా జిల్లా పెదముత్తేవి గ్రామంలో ఒక మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. తమ గ్రామంలో పాఠశాల లేని కారణన సుబ్బారావు ఏడవ వరకు ఇంటి వద్దే చదువుకున్నారు. అనంతరం గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలోనున్న చల్లపల్లిలో పాఠశాల చదువు పూర్తి చేశారు. 1937–1944 మధ్యలో బందరు లోని హిందు కళాశాలలో పట్టభద్రుడయ్యారు. ఆయన మొదట ఇంజనీరు కావాలనుకున్నా, విశాఖపట్టం లో ఎంబిబిఎస్ కి సీటు రాగా, తమ వారికి ఎవరికీ తెలియకుండా విశాఖపట్నం వెళ్లి ఆంధ్ర వైద్య కళాశాలలో వైద్య విద్యలో చేరారు. 1950 లో ఉత్తీర్ణుడయ్యారు. తర్వాత భారత సైన్యంలో పనిచేయాలనుకున్నా, కొన్ని అనారోగ్య సమస్యల వలన అధికారులు అంగీకరించలేదు. 1951 సంవత్సరంలో హౌస్ సర్జన్సీ చేసిన తరువాత వైద్యంలో ఉన్నత విద్య కోసం ప్రత్యేక పారితోషికంతో అమెరికా వెళ్ళి, న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో ఎం.ఎస్ పూర్తి చేశారు. అమెరికన్ కాలేజ్ ఆఫ్ రేడియాలజీలో ఫెలోషిప్ కూడా పూర్తి చేసి, స్వ దేశానికి తిరిగి వచ్చారు. అమెరికాలో వైద్య పరీక్షలైన అమెరికా రేడియాలజీ బోర్డు పరీక్షలలో 1955 సంవత్సరంలో ఉత్తీర్ణులై న్యూయార్క్, బాల్టిమోర్ నగరాలలోని ఆసుపత్రులలో 1954–1956 సంవత్సరం వరకు పనిచేశారు. సుబ్బారావు 1956 సంవత్సరంలో ఇండియా తిరిగి వచ్చి హైదరాబాదు నగరంలో ఉన్న ఉస్మానియా వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా చేరి, అక్కడే ప్రధాన రేడియాలజిస్టుగా పదోన్నతి పొందారు. 1970లో సుబ్బారావు మళ్ళీ అమెరికా వెళ్ళి, యునైటెడ్ కింగ్‌డమ్ వారి ఫెలో ఆఫ్ రాయల్ కాలేజ్ ఆఫ్ రేడియాలజిస్టు అనే పట్టా సంపాదించు కొన్నారు. అమెరికా లోని అనేక ఆసుపత్రులలో పనిచేశారు. 1986 సంవత్సరంలో నందమూరి తారక రామారావు ప్రవాస ఆంధ్రులకు చేసిన విజ్ఞప్తి మేరపు సుబ్బారావు దేశానికి తిరిగి వచ్చి హైదరాబాదులోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) లో చేరారు. నిమ్స్ ఆసుపత్రి సుబ్బారావు చేరక మునుపు వరకు ఎముకల ఆసుపత్రిగా ప్రసిద్ధి చెందింది. సుబ్బారావు అక్కడ చేరాక అన్ని విభాగాలనూ అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు కార్పోరేటు ఆసుపత్రులకు దీటైన స్థాయికి తీసుకొని వచ్చారు. నిమ్స్ సంస్థ రాష్ట్ర, దేశ వ్యాప్తంగా రోగుల చికిత్సా పరంగా, వైద్య వృత్తి శిక్షణ పరంగా, వైద్య పరిశోధన పరంగా, పేరెన్నిక కలిగిన వైద్య సంస్థగా కృషి చేశారు. సుబ్బారావు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా మొట్టమొదటి అధ్యక్షులు, వ్యవస్థాపకులు. సుబ్బారావు రేడియాలజీలో అనేక పుస్తకాలు, జర్నల్స్ లో పరిశోధనా వ్యాసాలు వ్రాశారు. దేశ విదేశాలలో వైద్య ఉపన్యాసాలు ఇచ్చారు. యాభై ఏళ్ల అనుభవంలో అనేక బహుమతులు, సన్మానాలు పొందారు. సుబ్బారావు వైద్యశాఖకు, మానవాళికి చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2000 సంవత్సరంలో పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసి సత్కరించింది. ఇండియా రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ వారి అనుబంధ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చాప్టరు సుబ్బారావుకు 2001 మార్చి 17న జీవితకాలపు కృషి అవార్డు ప్రదానం చేశారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2021 ఏప్రిల్ 16 న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలుగు జానపద సాహిత్య పితామహులు బిరుదు

## జానపద సాహిత్యానికి బిరుదు రామరాజు ఎనలేని సేవలు - ఏప్రిల్ 16... బిరుదు రామరాజు జయంతి




జానపద సాహిత్య రంగంలో ఆచార్య రామరాజు పేరు తెలియని వారుండరు. తెలుగు జానపద సాహిత్యం గురించి ప్రప్రథమంగా డాక్టరేటు పట్టాకోసం పరిశోధన చేసి, దేశ విశ్వ విద్యాలయాలలో జానపద సాహిత్యం పై పరిశోధన లకు ప్రవేశం కలిపించడానికి ప్రేరణ అయినారు రామరాజు. ఆయన పరిశోధన భూమికగా ఇతర విశ్వ విద్యాలయాలలో జానపద సాహిత్యం గూర్చి పరిశోధన ప్రారంభమయింది. తెలుగునాట విశ్వ విద్యాలయాల్లో జానపద సాహిత్య శాఖలను రూపొందించి, వాటిలో తమ పరిశోధనాత్మక రచనలతో, బోధనతో, మార్గ నిర్దేశనంతో ఒకతరం జానపద సాహిత్య పరిశోధకులను, అధ్యాపకులను తయారు చేసిన మార్గదర్శకులు ఆయన. భారతీయ విశ్వ విద్యాలయాల్లోని ఆదర్శ ప్రాయమైన, అరుదైన మౌలిక పరిశోధకుల్లో ఆయన అగ్రగణ్యులు. 1955లో ప్రచురించ బడిన ఆయన పరిశోధనా గ్రంథం... 'జానపద గేయ సాహిత్యము' తెలుగు జానపద అధ్యయనాలకు విజ్ఞాన సర్వస్వంగా అందుబాటులో ఉంది. బిరుదురాజు రామరాజు 1925 ఏప్రిల్ 16 వ తేదీ దేవనూరు గ్రామంలో లక్ష్మీదేవమ్మ, బిరుదు రాజు నారాయణరాజు దంపతు లకు జన్మించాడు. ప్రాథమిక విద్యను హన్మకొండ శివార్లలోని దేవనూరు, మడికొండలలో పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం ఎనిమిదేళ్లపాటు హన్మకొండకు 14 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వచ్చింది. 3వ తరగతి నుండి ఇంటర్మీడియెట్ వరకు ఉర్దూ మీడియంలో చదువుకున్నాడు. మెట్రిక్ చదివేటప్పుడు 11వ ఆంధ్ర మహాసభల సందర్భంగా మహాత్మా గాంధీ వరంగల్ వచ్చినప్పుడు ఆనాటి సభలలో స్వచ్ఛంద సేవలకు అందించాడు. గాంధీజీతో కలిసి పాదయాత్ర చేశాడు. 1947లో కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు పాలయ్యాడు. చదువు కునే రోజుల్లో ఆర్యసమాజం ప్రభావానికి లోనైనాడు. నిజాం వ్యతిరేక రాజకీయోద్యమాలలో చురుకుగా పాల్గొన్నాడు. నిజాం కళాశాలలో బి.ఎ. చదువుతున్న సమయంలో దాశరథి కృష్ణమా చార్యతో పరిచయం ఏర్పడింది. కాళోజీ నారాయణరావు, టి.హయగ్రీవా చారి, ముదిగొండ సిద్ధ రాజలింగం, జమలాపురం కేశవరావు తదితర యువ నాయకులతో కలిసి రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం, స్టేట్ కాంగ్రెస్ ఉ ద్యమాలలో పాల్గొని 1947లో మూడు నెలలపాటు కారాగార శిక్ష అనుభవించాడు. 1947–50ల మధ్యకాలంలో నిజాం కళాశాలలో తెలంగాణా విద్యార్థి సంఘానికి అధ్యక్షుడిగా పని చేశాడు. బి.ఎ.పూర్తయ్యాక న్యాయ శాస్త్రంలో పట్టా పొందాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీలో ఎం.ఎ. చదివే రోజులలో విద్యార్థి నాయకుడిగా గుర్తింపు పొందాడు. ఆ సమయం లో సి.నారాయణ రెడ్డితో కలిసి కొంతకాలం రామనారాయణ కవులు పేరుతో జంట కవులుగా కవిత్వం చెప్పారు. మాడపాటి హనుమంతరావు ఆంధ్రసంఘం నెలకొల్పి దానికి బిరుదురాజు రామరాజును అధ్యక్షుడిగా నియమించాడు. తెలంగాణ రచయితల సంఘానికి తొలి కార్యదర్శిగా ఉన్నాడు. కాగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక ఆంధ్ర రచయితల సంఘంగా మారింది. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం మార్గ దర్శకత్వంలో తెలుగు జానపద గేయసాహిత్యం అనే అంశంపై పరిశోధన చేసి దక్షిణ భారత దేశంలోనే జానపద సాహిత్యంపై మొట్టమొదటి పి. హెచ్.డి ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి సంపాదిం చాడు. సంస్కృతంలో ఎం.ఎ. చేసి అందులో కూడా డాక్టరేట్ పొందా డు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో 1951లో ఉపన్యాసకుడిగా చేరి క్రమంగా పదోన్నతుల ద్వారా తెలుగుశాఖకు డీన్‌గా, అధ్యక్షు డిగా విధులు నిర్వర్తించాడు. ఆయన మార్గదర్శకత్వంలో 37 మంది పిహెచ్.డి పట్టాలు పొందా రు. రామరాజు పర్యవేక్షణలో కేతవరపు రామకోటిశాస్త్రి, కోవెల సుప్రసన్నాచార్య, ముదిగొండ వీరభద్ర శాస్త్రి, అక్కిరాజు రమాపతి రావు, అనంతలక్ష్మి, కాళిదాసు పురుషోత్తం, రవ్వా శ్రీహరి వంటి వారు తమ పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టాలను పొందడం గమనార్హం. 1983లో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేశాడు. 1994లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, 1995లో భారత ప్రభుత్వం నుండి నేషనల్ ప్రొఫెషనల్‌షిప్, 2001లో సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ వారి శివానంద ఎమినెంట్ సిటిజన్ అవార్డ్, 2003లో శ్రీ రాజా లక్ష్మీ పురస్కారం,2006/2007లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారి 'విశిష్ట పురస్కారం', 2009లో సి.పి.బ్రౌన్ అకాడెమీ వారి తెలుగు భారతి పురస్కారం అందుకున్నాడు. ప్రాచీన సంస్కృతాంధ్ర గ్రంథాల్ని పరిశీలించి, పరిష్కరించి మొదటి సారిగా వెలుగులోకి తేవడానికి విశేష కృషి చేశాడు. సంస్కృతంలో పీహెచ్‌డీ చేసి 'సంస్కృత సాహిత్యానికి ఆంధ్రుల సహకారం' అనే గ్రంథంగా తన వ్యాసాన్ని ప్రచురించాడు. తాళపత్ర గ్రంథాల్ని సేకరించి పలు వ్యాసాల ద్వారా వాటిని పరిచయం చేశాడు. సంస్కృత భాషా సాహిత్యాలకు ఆంధ్రులు చేసిన సేవను గూర్చి విడిగా ఒక పెద్ద పరిశోధన గ్రంథ రచనే చేశాడు. శరత్ చంద్ర ఛటర్జీ, మున్షీ ప్రేమ్‌చంద్ వంటి అగ్ర రచయితల రచనలను తొలిసారిగా తెలుగులోకి అనువదించి సాహిత్యాభి మానులకు పరిచయం చేశాడు. ఉర్దూ, హిందీ, ఆంగ్ల భాషలలో మంచి ప్రావీణ్యం ఉన్న పండితుడు రామరాజు గురు గోవింద్ సింగ్ చరిత్ర, జాతక కథలను హిందీ నుండి తెలుగులోకి అనువదించాడు. ఉర్దూ–తెలుగు నిఘంటువును కూడా రూపొందిం చాడు. ఆంగ్లంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో అనేక ఉపన్యాసాలు ఇస్తూ, అనేక పుస్తకాలు వ్రాసాడు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు యాభైకి పైగా విశ్వ విద్యాలయాలతో అనుబంధం కలిగి ఉండి, పలు యూనివర్సిటీలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేశాడు. తెలుగు జానపద అధ్యయనాల గాడ్‌ఫాదర్ గా కీర్తించబడే ఆచార్య రామరాజు, 2010, ఫిబ్రవరి 8 న హైదరాబాదులో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తాగుబోతు నటనకు భాష్యం చెప్పిన ఎం.ఎస్


## పేరడీకి పెట్టింది పేరు ఎం. ఎస్ - ఏప్రిల్ 16... ఎమ్. ఎస్. నారాయణ జయంతి



ఎమ్. ఎస్. నారాయణ (ఏప్రిల్ 16, 1951 – జనవరి 23, 2015) గా పిలువ బడే మైలవరపు సూర్యనారాయణ తెలుగు సినిమా హాస్యనటుడు, దర్శకుడు. దాదాపు 700 చిత్రాలలో నటించారు. కొడుకు, భజంత్రీలు చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన తాగుబోతు పాత్రలను పోషించడంలో పేరొందారు. గతంలో ఆయన భీమవరంలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేశారు. శ్రీకాంత్, కృష్ణంరాజు నటించిన "మా నాన్నకు పెళ్ళి" చిత్రం ద్వారా తెలుగు చలనచిత్ర రంగానికి పరిచయమయ్యారు. అంతకు ముందు సినీ కథా రచయితగా పనిచేశారు. కథా రచయితగా పేరుపడ్డ తొలిచిత్రం వేగుచుక్క పగటిచుక్క. స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా లోని నిడమర్రు. వీరిది మధ్యతరగతి రైతు కుటుంబము. వీరి తండ్రి మైలవరపు బాపిరాజు రైతు, తల్లి వెంకట సుబ్బమ్మ. పదవ తరగతి పూర్తి అయిన తరువాత నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న పత్తేపురంలోని ప్రాచ్య కళాశాలలో ఐదు సంవత్సరాల భాషా ప్రవీణ కోర్సు చేశారు. పత్తేపురంలోని మూర్తిరాజు కళాశాలలో సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ లెక్చరర్‌గా పని చేసేవారు. ఆయన వద్ద ఎంఎస్ శిష్యరికం చేశారు. అది ఆయన జీవితంలో రచయితగా స్థిర పడడానికి పునాది వేసిందంటారు. తన క్లాస్‌మెట్ అయిన కళాప్రపూర్ణను ప్రేమించగా పరుచూరి వారే దగ్గరుండి పెళ్ళి చేయించడం విశేషం. వీరిది కులాంతర ప్రేమ వివాహము. పశ్చిమ గోదావరి జిల్లా కె.జి.ఆర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. కళారంగంపై ఉన్న ఆస్తకితో అధ్యాపకుడి పదవికి రాజీనామా చేసి నటనా రంగంలోకి అడుగులు వేశారు. మొదటగా రచయితగా చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు. ఎనిమిది చిత్రాలకు రచయితగా పనిచేశారు. ఎమ్మెస్ నటించిన తొలి సినిమా యమ్.ధర్మరాజు ఎం.ఎ. అయన కుమారుడు విక్రం కొడుకు చిత్రం ద్వారా తన చిత్ర ప్రస్థానాన్ని ప్రారంభించారు. తల్లి సుబ్బమ్మ ప్రోత్సాహంతో ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఎంఎస్ ఖాళీ రోజుల్లో మాత్రం నాటకాలు వేస్తు గడిపే వారు. తన స్నేహితులతో కలిసి "బాలనాగమ్మ, భట్టి విక్రమార్క" వంటి పౌరాణిక నాటకాలు వేశారు. సాంఘిక నాటకాలకు తానే పాత్రలను ఎంపిక చేసుకుని దర్శకుడిగా నాటకాలు వేసి అందర్నీ మెప్పించే వారు. భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న సమయంలో దివిసీమ ఉప్పెన సంభవించగా తోటి కళాకారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో నాటకాలు వేసి విరాళాలు సేకరించి దివి సీమ ప్రజలకు అందించారు. 1996లో "పెదరాయుడు" చిత్రంలో తొలిసారిగా వెండి తెరపై కనిపించారు. అయితే అంతుకు ముందే వెగుచుక్క–పగటి చుక్క, ప్రయత్నం, ముగ్గురు మొనగాళ్లు, పేకాట పాపారావు చిత్రాలకు అద్భుతమైన కథలు అందించి సినీ రంగంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. దర్శకుడు రవిరాజా పినిశెట్టితో రుక్మిణీ సినిమా కథ చర్చల్లో ఆయన హావ భావ ప్రదర్శనకు ముగ్ధుడై హాస్య నటుడిగా ఎమ్ ధర్మరాజు ఎం. ఏ. అవకాశం కల్పించారు. పుణ్యభూమి నాదేశం, రుక్మిణి (సినిమా) చిత్రాల్లో చిన్న పాత్రలు వేసినప్పటికి 1997లో ఈవీవీ దర్శకత్వంలో మా నాన్నకు పెళ్ళి సినిమాలో తాగుబోతు తండ్రి పాత్ర ఆయనకు ఎంతో పేరు తెచ్చి పెట్టింది. దర్శకులు తనకు ఇచ్చిన పాత్రకు తానే సంభాషణ రాసుకుని సినిమాల్లో పలికే వారు. "ఏం చేస్తున్నావ్ ... ఏం చేస్తున్నావ్ ... అని మాటిమాటికీ అడగొద్దు. ఏదో ఒకటి చేసేయ గలను" (నువ్వు నాకు నచ్చావ్)బీ "సోడా కొట్టడం అంటే పీజీ పాసైనంత వీజీ కాదు" (బన్ని)బీ "ఇక్కడ ఏం జరుగుతుందో నాకు తెలియాలి" (అతడు) లాంటి డైలాగులు తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి. ఎమ్మెస్ తన నట జీవితంలో 5 నంది అవార్డులు (రామసక్కనోడు, మానాన్నకు పెళ్ళి, సర్దుకుపోదాం రండీ, శివమణి, దూకుడు), 2 సినీ గోయెర్స్ అవార్డులు పొందారు. దూకుడు చిత్రానికిగాను ఉత్తమ సహాయనటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు. 200 చిత్రాల్లో తాగుబోతు పాత్రల్లో ఒదిగి పోయారు. గ్లాస్ చేతిలో పట్టుకున్న ప్రతిపాత్రను ప్రేక్షకులు ఎంతో ఎంజాయ్ చేశారు. అదే విధంగా పేరడీ పాత్రలకు ఎమ్మెస్ పెట్టింది పేరు. దూకుడు, డిస్కో, దూబాయ్ శీను తదితర చిత్రాల్లో పేరడీ, నటనా వైవిధ్యం ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు. ఉత్తమ హాస్యనటుడు – శివమణి, 2003, ఉత్తమ హాస్యనటుడు – దూకుడు, 2001 నంది పురస్కారాలు ఆయనకు లభించాయి. అనారోగ్య కారణాలతో ఆయన చికిత్స పొందుతూ 2015, జనవరి 23 న మృతిచెందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నవయుగ వైతాళికుడు వీరేశలింగం


## ఏప్రిల్ 16... కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి



తెలుగులో తొలి నవల రచనకు నాంది పలికిన గొప్ప కవి ఆయన. మొదటి స్వీయ చరిత్ర రాసిన మహోన్నత వ్యక్తి ఆయనే. తెలుగులో తొలి ప్రహసనం వ్రాసింది కూడా ఆయనే. మొట్ట మొదటి వితంతు వివాహం జరిపించిన గొప్పతనం ఆయనదే. ఆయనే నవయుగ వైతాళికుడిగా ప్రఖ్యాత గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులు. బాల్యవివాహాల రద్దుకోసం ఉద్యమించిన మహోన్నతుడు, గొప్ప సంఘ సంస్కర్త. మూఢ నమ్మకాలపై యుద్ధం ప్రకటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 రాజమండ్రిలో జన్మించారు. బ్రిటీష్ హయాంలో బాల్య వివాహాలను నిరసిస్తూ ఆయన పెద్ద ఎత్తున ఉద్యమమే నిర్వహించారు. దీంతోపాటు అనేక సంఘ సంస్కరణలకు పాటు పడ్డారు. సామాజిక దురాచారాల నిర్మూలన కోసం నిరుప మానంగా కృషి చేశారు. ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించిన కందుకూరి, బాల్య వివాహాలు రద్దు కోసం ఉద్యమిస్తూనే .. వితంతు వివాహాలు జరిపించాలని కోరేవారు. దేశంలో మొదటి వితంతు వివాహం జరిపింది ఆయనే. సాహితీ వ్యాసంగంలోనూ విశేషంగా కృషిచేశారు కందుకూరి వీరేశలింగం పంతులు. బహుముఖ ప్రజాశాలి అయిన కందుకూరి. మొట్టమొదటి సహవిద్యా పాఠశాలను కూడా ప్రారంభించారు. తెలుగులో తొలి నవల వ్రాసింది. మొదటి స్వీయ చరిత్ర రాసింది కూడా ఆయనే. అంతేగాక తొలి ప్రహసనం కూడా కందుకూరి చేతినుంచి జాలువారింది. కందుకూరి జయంతిని నాటకరంగ దినోత్సవంగా జరుపుకుంటారు. జాతికి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త, మన తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి . సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు,తెలుగు సాహితీ వ్యాసంగంలోనూ నిరుపమానమైన కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. యుగకర్త గా, హేతువాదిగా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా అనేక విషయాలలో ఆంధ్రులకు ఆయన ఆద్యుడు, ఆరాధ్యుడు. తెలుగు కవుల జీవిత చరిత్ర రాసిన మొదటి వ్యక్తి. విజ్ఞాన శాస్త్ర గ్రంథాను తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు రచయిత. ఆంధ్ర దేశంలో బ్రహ్మ సమాజం స్థాపకులు. యువజన సంఘాల స్థాపన కూడా ఆయనతోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశారు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పని చేసారు. తాము నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన ఆదర్శ వ్యక్తి. యుగకర్త గా ప్రసిద్ధి పొందిన ఆయనకు గద్య తిక్కన అనే బిరుదు ఉంది. ఆంధ్ర సమాజాన్ని సంస్కరణాల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం. ఆయన చేసిన ఇతర సంస్కరణా కార్యక్రమాలొక ఎత్తు, వితంతు పునర్వివాహాలొక ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని విస్తృత ప్రచారం చేసారు. వీరేశలింగం హేతువాది. ఆయన జీవితం సంఘసంస్కరణ, సాహిత్య కృషి రెండింటితో పెనవేసుకు పోయింది. ప్రభుత్వంలోని అవినీతిని ఏవగించుకుని ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాన్ని, అబద్ధాలు ఆడక తప్పదని న్యాయవాద వృత్తిని వదులుకున్న వ్యక్తి అటువంటి దురాచారాలపై ధ్వజమెత్తి, తన సంస్కరణా భిలాషను నిరూపించు కున్నారు. ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పని చేశారు. అధ్యాపకుడిగా పనిచేస్తుండడంతో 'పంతులు'గారని, వీరేశలింగం పంతులుగారని ప్రాచుర్యం పొందారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి 1876లో ఉపాధ్యావృత్తి నుండి జర్నలిస్టుగా మారి 'వివేకవర్ధిని' అనే మాసపత్రికను ప్రారంభించారు. మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలిసి, రాజమండ్రి లోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచి పత్రికను నిర్వహించారు.ఆ రోజుల్లోనే లంచగొండితనం, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు%ౌ% ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక 'వివేకవర్ధిని'ని ఆయన ఎక్కుపెట్టారు. ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా, ఆచరణాత్మకంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. తొలి వితంతు పునర్వివాహాన్ని 11 డిసెంబర్ 1881న తన ఇంట్లోనే జరిపించారు. నవల, వ్యాసం, ఉపన్యాసం, విమర్శ వంటి ప్రక్రియలకు ఆద్యులు. తెలుగులో వచ్చిన తొలి సాంఘిక నవల 'రాజశేఖర చరిత్ర' (1878) పంతులు గారు రాసిందే. సంఘసేవలో వీరేశలింగం ఎంత కృషి చేసారో, సాహిత్యం లోనూ అంతే కృషి జరిపారు. చదువుకునే రోజుల్లోనే రెండు శతకాలు రాసాడు. పత్రికలకు వ్యాసాలు రాస్తూ ఉండేవారు. వివేకవర్ధనిలో సులభశైలిలో రచనలు చేసేవారు. వ్యావహారిక భాషలో రచనలు చేసిన ప్రథమ రచయితలలో ఆయన ఒకరు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో అద్వితీయ ప్రతిభ కలవారు కందుకూరి. ఆయన 130కి పైగా గ్రంధాలు రాసాడు. అన్ని గ్రంధాలు రాసిన వారు తెలుగులో అరుదు. సాంఘిక దురాచారాలను సంభాషణాత్మకంగా, వినోదాత్మకంగా విమర్శించే ప్రహసనాల వంటి ప్రయోగానికి వీరేశలింగమే ఆద్యుడు.ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంస్కర్త, వీరేశలింగం 1919 మే 27 న మరణించారు. వీరేశలింగం గొప్ప సంస్కర్తే కాదు, గొప్ప కవి, రచయిత. తెలుగు సాహిత్యంలో ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. ఆయన రచనలు, కవిత్వాల్లో కూడా అభ్యుదయ భావాలు నిండి ఉండేవి. తెలుగు సాహిత్యంలో ఆయనకు సమున్నతమైన స్థానం ఉంది. నవలలు, కథలు, వ్యాసాలు అన్ని రకాల సాహితీ ప్రక్రియల్లో వీరేశలింగం గారు తన దైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకూ వీరేశలింగం ఉంటారు. సంస్కరణోద్యమం ఉన్నంత వరకూ ఆయన పేరు చిరస్థాయిలో నిలుస్తుంది. ఆయన వ్యక్తి కాదు,గొప్ప వ్యవస్థ అనేది నూటికి నూరుపాళ్లు నిజం.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నటనకు భాష్యం చెప్పిన బళ్ళారి రాఘవ -ఏప్రిల్ 16...బళ్ళారి రాఘవ వర్ధంతి




తెలుగు నాటక రంగ చరిత్రతో మహా నటుడు బళ్ళారి రాఘవ కు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినమైన తెలుగు నాటక రంగ దినోత్సవ దినమే బళ్ళారి రాఘవ వర్ధంతి దినం కావడం యాదృచ్ఛికం. రాఘవ 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా, తాడిపత్రిలో శేషమ్మ, నరసింహాచార్యులు అనే పుణ్య దంపతకులకు శ్రీ వైష్ణవ కుటుంబంలో జన్మించారు. వీరి ఇంటి పేరు తాడిపత్రి, కానీ బళ్లారిలో స్థిరనివాసం ఏర్పరచుకోవటం వలన బళ్ళారి రాఘవగా ప్రసిద్ధులయ్యారు. రాఘవకు తల్లిదండ్రులు పెట్టిన పేరు బసప్ప. వైష్ణవ మతాచారం ప్రకారం పేరు చివర ఆచార్యులుంటుంది. ఆయనను అందరూ ప్రేమగా రాఘవ అని పిలిచేవారు. అలా ఆయన కాలక్రమేణా బళ్ళారి రాఘవాచార్యులుగా ప్రఖ్యాతి గాంచారు. బళ్ళారి లో ప్రాథమిక మాధ్యమిక విద్య ను పూర్తిచేసి, మద్రాసులోని క్రిష్టియన్ కళాశాల నుండి పట్టభద్రులయ్యారు. తర్వాత న్యాయశాస్త్రాన్ని కూడా అభ్యసించారు. మద్రాసులోనే న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. అచిరకాలంలో నేక్రిమినల్ లాయర్ గా పేరు ప్రఖ్యాతులు, విశేష ధనాన్ని కూడా ఆర్జించారు. ఆ రోజుల్లో ఉన్న ఆంగ్ల ప్రభుత్వం, వీరి ప్రజ్ఞా పాటవాలను గుర్తించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించటమే కాకుండా 'రావు బహదూర్' అనే బిరుదుతో సత్కరించారు. చిన్నతనం నుండి నటన పట్ల అభిరుచి కలిగి, తన పన్నెండవ ఏటనుండే నటనను ప్రారంభించారు. చిన్నతనంలోనే, బళ్లారిలో వీరు షేక్స్పియర్ అనే సంస్థను స్థాపించి, ఆంగ్ల నాటక ప్రదర్శనలను జనరంజకంగా ప్రదర్శించారు. ఆ రోజుల్లో శ్రీ కోలాచలం శ్రీనివాసరావు గారికి బళ్లారిలో 'సుమనోరమ'అనే నాటక సంస్థ ఉండేది. మొదట్లో, శ్రీ రాఘవ ఆ సంస్థలోనే నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు. ఆ సంస్థ తరపున రాఘవ నటించిన మొదటి నాటకం "సునందినీ పరిణయం" దానిలో రాఘవది 70 ఏళ్ల వృద్ధుని పాత్ర. అప్పటికి రాఘవ వయస్సు 27 ఏళ్లు మాత్రమే. ఆ ముదుసలి పాత్రలో చక్కగా నటించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు హరిశ్చంద్ర, బృహన్నల, పాదుకా పట్టాభిషేకం, సావిత్రి, రామరాజు చరిత్ర, రామదాసు, తప్పెవరిదీ?, సరిపడని సంగతులు మొదలైన వీరి నాటకాలను ప్రజలు ఇష్టపడి చూసేవారు. ప్రతినాయక పాత్రలైన హిరణ్యకశిప, దుర్యోధన, మాయలఫకీర్ మున్నగు పాత్రలను అత్యద్భుతంగా పోషించేవారు. నవరసాలనూ ఒకేసారి ముఖంలో చూపించగల దిట్టగా పేరొందారు. ఒకసారి దర్శకుడు పి. పుల్లయ్య చదువుకుంటున్న రోజుల్లో మద్రాసులో ఓ లండన్ థియేటర్ వారితో కలసి రాఘవ గారు షేక్స్పియర్ డ్రామాలో నటించారట. అప్పటికి విద్యార్థిగా ఉన్న పుల్లయ్య ఆ నాటకాన్ని చూసారట. సగం నాటకం పూర్తికాగానే గ్రీన్ రూంలోకి వెళ్లి, తనను తాను పరిచయం చేసుకొని, ఈ నాటకం నిండా బ్రిటిష్ నటుల హవాయే కనిపిస్తోంది , మీ పాత్ర తేలిపోతోందేమిటి?' అని రాఘవ గారిని అడిగారట. అప్పుడు రాఘవ గారు ' ఆఖరి సీన్ చూసి అప్పుడు రా!' అన్నారట. చివరి సీన్ పూర్తయింది. తెరపడింది. పుల్లయ్య గారు నేరుగా పోయి రాఘవాచార్యుల వారి పాదాలకు నమస్కరించారట! నాటకంకు వినోదమే ప్రధాన లక్ష్యం కాకూడదని, సంఘ దురాచారాలు, సంఘ సంస్కరణలను ప్రజలకు తెలియచేయటానికి, సామాజిక చైతన్యానికి ఉపయోగపడే ఒక గొప్ప ప్రక్రియగా నాటకాలను ప్రదర్శించాలని ఆయన చెపుతుండేవారు. శ్రీ లంక, ఇంగ్లాండ్, ఫ్రాన్సు, జర్మనీ, స్విట్జర్ లాండ్ లాంటి పలు విదేశాలను దర్శించి ఆయా దేశాల్లో భారతీయ రంగస్థల వైభవాన్ని గురించి పెక్కు ప్రసంగాలను చేసారు. 1928లో రాఘవ గారి ఇంగ్లాండ్ పర్యటనలో ఆయనకు జార్జిబెర్నార్డ్ షాతో పరిచయమైంది. రాఘవ ప్రతిభను కొనియాడుతూ బెర్నార్డ్ షా అన్న మాటలు, "మీరు భారత దేశంలో పుట్టారు, ఇంగ్లాండు లో పుట్టివుంటే షేక్స్ పియర్ అంత గొప్ప కీర్తిని పొందేవారు" అని ప్రశంసించారట. 1919లో బెంగుళూరులో రాఘవ నటించిన 'పఠాన్ రుస్తుం' నాటకాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ చూసి తన్మయత్వం చెంది, రాఘవ నటనా ప్రతిభను కొనియాడారు. 1927లో జ మహాత్మా గాంధీ... రాఘవ నటించిన నాటకాన్ని చూసి, ఆనందాన్ని పట్టలేక 'రాఘవ మహరాజ్ కి జై' అని పొగిరారట. బళ్ళారి రాఘవ నటుడిగా తెలుగులో ఎంత ఖ్యాతి గడించారో, కన్నడంలో కూడా అంత ప్రఖ్యాతిని గడించారు. రాఘవ నటించిన ఇంగ్లీషు నాటకాలను చూసినవారు ఆయన తెలుగు నటుడంటే ఎవరూ నమ్మలేరు. భాషలపై, భావ ప్రకటనలపై, హావభావాలలో ఆయనకున్న పట్టు అటువంటిది. ఆ రోజుల్లో స్త్రీలు రంగస్థల ప్రదర్శనలు ఇవ్వటానికి జంకేవారు. కారణాలు అనేకం ఉన్నాయి. వీరు స్త్రీలను రంగస్థలంపైన అభినయించటానికి ప్రోత్సహించారు. కొప్పరపు సరోజినీ, కొమ్మూరి పద్మావతి, కాకినాడ అన్నపూర్ణ లాంటి పలువురు స్త్రీ ప్రముఖులను రంగస్థలానికి పరిచయం చేసిన ఘనత బళ్ళారికే దక్కింది. బళ్ళారి చేత పరిచయం చేయబడిన కే. యస్. వాసుదేవరావు, బసవరాజు అప్పారావు, బందా కనకలింగేశ్వర రావు లాంటి గొప్ప వారు ప్రఖ్యాత నటులుగా పేరు తెచ్చుకున్నారు. 1936 లో శ్రీ హెచ్. యమ్. రెడ్డి గారి దర్శకత్వంలో వచ్చిన 'ద్రౌపదీ మాన సంరక్షణం' అనే సినిమాలో దుర్యోధన పాత్రను పోషించారు. ఆ పాత్రను అద్భుతంగా పోషించి ప్రజా బాహుళ్యంలో ఖ్యాతి గడించు కున్నారు. రైతుబిడ్డ, చండిక మొదలైన కొన్ని సాంఘీక చిత్రాలలో కూడా నటించారు. తరువాత కాలంలో మాస్టర్ తారానాథ్ అనే ఆధ్యాత్మిక గురువు ప్రభావం చేత, తుంగభద్రా నదీ తీరంలో తారానాథ్ గారు నిర్మించిన ఒక ఆశ్రమానికి భూరిగా విరాళం ఇవ్వటమే కాకుండా, ఆయన శిష్యరికంలో, ఆధ్యాత్మిక జీవనం సాగించారు. మహాకవి శ్రీశ్రీకి బళ్లారిలో సాన్నిహిత్యం ఉండేది. రాఘవ చివరి రోజుల్లో అనారోగ్యం చేత చిక్కి శల్యమై పోయారు. ఆయనను కలిసి, పరామర్శించ టానికి ప్రత్యేకంగా శ్రీశ్రీ బళ్ళారి వెళ్ళారు. ఆ సమయంలో, రాఘవ శ్రీశ్రీని, "ఇంత దూరం వచ్చారు కదా! హంపీ శిధిలాలు కూడా చూసిపోవచ్చు కదా!"అని అన్నారట. అందుకు శ్రీశ్రీ. మిమల్ని చూశాం కదా! ఇంక వాటిని ప్రత్యేకంగా చూడనవసరం లేదు అంటే వారు కడుపుబ్బ నవ్వు కున్నారట. రాఘవ సేవలకు గుర్తింపుగా ఆంధ్ర కళాప్రపూర్ణ బిరుదుతో ప్రజలు, సంస్థలు ఆయనను సత్క రించాయి. బళ్లారి రాఘవ జీవిత చరమాంకం వరకూ నటించి, అనారోగ్య కారణాలతో 1946 ఏప్రిల్ 16న తెలుగు కళామతల్లి ఒడిలో శాశ్వత నిద్రలోకి జారు కున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు

## సంపాదకీయం

# ట్రంప్ నెక్స్ట్ టార్గెట్ ఫిక్స్..!

పెరిగేవాడు పెరుగుతూనే ఉంటే.. తరిగేవాడు తరుగుతూనే ఉన్నాడని అంటుంటారు. ఈ సమయంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని.. పెరిగిన ధరలు పేదలపై పెను ప్రభావం చూపుతున్నాయనే మాటలు నిత్యం వినిపిస్తూనే ఉంటాయి. ఈ సమయంలో చాలా మంది రెగ్యులర్ వాడే డయబెటీస్, పెయిన్ కిల్లర్, యాంటీ బయాటిక్స్ మందుల ధరలు పెరగడం పేదలపై పెను ప్రభావం చూపుతుందని అంటున్నారు. అవును... ఏప్రిల్ 1 నుంచి దేశీయంగా 900 రకాలకు పైగా ఔషధాల ధరలు పెరిగిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్.పీ.పీ.ఏ) ప్రకటించింది. ఈ క్రమంలో... 2023తో పోలిస్తే 2024 క్యాలెండర్ ఇయర్ లో నమోదైన టోకు ద్రవ్యోల్బణం ఆధారంగా మందుల ధరలు గరిష్టంగా 1.74 శాతం వరకూ పెరిగినట్లు ఎన్.పీ.పీ.ఏ. పేర్కొంది. ఈ ప్రభావం పేదలపై భారీగానే ఉన్నట్లు చెబుతున్నారు. ఉదాహరణకు.. సవరించిన ధరల ప్రకారం యాంటీబయ్యాటిక్ అజిత్రోమైసిన్ 250ఎంజీ ఒక్కో టాబ్లెట్ ధర రూ.11.87, 500ఎంజీ ధర రూ.23.97కు పెరిగింది. డైక్లోఫెనాక్ పెయిన్ కిల్లర్ ధర రూ.2.09, డయాబెటిస్ మెడిసిన్ డపాగ్లిఫ్లోజిన్, మెట్ ఫార్మిన్, గ్లిమెపిరైడ్ కలయిక తాజా ధరల ప్రకారం ఒక టాబ్లెట్ ధర రూ.12.74 అవుతుంది. ఇలా ఒక్కో టాబ్లెట్ ధర కనీసం రూ.1 నుంచి రూ.2 కు పెరగడం అనేది నెలలో రూ.1500 - 2000 వరకూ సామాన్యులపై భారం పడుతుందని చెబుతున్నారు. ఇది ఒక్కో టాబ్లెట్ పరంగా చూసినప్పుడు స్వల్ప భారంగా అనిపించినా.. నెల మొత్తంగా చూసినప్పుడు పేదల ప్రియారిటీలను ప్రభావితం చేసే స్థాయిలోనే పెరుగుదల నమోదైనట్లని చెబుతున్నారు. ప్రధానంగా రెగ్యులర్ గా దీర్ఘకాలికంగా మందులు వాడాల్సినవారు, ఇప్పటికే వాడుతున్న వారిపై ఈ పెరిగిన ధరల ప్రభావం బలంగానే ఉంటుందని అంటున్నారు. ఈ విషయమలో డాక్టర్ ఆఫ్ ఫార్మసీ అసోసియేషన్, ప్రభుత్వం.. పునరాలోచన చేసే అవకాశాలు, సబ్సిడీ ఆలోచనలు చేసే అవకాశంపై ఆసక్తి నెలకొంది. వాస్తవానికి ఆరోగ్యమే మహాభాగ్యం అని అంటారు.. ఇప్పుడు మందులు కొనడమే మహాభాగ్యం అనాల్సిన పరిస్థితి అనే మాటలు వినిపిస్తున్నాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ప్రపంచ దేశాలపై పన్నులతో విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటికే పలు రంగాల పై విపరీతంగా టారిఫ్ లు పెంచిన ఆయన.. ఇప్పుడు తాజాగా భారత్ కు మరో షాకిచ్చారు. ఇందులో భాగంగా... భారత్ పై 26 శాతం వరకూ టారిఫ్ విధించారు. దీంతో.. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే ప్రతీ వస్తువు పైనా ఇప్పటివరకూ ఉన్న టారిఫ్ కు అదనంగా మరో 26% మేర చెల్లించాల్సి ఉంటుందన్నమాట. ఇదే సమయంలో.. ఫార్మాసూటికల్స్ రంగంపై టారిఫ్ విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అమెరికా సొంతంగా డ్రగ్స్, ఇతర మందులు తయారు చేయట్లేదనే విషయాన్ని గుర్తు చేశారు. వాస్తవానికి ఫార్మాసూటికల్స్ రంగంలో అమెరికాకు అధికంగా ఎగుమతులు చేస్తోంది భారత్! ఇందులో భాగంగా... మహారాష్ట్ర, గుజరాత్ లతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున ఔషధాలు అగ్రరాజ్యానికి ఎగుమతి అవుతున్నాయి. ఈ విషయంలో హైదరాబాద్ ఫార్మా హబ్ గా ఉంటోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ కొత్త టారిఫ్ లు ఏ మేరకు, ఎలాంటి షాక్ ఇవ్వబోతున్నాయనేది ఆసక్తిగా మారింది.


# "తెలంగాణకే తలమానికమైన ధర్మపురి నాటక సంస్థ" - ఏప్రిల్ 16...తెలుగు నాటక రంగం దినోత్సవం సందర్భంగా



తెలంగాణలోనే మొదటిదిగా, తెలంగాణకే తలమానికంగా, ధర్మపురి పుణ్య క్షేత్రంలోని శ్రీ లక్ష్మనరసింహ నాట్య మండలి దాదాపు తొంభై సంవత్సరాలకు పైగా, కళామత ల్లికి ఎనలేని సేవలందిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సనాతన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు నిలయమైన ఈ క్షేత్రంలో, 1936 లో ప్రారంభమైన నాటక సంస్థ 3 తరాల నటులతో పలు పౌరాణిక సాంఘిక చారిత్రక నాటకాలు - నాటికలు ప్రదర్శిస్తూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలు ప్రజాభిమానాన్ని చూర గొన్నది. గోదావరి తీరస్థ ప్రాచీన తీర్థము, పుణ్య క్షేత్రము అయిన ధర్మపురి పట్టణం, వేల సంవత్సరాల నుండి ఉజ్వల సాంస్కృతిక, వైదిక, నాగరికత, కలిగివున్న క్షేత్రంగా... ఆర్ష విద్యతో పాటు, సంగీతాది లలిత కళలకు నిలయంగా వాసికెక్కింది. తెలంగాణ ప్రాంతంలో సాంస్కృతిక చైతన్యం అంతగా లేక, స్తబ్దంగా ఉన్న రోజుల్లో, స్థానికుల సహకారంతో స్థాపించబడిన నాటక సంస్థ, తెలంగాణ లోనే మొదటిదిగా నిలువ కలిగింది. ఇది ప్రారంభం అయ్యే నాటికి తెలుగు భాషకు విలువ లేని "ఉర్దూ రాజభాష"గా గల నిజాం రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు... భారతీయ సంస్కృతికి వైద్యులకు కళలకు విలువ ఇవ్వని కేంద్ర ఆంగ్ల ప్రభుత్వం మరోవైపు, అననుకూల వాతావరణం ఉండేది. అయినా స్థానికుల అభిమానం, ధనం, సేవాభావం, ఈ సంస్థకు ఊపిరి పోసాయి. కీర్తిశేషులు కాసర్ల వెంకట రాజయ్య శిక్షణలో, దర్శకత్వంలో, తొలి తరం నటులు "సతీ సావిత్రి" నాటక ప్రదర్శనతో ప్రారంభించి, అనంతర కాలంలో వెను తిరిగి చూడకుండా, సుమారు పాతిక పౌరాణిక నాటకాలు... ద్రౌపతి వస్త్రాపహరణం, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణ తులాభారం, లవకుశ, భక్త రామదాసు, సతీ సక్కుబాయి, సతీ తులసి, శ్రీకృష్ణ రాయబారం, పాండవోద్యోగం వంటి అనేక నాటకాలు ప్రదర్శించారు. ఆరోజుల్లో ఈ నటులు ప్రదర్శించని పౌరాణిక నాటకమే లేదంటే అతిశయోక్తి లేదేమో. కాకెరి లక్ష్మీ కాంత శాస్త్రి, రొట్టె చంద్రశేఖరశాస్త్రి, సంగనభట్ల మాణిక్య శాస్త్రి, తెలంగాణ త్యాగయ్య చాచం కృష్ణయ్య, జగన్నగారి విశ్వనాథశాస్త్రి లాంటి ఉద్దండులు, వారి సరసన దెమ్మ బాలకృష్ణయ్య స్త్రీ పాత్ర ధారిగా తొలి తరం నటులు బహు ప్రశంసా పాత్రులు అయినారు. నాటక సంస్థ రథసారథులలో ఒకరైన కే. వీ. కేశవులు ( రాష్ట్ర మాజీ మంత్రి), 1946 లో మంచిర్యాలలో ఆంధ్ర సారస్వత పరిషత్తు మహా సభలలో, శ్రీకృష్ణ తులాభారం నాటకాన్ని ప్రదర్శింప చేయగా, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, నార్ల వెంకటేశ్వరరావు వంటి ప్రముఖులు నాటకాన్ని కాంచి, బహుధా ప్రశంసించారు. తర్వాత కాలంలో దేవులపల్లి రామానుజరావు, కాళోజీ నారాయణరావు, పివి నరసింహారావు, స్థానం నరసింహారావు లాంటి మేధావుల ప్రశంసా పాత్రమైంది. స్థానిక దైవం లక్ష్మీ నరసింహ బ్రహ్మోత్సవాలలో, ప్రత్యేక ఓపెన్ థియేటర్ లో ప్రదర్శిత నాటకాలకు జనం టిక్కెట్టు కొని మరీ చూసేవారు. ఆ రోజుల్లోనే సొంత నాటక ప్రదర్శన శాల ఉండేది. రకరకాల సీనరీ పరదాలు, మేకప్ సామగ్రి, గదలు, కిరీటాలు, ఉయ్యాలలు, నిచ్చెనలు, ఫైర్ వర్క్స్, వగయిరా సకల హంగులతో అట్టహాసంగా ఉండేది. మొదటి తెరపై భారతమాత చిత్రపటం కలిగి ఉన్న ఈ సంస్థ ఆ రోజుల్లో పెద్ద సాహసమే చేసింది. ఎందుకంటే ఇది రాజ ద్రోహం కిందకు వచ్చేది. ఫైర్ వర్క్స్ లో యముని రాక, నారదుని మబ్బుల్లో ప్రయాణం, శిశుపాలుని శిరచ్ఛేదం, ప్రహ్లాదుని అగ్నిగుండంలో వేయడం, ద్రౌపదికి కృష్ణుడు చీరలు అందించడం, వంటి ఎన్నో అద్భుతాలను కశో జ్జల శివరామయ్య పర్యవేక్షణలో చూపారు. రెండవ తరం నటులు దశాబ్దకాలం ప్రదర్శన ఇవ్వగా, నాటి సీనియర్ నాయకులు దాద గారి కిషన్ రావు నిర్వహణలో, సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాలకు ప్రారంభ నిధుల సేకరణ గావించారు. గయోపాఖ్యానం నాటకం తెలంగాణ లోని చాలా ప్రాంతాల్లో రొట్టె విశ్వనాథశాస్త్రి, గుండయ్య శాస్త్రి, పెండ్యాల శంకర్, ఓజ్జల రామచంద్రం, నరసింహా చారి, గుండి హనుమాన్లు, భోగం పురుషోత్తం వంటి మేటి నటులతో ప్రదర్శించారు. మూడవ తరంలో పౌరాణిక నాటకాలతో పాటు వీరపాండ్య కట్ట బొమ్మన, వీర కాపయ, నాగమ నాయకుడు లాంటి చారిత్రక నాటకాలు పెక్కు సాంఘిక నాటకాలు ప్రదర్శనలను కొనసాగిస్తున్నారు. 1984 లో జిల్లా కలెక్టర్ కె ఎస్ శర్మ, 1991 లో కలెక్టర్ బన్వర్ లాల్ ఆహ్వానం మేరకు, వారి సమక్షంలో కరీంనగర్ కళాభారతిలో ప్రదర్శనలిచ్చి బహుమతులు అందుకున్నారు. 1989 లో తెలుగు విశ్వ విద్యాలయం నిర్వహించిన, సాంప్రదాయ పద్య నాటక పోటీలలో సూర్యాపేటలో "కట్టబొమ్మన" ప్రదర్శించారు. 2016లో వరంగల్ లో, వేణుమాధవ్ ఆడిటోరియంలో... అనంతరం హైదరాబాదులోని రవీంద్ర భారతిలో.. ప్రదర్శన ఇవ్వడం జరిగింది. నిధులు ప్రోగు చేసి సొంత సామగ్రిని సమకూర్చు కున్నారు. ప్రస్తుత నటులలో కొందరు వీడియో, చలన చిత్రాలలో అవకాశాలు పొందారు. విద్యావేత్త విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ సంగనభట్ల నరసయ్య, బహుముఖ ప్రజ్ఞాశాలి, నటులు కొరిడె నరహరిశర్మ, కాకెర్ల దత్తాత్రేయ, ఎస్ రామకృష్ణయ్య, మునిగాల కిషన్ తదితరులు చారిత్రక నటులుగా మిగుల గుర్తింపు పొందారు 1993 లో తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ పేర్వారం జగన్నాథం ద్వారా నిధులు పొంది, స్వర్ణోత్సవాలు జరిపి, గయోపాఖ్యానం నాటకం ప్రదర్శించి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ దర్శకులు దివంగత బి. ఎస్. నారాయణ చేత కళాకారులకు సన్మానాలు చేయించారు. సావనీర్ విడుదల చేశారు. 1955 లో ఈ సంస్థ కళాకారులకు ఆంధ్ర నాటక పరిషత్తు 1983 లో ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ కాకర లక్ష్మీకాంత శాస్త్రికి, పెండ్యాల సీతారాములకు ఘనంగా సత్కారం చేశాయి. స్థానిక డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సయ్య నాటక రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా గ్రామీణ కళా జ్యోతి అవార్డు లభించింది. నలుగురు వృద్ధ కళాకారులకు గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ పథకాలను మంజూరు చేసింది. ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా కళామతల్లికి సేవ చేస్తూ సాంప్రదాయక పద్య నాటకాలను బ్రతికిస్తున్న అపురూప అరుదైన నాట్యమండలి 2017 ఏప్రిల్ 2,3 తేదీలలో నాటి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.వీ. రమణాచారి, నాటి ప్రభుత్వ చీఫ్ విప్, గత రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బీ. ఎస్.రాములు తదితర ప్రముఖులు హాజరు కాగా, 80 వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించు కున్నారు. ప్రస్తుతం నరహరి శర్మ ఆధ్వర్యంలో, నర్సయ్య పర్యవేక్షణలో, దత్తాత్రి నిర్వహణలో, రామకిష్టయ్య, చంద్రమౌళి, వెంకట రమణ, కిశోర్, మహేందర్, సురేశ్, బాలకృష్ణ, శేఖర్, నర్సింహమూర్తి, జన్మంచి నరసయ్య, వంశీ కృష్ణ, నరహరి, అమర్, అనిల్, శ్రీనివాస్, రాంకిషన్, సంజీవ్, రాజ గోపాల్ లకు తోడు కాకెరి అరుణ, సంగనభట్ల ప్రతిభ తదితరులు స్త్రీ పాత్రలను పోషిస్తూ, పౌరాణిక చారిత్రక నాటకాల ప్రదర్శనలను కొన సాగిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...94 40595494**

# తెలుగు నాటక రంగంలో స్థానం వారిది ప్రత్యేక స్థానం - ఏప్రిల్ 16... తెలుగు నాటక రంగ దినోత్సవ సందర్భంగా




స్థానం నరసింహారావు (23.9.1902%-21.2.1971) ఆంధ్ర నాటక రంగ చరిత్రలో నరసింహారావుది ప్రత్యేక స్థానం. నాటక రంగం మనగలిగినంత కాలం ఆయన పేరు శాశ్వతంగా నిలిచి పోతుంది. ఆయన స్త్రీ పాత్రధారణలో అసాధారణ ప్రజ్ఞ కనబరచి నాటక రంగానికే వన్నె తెచ్చారు. పురుషులే స్త్రీ వేషాలు వేసే ఆ నాటి రోజుల్లో రంగస్థలంపై విభిన్నమైన, పరస్పర విరుద్ధ మయిన పాత్రలను ధరించి, ధరించిన ప్రతి పాత్రలోను తమదైన ప్రత్యేకతను చూపించి లీనమై, ముప్ఫయి సంవత్సరాలపాటు లక్షలాది మంది ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసిన ప్రతిభ ఆయనకే సొంతం. నటకావతంస, నటశేఖర, నాటకకళా ప్రపూర్ణ, పద్మశ్రీ వంటి బిరుదులు, పురస్కారాలు ఆయనను వరించాయి. స్థానం నరసింహారావు (సెప్టెంబర్ 23, 1902 - ఫిబ్రవరి 21, 1971) ప్రసిద్ధ రంగస్థల, తెలుగు సినిమా నటులు. సత్యభామ, చిత్రాంగి మొదలైన అనేక స్త్రీ పాత్రలను సుమారు 40 సంవత్సరాలకు పైగా ధరించి 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ప్రేక్షకాభిమానంతో సహా పద్మశ్రీ పురస్కారం పొందాడు. స్థానం నరసింహారావు 1902, సెప్టెంబర్ 23 న హనుమంతరావు, ఆదెమ్మ దంపతులకు గుంటూరు జిల్లా బాపట్ల లో జన్మించారు. ఆయన చిన్నతనంలో కూచిపూడి భాగవతులు వచ్చి బాపట్లలో ప్రదర్శనలు ఇచ్చేవారు. అందులో వెంపటి వెంకటనారాయణ అనే ఆయన భామ వేషం అద్భుతంగా కట్టేవారట. ఆ స్త్రీ వేషం తన మనసులో ఎంతో ఆదరంతో మనసులో నిలిచి పోయి ఉండేదని చెప్పారు. ఈ దృశ్యాలన్నీ ఆయన రంగస్థల ప్రవేశం చేయడానికి దోహ దం చేశాయి. 1921లో బాపట్లలోనే జంట కవులైన తిరుపతి వేంకట కవులకు, కొప్పరపు కవులకు శతావధానం పోటీ జరిగింది. నెగ్గిన తిరుపతి వేంకటకవులని సత్కరిం చాలని భావించారు. ఆ సందర్భం గా ప్లీడరు గుమస్తాల బృందం చేత సత్య హరిశ్చంద్ర నాటకం వేయించాలని నిర్ణయించారు. ఆహ్వానాలు వెళ్లిపోయాయి. కానీ చంద్రమతి వేషధారి అస్వస్థుడై రాలేకపోతున్నట్టు చివరి నిమిషం లో తెలిసింది. ప్రత్యామ్నాయం ఏదీ సాధ్యం కాలేదు. చంద్రమతి పాత్రధారి మరొకరు దొరకలేదు. మరో నాటకం వేద్దామంటే పాత్రధారులంతా లేరు. గుండెల్లో రాయి పడింది. అప్పుడే ఆపద్బాం ధవుడిలా స్థానం దొరికాడు చోర గుడి హనుమంతరావుకి. వారి నాటకం రిహార్సల్స్ జరుగు తున్నప్పుడు వెళ్లి కూర్చోవడంతో పద్యాలన్నీ వచ్చేశాయి. ఒకసారి ఎవరూ లేనప్పుడు పాడుకుంటూ ఉంటే హనుమంతరావు విన్నారు. ఆ ధైర్యంతోనే చంద్రమతి వేషం వేయించారు. స్థానం వారికి చిన్న తనంలోనే చిత్రలేఖనం కూడా అబ్బింది. ఆ కళతోనే, వేరే ఒకరి ఇంట రహస్యంగా తన వేషం తనే వేసుకున్నారాయన. చిన్న చిన్న లోపాలు ఉన్నా అరంగేట్రంలోనే తిరుపతి కవుల ఆశీస్సులు అందు కున్నారు స్థానం. తెనాలిలోని శ్రీరామ విలాస సభలో ప్రవేశించి ఆకాలంలోని గొప్ప నటులందరి సరసన పాత్రలు ధరించి దేశమంతటా పర్యటించి అపారమైన అనుభవం సంపా దించారు. వరంగల్‌లో 'కృష్ణలీల' నాటకంలో యశోద వేషం వేసినందుకు ఆయన జీవితంలో తొలి బంగారు పతకం వచ్చింది. అనతికాలంలోనే ఆయన పేరు మారుమోగి పోయింది. కాపురం బాపట్ల నుంచి తెనాలికి మారింది. "శ్రీరామవిలాస సభ" అనే నాటక సమాజాన్ని స్థాపించి నటననే జీవికగా చేసుకున్నారు. రోషనార (రోషనార నాటకం), తామీనా (రుస్తుం సొహరాబ్ నాటకంలో), సంయుక్త (రాణీ సంయుక్త), శకుంతల (అభిజ్ఞాన శాకుంతలం), సత్యభామ (శ్రీకృష్ణ తులాభారం), చిత్రాంగి (సారంగ ధర), దేవదేవి (విప్రనారాయణ), కోకిల (కోకిల నాటకం), మల్లమ్మ (బొబ్బిలి), మధురవాణి (కన్యా శుల్కం), అనసూయ (అనసూయ నాటకం), మురాదేవి (చంద్రగుప్త), చింతామణి (చింతామణి), సుభద్ర (వీరాభిమన్య), సరళ (ఛత్రపతి శివాజీ), విద్యాధరి (కాళిదాసు), చండిక (చండిక నాటకం) వంటి పాత్రలు వేశారు. ఎన్ని పాత్రలు పోషించినా, ఆయన వేసిన సత్య భామ పాత్ర పోషణ న భూతో న భవిష్యతి. "మీర జాల గలడా నా యానతి" అన్న పాటకు ఆయన చేసిన గాత్రం, చూపిన అభినయం నాటక ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి. ఆంధ్రదేశంలో దాదాపు 3,000 సార్లు రంగస్థలం మీద పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలలో స్త్రీ పాత్రలను ధరించి ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. శృంగార రసాన్ని ప్రతిబింబించే రీతిలో సత్యభామ పాత్ర, ప్రణయానికి చిత్రాంగిగా, వీరరసాన్ని చిత్రించడంలో రోషనార నాటకంలో రోషనారగా, వలపుల చింతామణిగా, ప్రణయదేవతగా, భక్తురాలిగా, దేవదేవిగా, మధురాతి మధురమైన మధురవాణిగా నవరసాలు కలిగిన పాత్రలను ప్రతిభావంతంగా పోషించాడు. వేషధారణ, వస్త్రాలంకరణలో స్థానం వారిది ఒక ప్రత్యేకత. రకరకాల చీరకట్టు సొగసులతో మనోహరంగా రంగస్థానం మీదకు ప్రవేశించి ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధు ల్ని చేశారు. వీరు సినీ రంగంలో రాధాకృష్ణ (1939), సత్యభామ) వంటి కొన్ని సినిమాలలో నటించారు. 1931 నుండి 1942 వరకు మద్రాసులో సినీనటుడిగా వున్నారు. ఆయన పాడిన పాటలు, పద్యాలు గ్రామ ఫోన్ రికార్డులుగా వచ్చి శ్రోతల్ని ఎంతగానో అందించాయి. తన నటనానుభవాలను చేర్చి "నట స్థానం" అనే గ్రంథాన్ని ఆయన రచించారు. స్థానం నరసింహారావు 1971 ఫిబ్రవరి 21 తేదీన మరణించారు. 1956లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన ఈ బహుమతిని పొందిన తొలి ఆంధ్రుడు, కళాకారుడు. ఆయన రంగ స్థలం పై చూపించిన సమయ స్ఫూర్తికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో ఒక పాఠం కూడా పెట్టింది. అయన నటనకు ముగ్ధులైన రంగూన్ ప్రజలు 1938లో బంగారు కిరీటాన్ని బహూకరించారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

# నాటక రంగానికి పునర్వైభవం తేవాలి - ఏప్రిల్ 16... తెలుగు నాటక రంగ దినోత్సవం

నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. రంగస్థలం వినోదాన్ని కలిగించేదే కాకుండా, వివిధ సంస్కృతుల్నీ. జాతుల్నీ, మనుషుల్నీ ఒకటిగా కలిపే ప్రక్రియ. అక్కడే మనం ఆనందిస్తాంబీ దుఃఖంలోకి నెట్టబడతాంబీ ఆలోచనలకి అంకురార్పణ చేస్తాంబీ స్ఫూరి చెందుతాం. ఇదీ రంగస్థల గొప్పతనం. నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతము యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శన లుండేవని తెలుస్తున్నది. తెలుగు దేశంలో ఆధునిక నాటక రచనలకు తెర తీసింది నాటి ఉపాధ్యాయులు, ప్రధానంగా పండితులైన కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి తదితరులు. కందుకూరి వీరేశలింగం, కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడు ఆధునిక తెలుగు నాటక ప్రదర్శనారంభ విషయంలో ప్రథములు. ఆధునిక నాటక రచన 1860 ప్రాంతాల్లో ఆరంభంకాగా నాటక ప్రదర్శన మాత్రం 1880 లో ప్రారంభమయ్యింది. ఆధునిక కాలంలో వెలువడిన తొలి తెలుగు నాటకం1860 ప్రాంతాల్లో కోరాడ రామచంద్ర శాస్త్రిచే సంస్కృతంలో నుంచి నాటక లక్షణాలను అనుసరించి తెలుగులో వెలువడిన స్వతంత్ర రచన"మంజరీ మధుకరీయము". "ఆంధ్రా జాన్సన్ "గా సుప్రసిద్ధులైన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871లో వారణాశి ధర్మసూరి సంస్కృతంలో రచించిన "నరకాసుర విజయము" అనే వ్యాయోగమును ఆంధ్రీకరించాడు. పరవస్తు వెంకట రంగాచార్యులు 1872 ప్రాంతాల్లో కాళిదాసు రచించిన "అభిజ్ఞాన శాకుంతలము"ను ఆంధ్రీకరించడం జరిగింది. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్ల నాటక ఆంధ్రీకరణ ద్వారా జూలియస్ సీజర్ నాటకాన్ని "సీజరు చరిత్రము" అను పేరుతో 1874 లో ఆసాంతం తేటగీతిలో రాశాడు. ఆధునిక నాటక రచనకు ఆద్యులు వారైతే, ఆధునిక నాటక ప్రదర్శన ఆరంభ దశకు కందుకూరి వీరేశలింగం పంతులు, కొండుభొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడులు రూపకర్తలు. వీరేశలింగం సంభాషణ రూపాన "బ్రాహ్మ వివాహము" అను ప్రహసనమును తన "హాస్య సంజీవని" అను పత్రికలో రచించగా, అనంతరం "వ్యవహార ధర్మబోధిని" వ్యావహారిక భాషలో రచించి, ప్రదర్శన భాగ్యం కలిగించిన తొలి తెలుగు నాటకమిది. 1880 లో వీరేశలింగం నాటక సమాజాన్ని స్థాపించి "రత్నావళి", "చమత్కార రత్నావళి" అను రెండు నాటకాలను ప్రదర్శించాడు. తెలుగునాట తొలి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత వీరేశలింగందే. ఆయన స్వతంత్ర రచన అయిన "వ్యవహార ధర్మబోధిని", సంస్కృత నాటక అనువాదమైన




"రత్నావళి", ఆంగ్ల నాటక అనుసరణ అయిన "చమత్కార రత్నావళి" ప్రదర్శన భాగ్యం పొందిన తొలి తెలుగు నాటకాలు. ఇది 1880 లో జరిగింది. అందుచేత 1980 వ సంవత్సరం తెలుగు నాటకరంగ శతజయంతి సంవత్సరం అయింది. తెలుగు నాటకాలలో పద్య పఠనమును (ఈనాడు వలె గానం కాదు) ప్రవేశపెట్టినది వడ్డాది సుబ్బారాయుడు. వీరి నాటకాలలో ప్రసిద్ధమై, "వేణీ సంహారము". తెలుగులో గద్య, పద్యాత్మకం కాగా, పద్యాలని రంగస్థలం మీద పఠించేవారు. 1884-86 మధ్య నాదెళ్ళ పురుషోత్తమ కవి 32 హిందూస్తానీ నాటకాలు రచించాడు. వీటిని 15 ఏళ్ళపాటు అనేక పట్టణాలలో విజయ వంతంగా ప్రదర్శించారు. పాటలు పాడుట అయన ప్రవేశపెట్టిన క్రొత్త అంశము. ధర్మవరం రామకృష్ణమాచార్యులు తన తొలి తెలుగు నాటకమైన "చిత్రనళీయం"ను బళ్ళారిలో 1887 జనవరి 29న విజయవంతంగా ప్రదర్శించారు. రామకృష్ణమాచార్యులు 30 నాటకాలు రచించి, వాటిలో పాటలు, పద్యాలను రాగయుక్తంగా పాడడం ప్రవేశ పెట్టారు. "సారంగధర" తెలుగులోని తొలి స్వతంత్ర విషాద రూపకం. ప్రాచ్య - పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించడంలో ప్రథములైనందునే "ఆంధ్ర నాటక పితామహ" అని బిరుదునిచ్చి సత్కరించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం 1989లో నాటక రచన ఆరంభం చేయగా,అయన నాటకాలలో "గయోపాఖ్యానం" సుప్రసిద్ధమైనది. 1891లో " వెంకటరాయశాస్త్రి రచించిన "ప్రతాప రుద్రీయం" బహుళ ఖ్యాతి నొందింది. 1887లో గురజాడ అప్పారావుగారి "కన్యాశుల్కం" వ్యావహారిక భాషలో రచించబడ్డ అత్యుత్తమైన నాటకం. 1892 ఆగస్టులో విజయనగరంలోని జగన్నాథ విలాసినీ నాటక సమాజం వారు దీనిని ప్రథమంగా విజయ వంతంగా ప్రదర్శించారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన నాటకమిది. " 1894 ప్రాంతాల నుంచి వివిధ నాటక రచనలు చేసినవారు కోలాచలం శ్రీనివాసరావు. అధికంగా చారిత్రక నాటకాలు రచించడంచేత "చారిత్రక నాటక పితామహుడు"గా పేరొందారు. ఆయన నాటకాలకు తెలుగుదేశ మంతటా విశేష ప్రాచుర్యం తెచ్చినవారు కోలాచలం మేనల్లుడైన బళ్ళారి రాఘవ. పానుగంటి లక్ష్మీ నరసింహారావు రచించిన తొలి నాటకం "నర్మదా పురుకుత్సీయము" 1900లో ప్రకటితమైంది. ఆయన నాటకాలలో "రాధాకృష్ణ", "పాదుకా పట్టాభిషేకం", "కంఠాభరణము" ప్రసిద్ధమైనవి. " 1900 నాటికి తెలుగు నాటక రచన, ప్రదర్శన వ్యాసంగాలు తెలుగు దేశంలోని అన్ని ప్రాంతాలకూ వ్యాపించాయి. 1906-20 మధ్య కాలంలో బయల్దేరిన "హరిశ్చంద్ర" నాటకాలు 13. "సారంగధర 8. ఇంకా అనేక ఇతర నాటకాలు. నాటకాలలో పద్యాలకు, పాటలకు విలువ హెచ్చిన కాలమిది. ఈ కాలంలోని ముఖ్య విశేషం తెలుగుదేశంలో వ్యాపార నాటకరంగం విజృంభించడం గమనార్హం. 1913 ప్రాంతాల్లో కృష్ణా మండలంలో నాటక పోటీలు ప్రారంభమై దేశమంతటా వ్యాపించాయి. "గయోపాఖ్యానం", "పాండవ ఉద్యోగ విజయములు", "బొబ్బిలి యుద్ధం", "రంగూన్ రౌడి" మొదలగు నాటకాలకు విడివిడిగా పోటీలు జరిగాయి. 1929లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు తెనాలిలో స్థాపించ బడింది. 1930 నుంచి సాంఘిక నాటకోద్యమం విజృభించింది. "విశ్వశాంతి", "ఎన్.జీ.ఓ.", "మా భూమి", "కీర్తిశేషులు", "నిర్మల" "కుక్క" వంటి నాటక రచనల ద్వారా రచయితలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. 1935-44 మధ్య కాలంలో రేడియో రూపకం ఆవిర్భవించి అభివృద్ధి చెందింది. కాళ్ళకూరి నారాయణరావు రచించిన "చింతామణి", "వరవిక్రయం", "మధుసేవ" సమస్యల ఆలంబనగా వెలసిన నాటకాలు. ఇలా వుండగా సంప్రదాయాల ఆధిక్యాన్ని రూపు మాపడం కోసం రచనలు చేసినవారు త్రిపురనేని రామస్వామి, ముద్దుకృష్ణ, గుడిపాటి వెంకట చలం, ఆమంచర్ల గోపాలరావు మొదలగువారు. ఆ కాలంలో దువ్వూరి రామిరెడ్డి "కుంభరాణా", విశ్వనాథ సత్యనారాయణ "నర్తనశాల" ఉత్తమ విషాద రూపకాలు. 1930 తర్వాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన నాటకాలు కూడా వెలిశాయి. 1944-45 తరువాతి కాలాన్ని నాటక/నాటిక పోటీల యుగం అనవచ్చు. 1964లో ఎన్.ఆర్.నంది రచించిన "మరో మొహెంజొదారో" నాటకం ద్వారా తెలుగు నాటక ప్రయోగం కొత్త పుంతలు తొక్కింది. తరువాత లెక్కలేనన్ని ప్రయోగాలు ఆధునిక నాటక రంగాన్ని జరిగాయి. సాంఘిక నాటకాలలో లేజర్ టెక్నిక్‌ను వాడడం ద్వారా సైంటిఫిక్ పోకడలను సైతం గ్రహించి ప్రదర్శించే అవసరం అనివార్యం అయింది. నాటక ప్రదర్శన అత్యంత ఖర్చుతో కూడినదిగా మారింది. ఇక ప్రస్తుతం రంగస్థలానికి కావల్సిన సౌకర్యాలు సరైన థియేటర్లు లేవు. ప్రత్యేక హాల్ లేక, ఎక్కడో ఏదో హాలులో నాటకం వేయ్యాల్సిన పరిస్థితులు. అతి ముఖ్యమైన మైకులూ, స్పీకర్ సిస్టములూ ఉండవు. ఉన్నా సరిగా పనిచేయవు. మైకులు మొరాయించని నాటకం ఉండదూ అంటే అతిశయోక్తి కాదు. సినిమాల్లో నటన ముక్కలు ముక్కలుగా చిత్రీకరించ బడుతుంది. నాటకంలో ఏకబిగిన మొత్తం సన్నివేశంలో నిమగ్నమై నటించాలి. అది చాలా కష్టం. నాటకాలు వేసిన వాళ్ళు సినిమాల్లో రాణిస్తారేమో కానీ, సినిమా నటులు నాటకాల్లో రాణించడం అంత సులభం కాదు. ఇది వరకు తెలుగు సినిమా నటుల్లో అధికులు నాటక రంగం నుండి వచ్చిన వారే అన్న విషయం గుర్తుంచు కోవాలి. ఏటా నంది నాటకాలు పేరుతో కొన్ని నాటకాలు వేయించి ప్రభుత్వమూ చేతులు దులిపేసు కుంటున్నది. ప్రభుత్వాలు చొరవ తీసుకుని, నాటక సంస్థలకు చేయూత అందించి, ప్రోత్సహిస్తే తప్ప మినుకు మినుకు మంటూ అరి పోవడానికి సిద్ధంగా ఉన్న నాటకరంగం బతికి బట్ట కట్టడం కష్టం. ఈ విషయాన్ని ప్రభుత్వాలు ఇకనైనా గ్రహించక పోతే చరమాంకంలో ఉన్న నాటక రంగం తెర మరుగు కాక తప్పని స్థితి నెలకొంది.

**రామ కిష్టయ్య సంగనభట్ల...9440595494**

చురకలు



# భగీరథ.. ఇదేం వ్యథ

నిర్మల్ : ప్రజలకు తాగునీటి వసతి కల్పించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆ సమయంలో ప్రధాన రహదారులతోపాటు కాలనీలకు వెళ్లేందుకు పెద్ద ఎత్తున పైప్‌లైన్ల ఏర్పాటు పనులు చేపట్టారు. ఇందుకోసం రహదారుల పక్కన, మధ్యలో నుంచి తవ్వకాలు జరిపారు. తవ్విన ప్రాంతాల్లో సిమెంటుతో మరమ్మతులు చేయాల్సిన గుత్తేదారులు అధిక శాతం ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ఏళ్ల కాలం ఉండాల్సిన రోడ్లు ప్రస్తుతం అధ్వానంగా మారాయి.

**ఇష్టారీతిన..** మున్సిపాలిటీల పరిధిలో పనులు చేపట్టే సమయంలో కనీస ప్రమాణాలు పాటించకపోవడం, భవిష్యత్తులో ఎదురయ్యే ఇక్కట్లను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. అడుగడుగునా గుంతలతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు చెడిపోవడంతోపాటు వెన్నెముక సంబంధిత వ్యాధుల బారినపడే పరిస్థితులు ఎదురయ్యాయి. కొన్ని చోట్ల కొత్తగా వేసిన సీసీ రోడ్లను సైతం తవ్వి వదిలేశారు. మురుగుకాలువలు కూడా దెబ్బతిని పరిసరాలు పాములు, తేళ్లు వంటి విషపురుగులకు ఆవాసంగా మారి స్థానికులు భయాందోళనల మధ్య జీవనం సాగించాల్సి వస్తోంది.



అధికారులు చొరవ తీసుకుని కనీస మరమ్మతులు చేయించి సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మల్‌లోని బేస్తవార్‌పేట్, బంగల్‌పేట్, బ్రహ్మపురి వెళ్లే మార్గం దుస్థితి ఇది. పైప్‌లైన్ కోసం తవ్వి వదిలేయడంతో గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. రోడ్డు మధ్య, పక్క భాగంలో తవ్వకాలు జరిపి కొన్ని చోట్ల సిమెంటు వేసినా వాటితోపాటు చుట్టుపక్కల దెబ్బతిని ప్రయాణానికి సమస్యలు తెచ్చిపెడుతోంది. ఈ మార్గంలో నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అడుగుకు ఒకటి చొప్పున ఉన్న గుంతలతో వాహనదారులు, ప్రయాణికులు ఎదుర్కొనే ఇక్కట్లు వర్ణనాతీతం. ఈ ఒక్క చోటే కాకుండా పలు ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది. నిర్మల్ పట్టణం మంజులాపూర్ 19వ వార్డు అంబేడ్కర్ కాలనీలో పలు చోట్ల సీసీ రోడ్లు స్పీడ్ బ్రేకర్లుగా మారాయి. పైప్‌లైన్ కోసం తవ్విన వాటిని పూడ్చకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పంచాయతీగా ఉన్న సమయంలో సుమారు రూ.5 లక్షలకు పైగా వ్యయంతో ఓ ప్రాంతంలో సీసీ రోడ్డు, మురుగుకాలువ నిర్మించారు. దానిని సైతం పగులగొట్టి పైపులు వేశారు. వాటికి మరమ్మతులు ఇప్పటి వరకు చేపట్టలేదు. గత్యంతరం లేని చోట స్థానికులే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు. మురుగుకాలువలు దెబ్బతినడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి చెప్పలేని ఇబ్బందులు పడుతున్నారు.

# ఎండుతున్న పంటలు.. అన్నదాతకు తంటాలు


నిర్మల్ : స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టు రైతులు సాగుచేస్తున్న వరి పంటలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. నిన్నమొన్నటి వరకు పంట చేతికొస్తుందని సంబరపడ్డారు కానీ నిరంతర విద్యుత్తు సరఫరాతో పాటు ఇసుక అక్రమ రవాణాలో భూగర్భజలాలు పడిపోయి బోర్లలో నీరు రాక పంటలు ఎండిపోతున్నాయి. స్వర్ణ వాగు నీటిని నమ్ముకొని చించోలి(ఎం), వంజర్, బోరిగాం, అలూరు, వెంగ్వాపేట్, తల్వేద, చిట్యాల్, జాఫ్రాపూర్, మాదాపూర్ గ్రామాల రైతులు వరి సాగుచేశారు. ప్రస్తుతం ఒక తడి నీరందితే పంట చేతికొచ్చే అవకాశం ఉంది.

**అడుగంటుతున్న జలం**

నిరంతర విద్యుత్తు సరఫరా.. వాగులు, ఒర్రెల, నదుల నుంచి నిరంతరంగా ఇసుక తవ్వకాలతో భూగర్భజలం కిందకు దిగజారిపోతో ంది. ఇసుక తవ్వకాలపై అధికారులు 'మామూలు'గా చూడటంతో పంటలపై ప్రభావం చూపుతోంది. బోర్లలోనూ నీరు రావడం ఆగిపోతోంది. ఈ సీజన్‌లో జిల్లాలో సాగవుతున్న 2.72 లక్షల ఎకరాల్లో 75 వేల ఎకరాలకు బోర్లు, బావులే ఆధారం. నిరంతర విద్యుత్తు సరఫరాతో చాలాచోట్ల అవసరమున్నా లేకున్నా పంపుసెట్లను నడిపిస్తున్నారు. మోటారు నిలిపివేస్తే బావిలో ఊటలు తరలిపోతాయనే భావనే ఇందుకు కారణం. ఫలితంగా భూగర్భజలాలు పడిపోతున్నాయి.

**పట్టింపు లేకపోవడమే..**

వాగులు, వంకలు, ఒర్రెల నుంచి అనుమతుల్లేకుండా ఇసుక తీయడం నేరం. కానీ జిల్లాలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. పెంబి, రాజురా ప్రాంతాల్లో ఉన్న వాగులు, ఒర్రెలు, నిర్మల్, సారంగాపూర్ మండలాల్లోని స్వర్ణవాగు, భైంసా, కుంటాల, లోకేశ్వరం, నర్సాపూర్(జి) మండలాల్లోని సుద్ధవాగు నుంచి, సోన్, లక్ష్మణచాద, మామడ, ఖానాపూర్



మండలాల్లోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో అనుమతుల్లేకుండా ఇసుకను తరలిస్తూనే ఉన్నారు. వీటితోపాటు అనుమతుల్లేకుండా ఇష్టారీతిన బోర్లు తవ్వించడం భూగర్భజలాలు తగ్గిపోవడానికి మరో కారణంగా చెప్పొచ్చు. ఎక్కడైనా ఒక బోరు వేయించాలంటే భూగర్భజల, రెవెన్యూశాఖల అనుమతి తప్పనిసరి. అయితే ఇదెక్కడ అమలు కావడం లేదు. ఇసుక అక్రమ రవాణాతో పాటు అనుమతి లేని బోర్ల తవ్వకాలపై సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటే కొంతవరకైనా భూగర్భజలాలు కాపాడుకునే అవకాశం ఉంటుంది. ఎండుతున్న ఈ వరి చిట్యాల్-తల్వేద గ్రామాల మధ్యలోనిది. భూగర్భజలాలు అడుగంటి బోర్లు వట్టిపోయాయి. సమీపంలోని స్వర్ణవాగులోనూ నీరు లేకపోవడంతో భూగర్భజలాలు పడిపోయి బోర్ల ద్వారా నీరు రావడం లేదని రైతు గడ్డం నర్సారెడ్డి తెలిపారు. స్వర్ణ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తే కొంతవరకైనా భూగర్భజలాలు పెరిగి బోర్ల ద్వారా నీరొచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. కుభీరు మండలం పార్డి(కె) గ్రామానికి చెందిన సుంకరి రఘు రెండెకరాల్లో జొన్న, ఎకరంలో మొక్కజొన్న సాగు చేశారు. వారం క్రితం వరకు రెండు బోర్లు ద్వారా నీరందిస్తూ వస్తున్నారు. ఒక్కసారిగా భూగర్భజలాలు పడిపోయి ఒక బోరు వట్టిపోయింది. మరో బోరులో సన్నని ధారగా నీరొస్తుంది. చేతికొచ్చిన జొన్న పంటకు నీరందక ఎండిపోతోంది.

# కనిపించని ప్రోత్సాహం.. కుటుంబ నియంత్రణ తిరోగమనం




పరిగి : కుటుంబ నియంత్రణ (కు.ని.) ఆపరేషన్లలో జిల్లా వెనుకబడి పోతోంది. నగదు ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం, గైనకాలజిస్టులు, అనెస్తీషియన్ తదితర సిబ్బంది లేకపోవడం, మౌలిక సదుపాయాలు కల్పించక పోవడం వీటికి తోడు పురుషుల్లో తొలగని అపోహలు తదితర కారణాలు ఇందుకు ప్రతిబంధకంగా మారుతున్నాయి.

**వేసెక్టమీపై నేటికీ పురుషుల వెనుకడుగు**

చికిత్స చేయించుకుంటే తమ శక్తి సామర్థ్యాలు తగ్గిపోతాయనే అపోహ పురుషుల్లో నేటికీ తొలగలేదు. దీంతో వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకోవడానికి వారు ముందుకు రావడంలేదు. ఏడాది కాలంలో ఒక్కటీ జరగకపోవడం ఇందుకు ఉదాహరణ. కుటుంబ నియంత్రణ (ట్యూబెక్టమీ) అనేది ఆడవారి బాధ్యత అన్నట్లుగా వ్యవహరించడంతోనూ లక్ష్యసాధన చేరడంలేదు.

ఐదేళ్ల క్రితమే ఆపేశారు కు.ని.ఆపరేషన్లు చేయించుకునే స్త్రీ, పురుషులకు ప్రభుత్వం ఐదేళ్లుగా నగదు ప్రోత్సాహకాలు అందించడం మానేయడమే కాదు తర్వాత ప్రభుత్వం శిబిరాలు నిర్వహించటం కూడా రద్దు చేసింది. జిల్లాలో పెద్ద పట్టణం తాండూరు జిల్లా ఆస్పత్రి పీపీ యూనిట్ విభాగంలో గతంలో రెగ్యులర్‌గా కు.ని. ఆపరేషన్లు చేసేవారు. దీనివల్ల ఎక్కువ మంది ముందుకు వచ్చేవారు. ఇప్పుడు మహిళలు చొరవ చూపితేనే చేస్తున్నారు. ఇలా ప్రస్తుతం నెలకు కనీసం 70 కూడా దాటడం లేదు. గతంలో 200కు పైగా ఉండేవి.

**అపోహలు తొలగిస్తున్నాం**

కు.ని ఆపరేషన్ల నిర్వహణపై పురుషుల్లో ఉన్న అపోహలను తొలగిస్తున్నాం. సామాజిక, జిల్లా ఆసుపత్రుల్లో నిరంతరం ఇవి కొనసాగుతున్నాయి. ప్రత్యేక క్యాంపుల కోసం ఎవరూ ఎదురు చూడవద్దు. పవిత్ర, జిల్లా ప్రోగ్రాం అధికారి, వికారాబాద్

**ఇది నిరంతర ప్రక్రియ** కు.ని.శస్త్ర చికిత్సలు నిరంతర ప్రక్రియ. దీనికి ప్రత్యేకంగా శిబిరాలు నిర్వహించాల్సిన పనిలేదు. పరిగి ప్రభుత్వాసుపత్రిలో నిర్వహిస్తున్నాం. రాజశేఖర్, ఆసుపత్రి సూపరింటెండెంట్, పరిగి సామాజిక ఆసుపత్రి.

# లక్ష్యానికి మించి.. తాగునీటి పరీక్షలు



ఖమ్మం : ప్రజలు వినియోగించే తాగునీటిని ప్రయోగశాలల్లో పరీక్షిస్తుంటారు. బోర్లు, బావులు, పీడబ్ల్యూ పథకాలు సహా వివిధ నీటివనరుల నుంచి తాగునీటిని ప్రభుత్వం సరఫరా చేస్తుంది. మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ నల్లా ద్వారా నీరు అందిస్తోంది. ఈ జలాలను వివిధ దశల్లో శుద్ధిచేస్తున్నా పైపులు, ట్యాంకులు దాటి ఇళ్లకు చేరేసరికి నాణ్యత ఎలా ఉంటుందనే సందేహాలను చాలామంది వ్యక్తపరుస్తుంటారు. తాగునీటిని నిరంతరం పరీక్షించేందుకు ప్రభుత్వం ప్రయోగశాలలు ఏర్పాటుచేసింది. ఖమ్మంలోని మిషన్ భగీరథ కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రయోగశాల ఉంది. మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేటలో సబ్ డివిజన్ స్థాయి ప్రయోగశాలలు కొలువుదీరాయి. ప్రతి ప్రయోగశాలలో నెలకు 300 చొప్పున ఏడాదికి 3,600 నీటి నమూనాలు పరీక్షించాలి. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు కేటాయించిన లక్ష్యాన్ని మించి పరీక్షలు పూర్తిచేశారు. ఖమ్మంలో 4,428, మధిర- 3,767, సత్తుపల్లి- 3,896, కొత్తగూడెం-4863, మణుగూరు-3697, భద్రాచలం- 3,743, అశ్వారావుపేటలో 3,686 నీటి నమూనాలు పరీక్షించారు.

తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం, బ్యాక్టీరియా, నైట్రేట్స్ సహా వివిధ రకాల ఖనిజాలు, రసాయనాల స్థాయిని ప్రయోగశాలలో పరీక్షించి నీటి నాణ్యత ధ్రువీకరిస్తారు.

**49 నీటి వనరుల్లో ఫ్లోరైడ్**

ఖమ్మం జిల్లాలో 49 గ్రామ పంచాయతీల్లోని 49 నీటివనరుల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్నట్లు తేల్చారు. వెంటనే ఈ నీటి వనరులను వినియోగించకుండా మూసేశారు. బోర్లలో నీటిని పరీక్షించినప్పుడు ఫ్లోరైడ్ గుర్తించారు. ఫ్లోరైడ్ 1 నుంచి 1.5 మి.గ్రా.వరకు లీటర్ నీటిలో ఉండొచ్చు. అంతకు మించిన నీటిని తాగిన వారికి ఫ్లోరోసిస్ వ్యాధి సోకే ప్రమాదముంది. వేసవిలో నీటి వనరుల్లో నీటిమట్టం అడుగంటుతుంది. నీటిమట్టం కిందికి దిగజారేకొద్దీ నీటిలో ఫ్లోరైడ్ శాతం పెరుగుతుంటుంది.

పాఠశాలల్లో పిల్లలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యత ధ్రువపత్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల అడుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు సహా ప్రభుత్వ రంగ సంస్థలు నీటి నాణ్యత పరీక్షలను ఈ ప్రయోగశాలల్లో చేయిస్తుంటాయి.

ప్రైవేటు వ్యక్తులు సైతం తాము ఉపయోగించే నీటి నాణ్యతను ప్రయోగశాలల్లో పరీక్షించుకోవచ్చు. లీటరు నీటిని తెచ్చి ప్రయోగశాలలో అందించాలి. రూ.500చలానా రూపంలో చెల్లించాలి.

గత ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో మున్నేరుకు వరదలు రావటంతో వివిధ గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ దెబ్బతింది. బురద నీరు చేరింది. కలెక్టర్ ఆదేశాలతో వరద ప్రభావిత ప్రాంతాల్లోని నీటి వనరుల నుంచి నమూనాలు సేకరించి పలుమార్లు పరీక్షలు నిర్వహించి ఫలితాల నివేదికను ఉన్నతాధికారులకు అందించాం. అందుకు అనుగుణంగా అప్పట్లో తాగునీటిని సరఫరా చేశారు. ఈఏడాది లక్ష్యాన్ని అధిగమించాం.

వంకాయలపాటి రమాదేవి, ప్రయోగశాలల జిల్లా కన్సల్టెంట్, ఖమ్మం

# మామిడి రైతులకు మహర్దశ



ఖమ్మం : నగరంలో మామిడి మార్కెట్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రోటరీనగర్ సమీపంలోని వీధివ్యాపారుల ప్రాంగణంలో వారం రోజుల్లో ఏర్పాటు చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక కృషితో ముస్తాబవుతోంది. మధ్యవర్తులు లేకుండా రైతులు నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే విధంగా సిద్ధం చేస్తున్నారు. మొత్తం 35 స్టాల్స్‌లో రైతులు పండ్లను విక్రయించేందుకు అవకాశం ఉంది. నగరంలో ఉమ్మడి జిల్లా స్థాయి మామిడి రైతులు, ఎగుమతిదారులకు గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పలువురు రైతులు మామిడి మార్కెట్ ఏర్పాటు గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మార్కెట్ లేకపోవటం వల్ల జరిగే నష్టం గురించి వివరించారు. స్పందించిన ఆయన మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన, వ్యవసాయ, నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ప్రాంగణాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. సీజనల్ మార్కెట్‌గా దీన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో 32వేల ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 12వేల ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. దీని ద్వారా 1.80లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఇక్కడి నుంచి ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, నాగ్‌పుర్, కోల్‌కతా, ముంబయి, లఖ్‌నవూకు రవాణా చేస్తారు. అక్కడి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికా, యూకే, కువైట్, ఖతర్, కెనడా, నేపాల్, సింగపూర్, న్యూజిల్యాండ్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు.

**ఫ్రూట్ కవర్ల కోసం వినతి..**

పండ్ల నాణ్యత దెబ్బతినకుండా ఉండేందుకు తమకు ఫ్రూట్ కవర్లను రాయితీపై అందజేయాలని మామిడి రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మార్కెటింగ్‌శాఖ అధికారులు వ్యవసాయ మార్కెట్ల ద్వారా, సహకారశాఖ అధికారులు సహకార సంఘాల ద్వారా రైతులకు ఎక్కడ అవసరమో గుర్తించి అందుకు అనుగుణంగా వారిని సరఫరా చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు.

**మండీలే దిక్కు..**

ప్రస్తుతం మామిడి పంటకు పలు రకాల తెగుళ్లు ఆశిస్తున్నాయి. వీటికి అనేక రకాల పురుగు మందులు వాడినప్పటికీ అదుపులోకి రావటం లేదు. ఫలితంగా రైతులకు పెట్టుబడి పెరగటంతో దిగుబడి తగ్గిపోతోంది. నాణ్యమైన పంట సైతం అంతంత మాత్రంగానే ఉంటుంది. నాణ్యతలేని పంటకు మార్కెట్‌లో సరైన ధర లభించదు. విదేశాలకు ఎగుమతి చేయాలంటే నిబంధనలు మరింత కఠినతరంగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, నాణ్యతగల దిగుబడులు పెంచేందుకుగాను అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సైతం మామిడికాయలు కొనేందుకు అనేక మంది వ్యాపారులు ప్రతి సంవత్సరం ఇక్కడకు రావటం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో మామిడి మండీలను ఏర్పాటు చేశారు. ఇక్కడే గ్రేడింగ్ చేసిన అనంతరం పొరుగు రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు.

# సిబ్బంది లేక ఇబ్బంది..!

ఖమ్మం: ఖమ్మం ప్రభుత్వ బోధనాసుపత్రి (సర్వజనాసుపత్రి)లో వైద్యనిపుణుల కొరత వేధిస్తోంది. కీలకమైన రేడియాలజీ విభాగంలో నిపుణులు లేకపోవటంతో స్కానింగ్ పరీక్షల నిర్వహణ, వ్యాధి నిర్ధారణ నివేదికల జారీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు పలుమార్లు వైద్యాధికారులు నోటిఫికేషన్ వెలువరించినా అభ్యర్థుల నుంచి స్పందన లేదు. ప్రభుత్వం చెల్లించే వేతనాల పట్ల నిరాసక్తతే పోస్టుల భర్తీకి ఆటంకంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఖాళీలు ఎక్కడెక్కడంటే.. సర్వజనాసుపత్రిలో 34 విభాగాలు ఉంటాయి. 115 పోస్టులకు 39 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 21విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ అధ్యాపక పోస్టుల్లో



ఏదో ఒకటి ఖాళీగా ఉంటోంది. రేడియాలజీలో నాలుగు, కమ్యూనిటీ మెడిసిన్, ఫిజికల్ మెడిసిన్, హాస్పిటల్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్‌లో మూడేసి చొప్పున, జనరల్ మెడిసిన్, అనాటమీ, ఫార్మకాలజీ, ఫొరెన్సిక్ మెడిసిన్, సైకియాట్రీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, గైనకాలజీలో రెండేసి చొప్పున, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, డెర్మటాలజీ, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, డెంటల్, రెస్పిరేటరీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఒక్కోటి చొప్పున పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.


బోధనాసుపత్రిలో ఆచార్యుల పోస్టుల భర్తీకి పలుమార్లు నోటిఫికేషన్లు ఇచ్చాం. అభ్యర్థుల నుంచి స్పందన కనిపించలేదు. దరఖాస్తులు వచ్చిన వాటిలో అర్హులుంటే వెంటనే భర్తీ చేస్తున్నాం. ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. ప్రస్తుతం ఒకట్రెండు విభాగాలు మినహాయిస్తే వైద్యసేవలు, బోధనకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఖాళీలను భర్తీ చేసేందుకు మరోమారు నోటిఫికేషన్ ఇచ్చేందుకు యత్నిస్తున్నాం. డాక్టర్ రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, సర్వజనాసుపత్రి, ఖమ్మం

# ఆదాయం ఘనం.. వసతులు గగనం..!

వేంసూరు : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అనేక దేవాలయాలకు వందలు, వేలాది ఎకరాల భూములున్నా, అధికాదాయం సమకూరుతున్నా.. ఆమేరకు అభివృద్ధి పనులు జరగటం లేదు. ఉభయ జిల్లాల్లో రూ.2లక్షల్లోపు ఆదాయం కలిగిన ఆలయాలకు భక్తుల విన్నపాల మేరకు పాలకవర్గాలను అధికారులు నియమించారు. రూ.25లక్షల ఆదాయం కలిగిన ఆలయాలకు జిల్లా కమిషనరేట్ స్థాయిలో పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. ఖమ్మం జిల్లాలో జమలాపురం, కందుకూరు, భద్రాద్రి జిల్లాలో భద్రాచలం, అన్నపురెడ్డిపల్లి, పెద్దమ్మగుడి తదితర ఆలయాలకు సుమారు దశాబ్దకాలంగా పాలకవర్గాలు లేవు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో 190, భద్రాద్రి జిల్లాలో 32 ఆలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 14,391.32 ఎకరాల భూముల్లో 1,284.07 ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు రెవెన్యూశాఖ లెక్కలు చెబుతున్నాయి.

తాత్కాలిక కమిటీలతోనే సరి.. రూ.25లక్షల కంటే ఎక్కువ ఆదాయం వస్తున్న ఆలయాలకు ఉత్సవాల సమయంలో మూడు నుంచి ఆరునెలల కాలపరిమితితో తాత్కాలిక కమిటీలను దేవాదాయశాఖ అధికారులు నియమిస్తున్నారు. ఈ కమిటీలకు పర్యవేక్షణ మినహా ఎలాంటి అధికారాలు ఉండవు. ఆలయ నిర్వహణలో దేవాదాయశాఖ, ఆలయ అధికారులు ఏపని చేయాలన్నా ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. పాలకవర్గాలను నియమిస్తే ప్రధానంగా ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవచ్చు. ప్రభుత్వంతో చర్చించి ఆలయాల పునరుద్ధరణ, అదనపు శాశ్వత నిర్మాణాలకు నిధులు రాబట్టే అవకాశముంది. ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

వేంసూరు మండలం కందుకూరులో కాకతీయుల కాలం నాటి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 365 ఎకరాల భూమి ఉంది. ఏటా రూ.30లక్షల పైచిలుకు ఆదాయం వస్తుంది. ఆలయ ముఖమండపం శిథిలావస్థకు చేరుకుంది. మూలవిరాట్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల మందిరాలు, రథశాలను పునర్నిర్మించాలి. ఆలయాభివృద్ధికి అదే గ్రామానికి



చెందిన హెటిరోడ్రగ్స్ అధినేత, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి రెండేళ్ల క్రితం రూ.2కోట్లు విరాళం ప్రకటించారు. తితిదే నుంచి మరో రూ.4కోట్లు మంజూరయ్యాయి. అయినా ఆలయాభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోవటం లేదు.

అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి 2,224 ఎకరాల భూములున్నాయి. వీటిపై వచ్చే ఆదాయంతో దుకాణాల సముదాయం, కోనేరు నిర్మించాలనే ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. రేణుకాచౌదరి కేంద్ర పర్యాటకశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆలయాభివృద్ధికి రూ.కోటి ప్రకటించినా వినియోగించుకోలేదు. తెలంగాణ తిరుపతిగా పేరొందిన ఎర్రుపాలెం మండలం జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 62.50 ఎకరాల భూమి ఉంది. దీనిపైనా, భక్తుల కానుకల రూపంలో ఏటా సగటున రూ.6కోట్లు ఆదాయం సమకూరుతుంది. అన్నదానం నిమిత్తం మరో రూ.3కోట్లు ఉన్నాయి. అయినా ఆలయంలో భోజనశాల సౌకర్యాలు మెరుగుపడటం లేదని భక్తులు వాపోతున్నారు. రూ.25లక్షల కన్నా ఎక్కువ ఆదాయం కలిగిన ఆలయాలకు సంబంధిం చి ప్రకటనలిచ్చాం. త్వరలో పాలకవర్గాలను నియమిస్తాం. జీపీఎస్ పద్ధతిలో సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగిస్తాం. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తాం. వీరస్వామి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్

చురకలు



# వ్యవసాయానికి వాడే విద్యుత్తు 1 శాతమే!

ఇతర వర్గాల వినియోగదారులతో పోల్చితే భద్రాద్రి జిల్లాలో వ్యవసాయానికి వాడుతున్న విద్యుత్తు ఒక్క శాతమేనని విద్యుత్తుశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత ఐదేళ్లలో వ్యవసాయానికి వినియోగించిన విద్యుత్తు వార్షిక సగటు వృద్ధి 20.36 లక్షల యూనిట్లుగా నమోదైంది. గృహాలకు 1,131.10, గృహేతర(వాణిజ్య) 779.85, పరిశ్రమలు 53.54, వీధిదీపాలు, నీటి సరఫరా 107.74, ప్రార్థన మందిరాలు, పాఠశాలలల్లో 100.97 లక్షల యూనిట్ల వార్షిక సగటు వృద్ధి కనిపించింది. జిల్లాలో 2020–21లో 20,671.16లక్షల యూనిట్ల విద్యుత్తు డిమాండ్ ఉండగా 2024–25 నాటికి 31,787.93లక్షల యూనిట్లకు చేరింది.

**మీటర్ రీడింగ్‌లు లేకపోవటంతో..**

జిల్లాలో 2020–21లో 20,671.16లక్షల యూనిట్లలో 226.28లక్షల యూనిట్ల (1.09%) విద్యుత్తును వ్యవసాయానికి వినియోగించారు. 2024–25లో 31,787.93లక్షల యూనిట్లలో 330.79లక్షల యూనిట్ల(1.04%) విద్యుత్తును వ్యవసాయానికి



వాడారు. గత ఐదేళ్లలో వ్యవసాయానికి వాడిన విద్యుత్తులో 104.51లక్షల యూనిట్ల వృద్ధి నమోదైంది. అయినప్పటికీ మొత్తం వినియోగంలో వ్యవసాయం వాటా ఒక్క శాతంగానే ఉంది. అయితే వ్యవసాయానికి వాడే విద్యుత్తు విషయంలో స్పష్టమైన మీటర్ రీడింగ్‌లు లేకపోవటం, ఒక్క కనెక్షన్‌పై ఎక్కువ మోటార్లు వినియోగించటం తదితరాల వల్ల తక్కువగా నమోదవుతోందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

**పరిశ్రమలకు తగ్గింది..**

ఐదేళ్లుగా జిల్లాలో పరిశ్రమలకు వినియోగించే విద్యుత్తు వాటా శాతం తగ్గుతూ వస్తోంది. 2020–21లో 1,324.21లక్షల యూనిట్ల కరెంట్(మొత్తం వినియోగంలో 6.40%) పరిశ్రమలకు వాడితే.. 2024–25నాటికి అది 1,591.93లక్షల యూనిట్లకు పెరిగినప్పటికీ మొత్తం వినియోగంతో(31,787.93) పోల్చితే 5శాతానికి తగ్గింది. జిల్లాలో ప్రధాన పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూతపడటం, ఆశించిన స్థాయిలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకాకపోవటమే దీనికి కారణమని తెలుస్తోంది.

**పెరిగిన వాణిజ్య సముదాయాల వాటా**

జిల్లాలో అత్యధిక విద్యుత్తు వినియోగం వాటా గృహాలదే. 2020–21లో 20,671.16లక్షల యూనిట్లలో 12,394.36లక్షల యూనిట్లు (60%) గృహ అవసరాలకే వాడారు. 2024–25నాటికి గృహ వినియోగం 18,049.90లక్షల యూనిట్లకు పెరిగినప్పటికీ మొత్తం విద్యుత్తు వాడకం (31,787.93లక్షల యూనిట్ల)లో గృహాల వాటా 56.80శాతానికే పరిమితమైంది. ఇదే సమయంలో గృహేతర(వాణిజ్య) విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరిగింది. 2020–21లో 4,888.08లక్షల యూనిట్లు(మొత్తం వినియోగంలో 23.65%) ఉ

# అందని ద్రాక్షగా త్రీఫేజ్ విద్యుత్తు

ఉట్నూరు: వ్యవసాయానికి అవసరమైన త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యాన్ని గిరిజన రైతులకు ఉచితంగా అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. అటవీశాఖ అభ్యంతరాలతో పనులు ముందుకు సాగడం లేదు. ఉమ్మడి జిల్లాలోని 180 గ్రామాలు రిజర్వు అటవీ ప్రాంతంలో ఉన్నాయని వాటిలో పనులు చేయడానికి అనుమతి లేదని అటవీశాఖ అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లాలో రూ.3.71కోట్లతో చేపట్టిన ఈ పథకంపై కథనం.

'గిరివికాసం' పథకంలో గిరిజన రైతులకు ఉచితంగా బోరు, మోటారు అందజేయడం, ఐటీడీఏ ఆధ్వర్యంలో విద్యుత్తు సంస్థ ద్వారా గిరిజన గ్రామాలకు త్రీఫేజ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టింది.

చేపట్టాల్సిన పనులివే..

ఉచిత త్రీఫేజ్ విద్యుత్తు కనెక్షన్ల కోసం ఎంపిక చేసిన గ్రామాలలో ఆదివాసీ గిరిజన రైతుల చేనుల వరకు త్రీఫేజ్ విద్యుత్తు సౌకర్యం కల్పించాలి. అవసరమైన స్తంభాలు ఏర్పాటు చేయడం, కొత్తగా తీగలు అమర్చడం, ముగ్గురు, నలుగురు రైతులుంటే వారికి 25 కేవీఏ, అయిదు నుంచి పది మంది వరకు ఉంటే 63కేవీఏ, పది నుంచి 100 మంది రైతులుంటే 100కేవీఏ నియంత్రికలను ఏర్పాటు చేయాలి. అవసరమైన నిధులను ఐటీడీఏ ద్వారా నేరుగా తెలంగాణ ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ(టీఎస్ఎన్‌పీడీసీఎల్)కు చెందిన అధికారులకు డీడీల రూపంలో చెల్లిస్తోంది.

ఇదీ వరుస.. ఉట్నూరు మండలం శాంతాపూర్, ఎర్రగుట్ట, హీరాపూర్, బాబాపూర్ గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉన్నాయని అక్కడ పనులు చేయడానికి అనుమతి లేదని అటవీశాఖ పనులను అడ్డుకుంది.

ఇచ్చోడ మండలం బాబాజీపేట్, గోండుగూడ గ్రామాలలో పనులు నిలిచిపోయాయి.సిరికొండ మండలం భీంపూర్, చినయంగూడ, చింతగూడ, రాంనగర్ గ్రామాలలోనూ ఇదే పరిస్థితి.

కెరమెరి, తిర్యాణి, సిర్పూరు(యు) మండలాలలోని గ్రామాలలో అటవీశాఖ పనులను అడ్డుకుంది.

నిర్మల్ జిల్లా పెంబి, మిద్దెచింత, గండిగోపాల్‌పూర్, జంగుగూడ, కోలాంగూడలో నిలిచిపోయాయి.

కుమురం భీం జిల్లా బెజ్జూర్, దహెగాం, కెరమెరి మండలాలలోని రెబ్బెన, కొతిమీర్, అనార్‌పల్లి గ్రామాలలో పనులు ముందుకు సాగడంలేదు.మంచిర్యాల జిల్లా కోటపల్లి, నెన్నెల మండలాల్లో కోనంపేట, అల్లన్, బోగంపల్లి గ్రామాలలో పనులు నిలిచిపోయాయి.

ఈయన ఉట్నూరు మండలం శాంతాపూర్‌కు చెందిన ఆదివాసీ రైతు మాన్కు. మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. త్రీఫేజ్ కరెంటు సదుపాయం లేక వర్షాధారంగా సేద్యం చేయాల్సిన పరిస్థితి. గ్రామానికి త్రీఫేజ్ కరెంటు సౌకర్యం మంజూరైనా అనుమతి లేదని అటవీశాఖ పనులను అడ్డుకుంది. చేనులో వేసిన బోరును చూపిస్తున్న ఈ గిరిజన రైతులు రెడ్డి పోశయ్య, లస్మయ్య. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కోనంపేటకు చెందిన వారు. గిరి వికాసం పథకంలో ప్రభుత్వం వీరికి ఉచితంగా బోరు వేయించింది. త్రీఫేజ్ కరెంటు సౌకర్యం కల్పించేందుకు పనులు చేపట్టగా అటవీశాఖ అభ్యంతరంతో పనులు నిలిచిపోయాయి.

# అనుమతులు తుస్సు.. కాలుష్యం బుస్సు



హైదరాబాద్: పర్యావరణ అనుమతుల్లేకుండానే (ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్) పైలట్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. బాహ్యవలయ రహదారి పరిధిలో ఫార్మా, బల్క్‌డ్రగ్, బల్క్‌డ్రగ్ మధ్యంతర ఉత్పత్తుల ఆర్అండ్‌డీ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్–కమర్షియల్) యూనిట్లను ఏర్పాటు చేయొద్దనే ఉత్తర్వులున్నా.. పరిశోధనల్లో ఉత్పత్తి సామర్థ్యం రోజుకు ఒక కేజీకి మించొద్దని చెబుతున్నా.. వందల లీటర్ల రియాక్టర్ల సామర్థ్యంతో ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. దీంతో నాచారం, మల్లాపూర్, బాలానగర్ ఐడీఏ, పైప్‌లైన్‌రోడ్ మార్గంలో రసాయన వ్యర్థజలాలు పోటెత్తి అక్కడి జలాశయాలు కాలుష్యకాసారాలుగా మారుతున్నాయి. అనుమతుల్లేకుండా పైలట్ ప్లాంట్ నడుపుతున్న నాచారంలో క్యూర్‌డ్రగ్స్ అనే ఓ ఫార్మా కంపెనీపై పీసీబీ ఇటీవల చర్యలు తీసుకోవడమే ఇందుకు నిదర్శనం.


**2018లో ప్రభుత్వ ఉత్తర్వులు..**

కాలుష్యకారక పరిశ్రమలను అవుటర్ అవతలికి తరలించేందుకు 2018జనవరి20న జీవోఎంఎస్–4 ద్వారా అప్పటి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రెడ్, ఆరెంజ్ కేటగిరీల పరిశ్రమల వివరాలు వాటి ఏర్పాటులో పరిమితులను అందులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కి తరలించకుండా నేరుగా జలాశయాలకు, డ్రైనేజీకి కలుపుతుండటంతో భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. బల్క్‌డ్రగ్, ఫార్మా యూనిట్ల (రెడ్, ఆరెంజ్ కేటగిరీ)తో పాటు ఇతర పరిశ్రమల నిర్వాహకులు కేవలం జీఎస్టీ, మున్సిపల్, పరిశ్రమల నుంచి అనుమతులు తీసుకుంటున్నారు. పీసీబీ నుంచి అనుమతులు తీసుకుంటే సభ్యత్వం, సీఈటీపీకి వ్యర్థ జలాల తరలింపునకు ఖర్చు పెరుగుతుందని భావిస్తుండటంతో విపరీతంగా కాలుష్యం నమోదవుతోంది. మూడు నుంచి నాలుగు అంతస్తుల్లో పైన ఆర్అండ్‌డీ యూనిట్లు, కింద పైలట్‌ప్లాంట్‌లు పెట్టి పర్యావరణ అనుమతులు లేకుండానే వ్యాపారం సాగిస్తున్నారు. మల్లాపూర్, నాచారం, చర్లపల్లి, ప్రశాంత్‌నగర్, ప్రగతినగర్ రాజీవ్‌నగర్, గాంధీనగర్, జీడిమెట్ల, మేడ్చల్, హయత్‌నగర్‌లో ఈ తరహా పైలట్‌ప్లాంట్‌లు ఎక్కువగా నడుస్తున్నాయి.

**భారీగా జరిమానాలు..**

పర్యావరణ అనుమతులు లేకపోతే పరిశ్రమ ఏర్పాటుకు చేసిన పెట్టుబడిలో 30శాతం వరకూ జరిమానా విధించే ఆస్కారం ఉంది. అనుమతుల్లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నా పీసీబీ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు చేయడం లేదన్న విమర్శలున్నాయి. మున్సిపల్, జీఎస్టీ, పరిశ్రమలశాఖ నుంచి అనుమతులు తీసుకున్న జాబితాను పరిశీలిస్తే ఎక్కడ, ఎవరు ఏఏ పరిశ్రమలు ఉత్పత్తులు సరఫరా చేస్తున్నారో తెలిసే అవకాశం ఉంటుంది. ఆ జాబితా ఆధారంగా యూనిట్లలో తనిఖీలు చేస్తే భారీ స్థాయిలో జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది.

# లక్ష్యానికి దూరం.. అపార్



బొంరాస్‌పేట: జాతీయ విద్యా విధానం ప్రకారం దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులందరికీ ప్రత్యేక గుర్తింపు కార్డును రూపొందించడానికి అపార్ కార్డును జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'ఒకే దేశం–ఒకే విద్యార్థి' అనే లక్ష్యంతో కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు ఆధార్ కార్డు తరహాలో 12 అంకెలతో అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజస్ట్రీ) సంఖ్యను కేటాయించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లాలో ఈ ప్రక్రియను గత ఏడాది నవంబరులో ప్రారంభించగా విద్యా సంవత్సరం ముగుస్తున్నా విద్యార్థులందరి వివరాలను నమోదు చేయలేకపోయారు.

**హెచ్ఎంలతో అవగాహన కల్పించినా..**

అపార్ ఐడీ జనరేట్‌లో పలు ఇబ్బందులు ఎదురవుతున్నందున పాఠశాలలు పూర్తిస్థాయిలో లక్ష్యం చేరుకోలేకపోతున్నాయి. జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలల హెచ్ఎంలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి అపార్ నమోదుపై అవగాహన కల్పించారు. అయినా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. అపార్ కార్డు ద్వారా కేటాయించే సంఖ్య విద్యార్థికి జీవితకాలం ఐడీగా పరిగణిస్తారు. వివరాలు పూర్తి గోప్యంగా ఉంటాయి. దీనిని రూపొందించడానికి విద్యార్థి తల్లిదండ్రుల అంగీకారం తప్పక తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

**ఇవీ ఎదురవుతున్న ఇబ్బందులు**

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ పాఠశాలలో, ఆధార్ కార్డులో ఒకేవిధంగా ఉండాలి. ఏ ఒక్క అక్షరం తేడా ఉన్నా నమోదు కావడం లేదు.

తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను రికార్డుల్లో రాయించే సమయంలో పేరు, పుట్టిన తేదీ ఒకలా రాయించి ఆధార్ నమోదు సమయంలో మరో విధంగా రాయించారు.

పుట్టిన తేదీ మార్చుకోవాలంటే ఆధార్ సెంటర్‌లో జనన ధ్రువీకరణ పత్రాలు అడుగుతున్నారు. చాలామంది వద్ద ఇవి లేవు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు.. 1,066

ప్రైవేటు.. 198

మొత్తం విద్యార్థులు.. 1,53,169

ఇప్పటివరకు అపార్ ఐడీ నమోదు.. 88,719


ఎన్నో ఉపయోగాలు

విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

అపార్ గుర్తింపుతో డిజీ లాకర్‌కు అనుసంధానమవుతారు. విద్యా సంబంధ విషయాలు, ధ్రువపత్రాలు డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరుచుకోవచ్చు.

ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రయోజనాలు, వివిధ విద్యా సంస్థల్లో చేరికలు, మార్పులు, ఉద్యోగాల భర్తీ సమయం ఇతర సందర్భాల్లో సమాచారం అపార్ ఆధారంగా నిర్వహించేలా కార్డును రూపొందిస్తారు.

# సాగర్ ఆయకట్టుకు సాగునీరు బంద్



ఖమ్మం : జిల్లాలో సాగర్ కాలువకు సాగునీటి సరఫరా గురువారం అర్ధరాత్రి నుంచి బంద్ చేశారు. రబీ సీజన్‌లో పంటల సాగుకు ఏప్రిల్ 24 వరకు అందిస్తుంటారు. ఈ ఏడాది అలాగే ఇస్తామని మొదట నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. సాగర్ జలాశయంలో నీటిమట్టం తగ్గుతున్నందున వేసవిలో హైదరాబాద్ నగరం సహా వివిధ జిల్లాలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలనే ఉద్దేశంతో 14 రోజుల ముందుగానే సాగునీటి సరఫరా ఆపేశారు. సాగర్ జలాశయం వద్ద ఎడమ కాలువకు నీటి విడుదల ఆపేయగా, అర్ధరాత్రి పాలేరు రిజర్వాయర్ అవుట్ ఫాల్ నుంచి దిగువకు నీటి విడుదల నిలిపేశారు. పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం 23 అడుగులకు చేరగా.. వైరా రిజర్వాయర్ పూర్తిగా నిండింది. సాగర్ కాలువల పరిధిలో సుమారు 300కు పైగా చెరువులకు వారం రోజులుగా నీటిని అందించగా.. నీటిమట్టం పెరిగింది. పాలేరు పాత కాలువ కింద ఆయకట్టుకు కొన్ని రోజులు నీటిని విడుదల చేయనున్నారు. 21 ఎంబీసీ, 16, 17 (నందిగామ), బోనకల్లు, మధిర బ్రాంచి కాలువలు సహా అన్ని మేజర్, మైనర్ కాలువలకు నీటి సరఫరా నిలిచిపోయింది. వైరా మండలం రెబ్బవరం గ్రామంలో సుమారు 100 ఎకరాల్లో వరి పంట పొట్ట దశలో ఉందని, స్థానిక వనరులతో పంట కాపాడుకోవాలని అక్కడి రైతులకు అధికారులు సూచించారు. జిల్లావ్యాప్తంగా సాగర్ ఆయకట్టులో మొక్కజొన్న, వరి పంటలు కోతకొచ్చాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో సాగర్ ఆయకట్టుకు విజయవంతంగా సాగునీరు సరఫరా చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల బంద్ చేసినట్లు జలవనరులశాఖ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు తెలిపారు.

# వన్యప్రాణులకు ప్రత్యేక వంతెనలు

ఆదిలాబాద్ : మనుషుల అవసరాల కోసం అడవుల మధ్య నుంచి రోడ్లు వేసుకుంటే.. జంతువులకు ఇబ్బంది కదా! అందుకే వాటి తోవలను వాటికి వదిలేస్తూ.. రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. అటవీ ప్రాంతాల్లో రోడ్లు దాటుతున్న సమయంలో వాహనాలు తగిలి వన్యప్రాణులు చనిపోతున్నాయని గుర్తించిన ప్రభుత్వం జంతువులు ఎక్కువగా దాటే జాతీయ రహదారులపై ఓవర్‌పాస్, అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతోంది. ఇలాంటి వంతెనలు తెలంగాణలో తొలిసారిగా మంచిర్యాల–చంద్రాపూర్(63), జగిత్యాల – భీవండి(61) జాతీయ రహదారులపై జంతువుల కోసం ప్రత్యేకంగా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

**జంతువుల సంరక్షణే ధ్యేయంగా..**

మహారాష్ట్ర నుంచి తెలంగాణ అటవీ ప్రాంతానికి జంతువుల రాకపోకలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రెండు రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి మీదుగా జంతువులు వెళుతుంటాయి. ఇందులో భాగంగా వన్యప్రాణుల రాకపోకలతో పాటు వాటికి ప్రమాదం జరగకుండా ఉండేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా మంచిర్యాల – చంద్రాపూర్ జాతీయ రహదారిపై వాంకిడి సమీపంలో రూ.30 కోట్ల వ్యయంతో పర్యావరణ వంతెన(ఓవర్‌పాస్ ఎకో బ్రిడ్జి) నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కింది నుంచి వాహనాలు వెళ్తుంటే పైనుంచి జంతువులు వెళ్లేలా దీన్ని నిర్మిస్తున్నారు. తాజాగా మహారాష్ట్రలోని భీవాండి నుంచి తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిపై జంతువుల సంరక్షణను దృష్టిలో పెట్టుకొని ఖానాపూర్ పరిధిలో అండర్‌పాస్ వంతెనల నిర్మాణం జరుగుతోంది.

ఏటా 3 వేల జంతువుల మరణం

రోడ్డు దాటే సమయంలో చనిపోతున్న జంతువులపై మహారాష్ట్రకు చెందిన అశ్వమేధ ప్రతిష్ఠాన్ అనే సంస్థ సర్వే నిర్వహించింది. జాతీయ



రహదారి పొడవునా మహారాష్ట్రలోనే మూడు వేల జంతువులు చనిపోతున్నాయని గుర్తించినట్లు సంస్థ అధ్యక్షుడు అవినాష్ తెలిపారు. మృతి చెందిన వాటిలో చిరుత, ఎలుగుబంట్లు, జింకలు 20కిపైగా ఉండగా, మిగిలినవి చిన్న చిన్న జంతువులని ఆయన తెలిపారు. మహారాష్ట్రలో నిర్మాణమయ్యే జాతీయ రహదారులపై ఏయే ప్రాంతాల్లో అండర్‌పాస్ వంతెనలు అవసరమనేది నివేదించినట్లు ఆయన తెలిపారు.

**నాలుగు చోట్ల..**

మహారాష్ట్ర భీవండి నుంచి నిర్మల్ మీదుగా జగిత్యాల వరకు 758 కి.మీ దూరం జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తెలంగాణలో 57 కి.మీ దూరం పొడవునా, నిర్మల్, ఖానాపూర్, మల్లపురం, రాయికల్, జగిత్యాల వరకు జరిగే జాతీయ రహదారి పనుల్లో ఖానాపూర్ సమీపంలో అటవీ ప్రాంతం నుంచి వెళుతుంది. గతంలో ఉన్న రోడ్డు దాటే సమయంలో వన్యప్రాణులకు హాని కలగడం, రోడ్డు దాటే జంతువుల కారణంగా కొద్ది దూరంలో ఆగి వేచిచూడటం, కొన్ని సార్లు జంతువుల దాడికి గురైన సందర్భాలు ఉన్నాయి. జంతువుల సంరక్షణను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం అటవీశాఖ అధికారుల ప్రతిపాదనల మేరకు వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా, పైనుంచి వాహనాలు, కింది నుంచి జంతువులు వెళ్లేందుకు వీలుగా రూ.42 కోట్ల వ్యయంతో నాలుగు ప్రాంతాల్లో అండర్ పాస్ వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండు చోట్ల కి.మీ పొడవునా, మరో రెండు చోట్ల తక్కువ దూరంతో బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోంది.

# అడవుల జిల్లా ఆకాంక్ష.. విశ్వవిద్యాలయం

నిర్మల్ : అభివృద్ధిలో అట్టడుగున ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇతర ప్రాంతాలతో పోలిస్తే అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉంది. ముఖ్యంగా చదువుల తల్లి సరస్వతీదేవి కొలువైన ఈ ప్రాంతంలో ఉన్నత విద్యావకాశాలు లేకుండా పోతున్నాయి. ఈ ప్రాంతంలో విశ్వవిద్యాలయ ఏర్పాటు ఇప్పటికీ తీరని కలగా మారింది. ఎప్పటికప్పుడు పాలకులు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని ప్రకటిస్తున్నా ఆచరణలో విఫలమవుతున్నారు.

**నీరుగారుతున్న లక్ష్యం**

ప్రతీ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని 2007లో నేషనల్ నాలెడ్జ్ కమిషన్ సూచించింది. ఈ మేరకు శ్రీ జ్ఞానసరస్వతి విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ నిర్ణయం తీసుకున్నారు. కానీ రాజకీయ పరిణామాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అప్పటి నుంచి యూనివర్సిటీ ఏర్పాటుకోసం ఉద్యమాలు సాగుతూనే ఉన్నాయి. విశ్వవిద్యాలయ సాధనసమితి ఆధ్వర్యంలో కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ, పలువురు ముఖ్యమంత్రులతో పాటు ఉన్నత విద్యామండలికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండాపోయింది.

**ప్రణాళిక దశలో నిలిచిన సీఎం హామీ**

గత ప్రభుత్వం జిల్లాలో విశ్వవిద్యాలయ ఏర్పాటును విస్మరించింది. కాంగ్రెస్ కొత్తగా అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండుసార్లు జిల్లా పర్యటనకు వచ్చినపుడు యూనివర్సిటీ ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. తర్వాత ఉన్నత విద్యాశాఖ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖమ్మం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో కొత్తగూడెంలో మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చేందుకు నివేదిక రూపొందించాలని ప్రభుత్వం తాజాగా ఉన్నత విద్యామండలికి ఆదేశాలు జారీచేసింది. అదే సమయంలో ఆదిలాబాద్ విషయం మాత్రం పక్కన పెట్టేశారు. దీంతో ఉమ్మడి జిల్లా వాసులు తీవ్రంగా కలత చెందుతున్నారు.

**ఈ సమావేశాలే కీలకం**1991లో నిర్మల్ పట్టణంలో ప్రారంభమైన కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలను ఉన్నతీకరించేందుకు గతంలోనే ప్రతిపాదించి, అనుమతించి, నిధులు మంజూరు చేసినా స్థానిక నేతల వైఫల్యంతో కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో సానుకూల ప్రకటనలు చేసిన తరుణంలో నిర్మల్ కళాశాలను ఉన్నతీకరణకు అవకాశాలు సుగమమయ్యాయి. దీనికోసం ప్రస్తుతం జరగబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో తగిన నిధులు కేటాయించడం కీలకంగా మారనుంది. ప్రభుత్వం చొరవచూపి బడ్జెట్ కేటాయిస్తే శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయంగా ఉన్నతీకరణ జరుగుతుంది. ఇక్కడ సాధ్యం కాని పక్షంలో ఉమ్మడి జిల్లాలో ఇతర ప్రాంతంలోనైనా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు వచ్చే బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని, ఇది అత్యవసరమే కాదు జిల్లావాసులకు ఎంతో ఆవశ్యకమని శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయ సాధన సమితి అధ్యక్షుడు నంగె శ్రీనివాస్ పేర్కొన్నారు. **విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయొద్దు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, భాజపా శాసనసభాపక్షనేత, నిర్మల్**విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయొద్దు. ఉమ్మడి జిల్లాలో విద్యారంగ సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు అంతంతే. యూనివర్సిటీ ఏర్పాటు అందరి కల. గత పాలకులు విస్మరించారు. ఉట్నూరు కేంద్రంగా గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తామన్నా ఆచరణలోకి రాలేదు. నిర్మల్‌లోని యూనివర్సిటీ పీజీ కళాశాల ఉన్నతీకరణ నిలిచిపోయింది. ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క సొంత జిల్లాకే ప్రాధాన్యమిస్తు న్నారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సహకరించాలి. **నిధులు కేటాయించాలి అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన జిల్లాను నిర్లక్ష్యం చేయడం సరికాదు.

## సాగునీరు.. సజావుగా చేరేలా..

కొత్తగూడెం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు వర్షాకాలంలోగా మరమ్మతులు పూర్తిచేయటంపై అధికారులు దృష్టి సారించారు. ఈమేరకు కాల్వల మరమ్మతులు, మొక్కల తొలగింపు, పంపుహౌస్‌ల నిర్వహణ, ప్రాజెక్టుల గేట్లను బాగుచేయటం వంటి వాటిపై ఉభయ జిల్లాల సీఈలు ఈఎన్‌సీ(ఇంజినీర్ ఇన్ చీఫ్)కి ప్రతిపాదనలు పంపించారు. వీటిని బుధ, గురువారాల్లో ఉన్నతాధికారులు పరిశీలించారని, త్వరలోనే ఆమోదం లభించనుందని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు.

ఖమ్మం జిల్లాలో రూ.4.73 కోట్లతో ప్రతిపాదనలు: సాగునీటి వనరుల సంరక్షణ, నిర్వహణలో భాగంగా భద్రాద్రి జిల్లాల్లో రూ.5కోట్లు, ఖమ్మం జిల్లాలో రూ.4.73కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు జలవనరులశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ప్రధానంగా నీటిని పంట పొలాలు, ఇతర ప్రాంతాలకు సరఫరా చేసే కాల్వల్లో లీకేజీలను సరిచేయటానికి కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఎత్తిపోతల పథకాల్లో మరమ్మతులకు గురైన మోటార్ల స్థానంలో కొత్తవాటిని అమర్చనున్నారు. జలాశయాల్లోని గేట్లలో లీకేజీలు, ఇతర సమస్యలను సరిచేయనున్నారు. ప్రధాన జలాశయాలు తాలిపేరు, కిన్నెరసాని, వైరా, పాలేరు, వెంగళరావు సాగర్ తదితర వాటికి సాధారణ



మరమ్మతులు చేపట్టడంతో పాటు ఏవైనా సమస్యలుంటే పరిష్కరించనున్నారు.

**వార్షిక నిర్వహణ కార్యక్రమాలు ఇలా..**

రుతుపవనాల కంటే ముందు: మే-జూన్ మాసాల్లో జలాశయాల నిర్మాణ స్థితి, గేట్ల పనితనాన్ని తనిఖీ చేస్తారు.

రుతుపవనాల సమయంలో: జులై నుంచి అక్టోబర్ వరకు వర్షాల సమయంలో నీటి ప్రవాహాన్ని, వరదలను నిరంతరం పర్యవేక్షిస్తూ హెచ్చరికలు జారీ చేస్తుంటారు.


ఆ తరువాత: వర్షాకాలం తరువాత నీటి నిల్వలను అంచనా వేసి రబీ కోసం నీటి విడుదల ప్రణాళికలు రూపొందిస్తారు.

**ఎప్పుడెప్పుడు.. ఏమేం చేస్తారంటే**

ఏటా వర్షాకాలానికి ముందు, తర్వాత జలాశయాల నీటి నిల్వ సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. వర్షాకాలం ముందు ప్రాజెక్టు గేట్లు, కాల్వలు తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపడతారు. వీటితో పాటు జలాశయాల్లో పేరుకుపోయిన బురదను తొలగించి నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు ప్రణాళిక రూపొందిస్తారు. వ్యవసాయ అవసరాలు, వరద నియంత్రణకు నీటిని పరిమితంగా విడుదల చేస్తారు. ఇందుకోసం వాతావరణశాఖ నుంచి వచ్చే వర్షపాత అంచనాలను ప్రామాణికంగా తీసుకుంటారు. రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ డేటా ద్వారా జలాశయాల నీటిస్థాయులు, వర్షపాత ప్రభావాన్ని పర్యవేక్షిస్తారు. ప్రాజెక్టుల చుట్టుపక్కనున్న గ్రామాల రైతులతో నీటి వినియోగం, నిర్వహణ సమస్యలను చర్చించి పరిష్కరిస్తారు.

## రబీ ధాన్యం సేకరణకు సిద్ధం

ఖమ్మం : ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు పండించే ధాన్యంలో 2.58 లక్షల మెట్రిక్ టన్నులను పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు 344 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగర్ కాలువలకు నీరు విడుదల చేయలేదు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు విస్తీర్ణం బాగా తగ్గిపోయింది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవటం, సాగర్ కాలువలకు రెండు సీజన్లలో నీరు విడుదల చేయటంతో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన సన్నరకం వడ్లు ప్రభుత్వం కొనుగోలు చేసి క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించింది. రబీ సీజన్‌లో సన్నరకం వడ్ల సాగు పెరిగింది. జిల్లాలో మరో 15 రోజుల్లో వరి కోతలు మొదలై వడ్లు మార్కెట్‌కు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈసారి రబీలో సన్నరకం వడ్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.వ్యవసాయ శాఖ లెక్కల మేరకు రబీ సీజన్‌లో 84,332 హెక్టార్లలో వరి పంట సాగులో ఉంది. ఇందులో 51,626 హెక్టార్లలో సన్నరకం వడ్లు, 32,706 హెక్టార్లలో దొడ్డు రకం సాగు చేస్తున్నారు. 5,45,151 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా బహిరంగ మార్కెట్, రైతుల సొంత అవసరాలకు పోను 2.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం (సన్నరకం 1.85 లక్షలు, దొడ్డు రకం 73 వేలు మెట్రిక్ టన్నులు) పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలుకు నిర్ణయించారు.మే నెల చివరి వరకు ధాన్యం ఖరీదు చేయనున్నారు.



64.62 లక్షల గోనె సంచులు కావాల్సి ఉండగా 19.39 లక్షలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. మరో 45.23 లక్షల సంచులను దశల వారీగా తెప్పించనున్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం జిల్లాలోని 70 మిల్లులకు అప్పగించనున్నారు. మిల్లర్లు ధాన్యం మరపట్టి బియ్యం తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది.

డ్వాక్రా మహిళా సంఘాలు 151, సొసైటీలు (పీఏసీఎస్) 162, డీసీఎంఎస్ 28, మెప్మా 3 చొప్పున మొత్తం 344 కొనుగోలు కేంద్రాలు కేటాయించారు. వీటికి కావాల్సిన టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, డ్రయర్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం పరీక్షించే, తూర్పారా యంత్రాలు సహా అవసరమైన పరికరాలు సమకూర్చుకోనున్నారు.

రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఖరీఫ్‌లో విజయవంతంగా నడిపాం. రబీలోనూ సన్న రకం వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుంది. ఏప్రిల్ మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయి.

గంటా శ్రీలత, డీఎంసీఎస్, ఖమ్మం

# చరమాంకంలో తెలుగు నాటక రంగం... నిర్లక్ష్యం చేస్తే కనుమరుగు ఖాయం

## ఏప్రిల్ 16...తెలుగు నాటకరంగ దినోత్సవం




19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే అంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శింపం చేశారు. తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం. రంగస్థలం వినోద ప్రదేశమే కాదుబీ వివిధ సంస్కృతుల్నీ. జాతుల్నీ, మనుషుల్నీ ఒకటిగా కలిపే ప్రక్రియ. నాటకం సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతము యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసు కోవచ్చు. తెలుగు దేశంలో ఆధునిక నాటక రచన ప్రదర్శనలకు దారితీసిన వారు పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు, ప్రధానంగా పండితులైన కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవశాస్త్రి తదితరులు ఆధునిక తెలుగు నాటక రచనా ప్రారంభ విషయాన ప్రథములు. కందుకూరి వీరేశలింగం, కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమ కవి, వడ్డాది సుబ్బారాయుడు ఆధునిక తెలుగు నాటక ప్రదర్శనారంభ విషయంలో ప్రథములు. ఆధునిక నాటక రచన 1860 ప్రాంతాల్లో ఆరంభంకాగా నాటక ప్రదర్శన మాత్రం 1880 లో ప్రారంభమయ్యింది. ఆధునిక కాలంలో వెలువడిన తొలి తెలుగు నాటకం1860 ప్రాంతాల్లో కోరాడ రామచంద్ర శాస్త్రిచే సంస్కృతంలో నుంచి నాటక లక్షణాలను అనుసరించి తెలుగులో వెలువడిన స్వతంత్ర రచన"మంజరీ మధుకరీయము". 'ఆంధ్రా జాన్సన్ 'గా సుప్రసిద్ధులైన కొక్కొండ వెంకటరత్నం పంతులు 1871లో వారణాశి ధర్మసూరి సంస్కృతంలో రచించిన "నరకాసుర విజయము" అనే వ్యాయోగమును ఆంధ్రీకరించాడు. పరవస్తు వెంకట రంగాచార్యులు 1872 ప్రాంతాల్లో కాళిదాసు రచించిన "అభిజ్ఞాన శాకుంతలము"ను ఆంధ్రీకరించడం జరిగింది. వావిలాల వాసుదేవశాస్త్రి ఆంగ్ల నాటక ఆంధ్రీకరణ ద్వారా జూలియస్ సీజర్ నాటకాన్ని "సీజరు చరిత్రము" అను పేరుతో 1874 లో ఆసాంతం తేటగీతిలో రాశాడు. ఆధునిక నాటక రచనకు ఆద్యులు వారైతే, ఆధునిక నాటక ప్రదర్శన ఆరంభ దశకు కందుకూరి వీరేశలింగం పంతులు, కొండుభొట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, నాదెళ్ళ పురుషోత్తమకవి, వడ్డాది సుబ్బారాయుడు రూపకర్తలు. వీరేశలింగం సంభాషణ రూపాన "బ్రాహ్మ వివాహము" అను ప్రహసనమును తన "హాస్య సంజీవని" అను పత్రికలో రచించగా, అనంతరం "వ్యవహార ధర్మబోధిని" వ్యావహారిక భాషలో రచించి, ప్రదర్శన భాగ్యం కలిగించిన తొలి తెలుగు నాటకమిది. 1880 లో వీరేశలింగం నాటక సమాజాన్ని స్థాపించి "రత్నావళి", "చమత్కార రత్నావళి" అను రెండు నాటకాలను ప్రదర్శించాడు. తెలుగునాట తొలి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత వీరేశలింగందే. ఆయన స్వతంత్ర రచన అయిన "వ్యవహార ధర్మబోధిని", సంస్కృత నాటక అనువాదమైన "రత్నావళి", ఆంగ్ల నాటక అనుసరణ అయిన "చమత్కార రత్నావళి" ప్రదర్శన భాగ్యం పొందిన తొలి తెలుగు నాటకాలు. ఇది 1880 లో జరిగింది. అందుచేత 1980 వ సంవత్సరం తెలుగు నాటకరంగ శతజయంతి సంవత్సరం అయింది. తెలుగు నాటకాలలో పద్య పఠనమును (ఈనాడు వలె గానం కాదు) ప్రవేశపెట్టినది వడ్డాది సుబ్బారాయుడు. వీరి నాటకాలలో ప్రసిద్ధమై, "వేణీ సంహారము". తెలుగులో గద్య, పద్యాత్మకం కాగా, పద్యాలని రంగస్థలం మీద పఠించేవారు. 1884-86 మధ్య నాదెళ్ళ పురుషోత్తమ కవి 32 హిందూస్తానీ నాటకాలు రచించాడు. వీటిని 15 ఏళ్ళపాటు అనేక పట్టణాలలో విజయ వంతంగా ప్రదర్శించారు. పాత్రోచిత భాష, అనుప్రాసయుక్తము ప్రాబంధికము అయిన శైలి ఆయన పాటించిన అంశాలు. పాటలు (టపాలు) పాడుట ఇతడు ప్రవేశపెట్టిన క్రొత్త అంశము. ఈ మూడు అంశాలు కాలక్రమంలో తెలుగు నాటక రంగం మీద ప్రాధాన్యం వహించాయి. ధర్మవరం రామకృష్ణమాచార్యులు వారు తన తొలి తెలుగు నాటకమైన "చిత్రనళీయం"ను బళ్ళారిలో 1887 జనవరి 29న విజయవంతంగా ప్రదర్శించారు. రామకృష్ణమాచార్యులవారు 30 నాటకాలు రచించారు. అన్నీ స్వతంత్ర రచనలే. తన నాటకాలలో పాటలు ప్రవేశ పెట్టారు. పద్యాలను రాగయుక్తంగా పాడడం కూడా ప్రవేశ పెట్టారు. ఆయన "సారంగధర" తెలుగులోని తొలి స్వతంత్ర విషాద రూపకం. ప్రాచ్య-పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించడంలో ప్రథములైనందునే "ఆంధ్ర నాటక పితామహ" అని బిరుదునిచ్చి సత్కరించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం 1989లో నాటక రచన ఆరంభం చేయగా, అయన నాటకాలలో "గయోపాఖ్యానం" సుప్రసిద్ధమైనది. 1891లో " వెంకట రాయశాస్త్రి రచించిన "ప్రతాపరుద్రీయం" బహుళ ఖ్యాతినొందింది. 1887లో ప్రకటితమైన గురజాడ అప్పారావుగారి "కన్యాశుల్కం" వ్యావహారిక భాషలో రచించబడ్డ అత్యుత్తమైన నాటకం. 1892 ఆగస్టులో విజయనగరంలోని జగన్నాథ విలాసినీ నాటక సమాజం వారు దీనిని ప్రథమంగా విజయవంతంగా ప్రదర్శించారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన నాటకమిది. "ప్రతాపరుద్రీయం", "కన్యాశుల్కం" రెండు రాత్రుల రూపకాలు కాగా 1894 ప్రాంతాల నుంచి వివిధ నాటక రచనలు చేసినవారు కోలాచలం శ్రీనివాసరావు. అధికంగా చారిత్రక నాటకాలు రచించడంచేత "చారిత్రక నాటక పితామహుడు"గా పేరొందారు. ఆయన నాటకాలలో "కర్ణాటక రాజ్యనాశము" లేదా "రామరాజు చరిత్రము"నకు తెలుగుదేశ మంతటా విశేష ప్రాచుర్యం తెచ్చినవారు కోలాచలం మేనల్లుడైన బళ్ళారి రాఘవ. పానుగంటి లక్ష్మీ నరసింహారావు గారు రచించిన తొలి నాటకం "నర్మదాపురుకుత్సీయము" 1900లో ప్రకటితమైంది. ఆయన నాటకాలలో "రాధాకృష్ణ", "పాదుకాపట్టాభిషేకం", "కంఠాభరణము" ప్రసిద్ధమైనవి. " 1900 నాటికి తెలుగు నాటక రచన, ప్రదర్శన వ్యాసంగాలు తెలుగుదేశంలోని అన్ని ప్రాంతాలకూ వ్యాపించాయి. 1906-20 మధ్య కాలంలో బయల్దేరిన "హరిశ్చంద్ర" నాటకాలు 13. "సారంగధర 8. ఇంకా అనేక ఇతర నాటకాలు. ధర్మవరం రామకృష్ణమాచార్యుల ప్రభావం వల్ల నాటకాలలో పద్యాలకు, పాటలకు విలువ హెచ్చిన కాలమిది. ఈ కాలంలోని ముఖ్య విశేషం తెలుగుదేశంలో వ్యాపార నాటకరంగం విజృంభించడం. 1913 ప్రాంతాల్లో కృష్ణా మండలంలో నాటక పోటీలు ప్రారంభమై దేశమంతటా వ్యాపించాయి. "గయోపాఖ్యానం", "పాండవ ఉద్యోగ విజయములు", "బొబ్బిలి యుద్ధం", "రంగూన్ రౌడి" మొదలగు నాటకాలకు విడివిడిగా పోటీలు జరిగాయి. 1929లో ఆంధ్ర నాటక కళా పరిషత్తు తెనాలిలో స్థాపించబడింది. 1930 నుంచి సాంఘిక నాటకోద్యమం విజృభించింది. "విశ్వశాంతి", "ఎన్.జీ.ఓ.", "మా భూమి", "కీర్తిశేషులు", "నిర్మల" "కుక్క" వంటి నాటక రచనల ద్వారా రచయితలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. 1935-44 మధ్య కాలంలో రేడియో రూపకం ఆవిర్భవించి అభివృద్ధి చెందింది. కాళ్ళకూరి నారాయణరావు రచించిన "చింతామణి", "వరవిక్రయం", "మధుసేవ" సమస్యల ఆలంబనగా వెలసిన నాటకాలు. ఇలా వుండగా సంప్రదాయాల ఆధిక్యాన్ని రూపుమాపడం కోసం రచనలు చేసినవారు త్రిపురనేని రామస్వామి, ముద్దుకృష్ణ, గుడిపాటి వెంకట చలం, ఆమంచర్ల గోపాలరావు మొదలగువారు. ఈ కాలంలో దువ్వూరి రామిరెడ్డి గారి "కుంభరాణా", విశ్వనాథ సత్యనారాయణ "నర్తనశాల" ఉత్తమ విషాద రూపకాలు. 1930 తర్వాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన నాటకాలు కూడా వెలిశాయి. 1944-45 తరువాతి కాలాన్ని నాటక/నాటిక పోటీల యుగం అనవచ్చు. 1937 నుంచి రేడియో నాటికలు, 1944-45 నుంచి రంగస్థల ఏకాంకికలు పుంఖాను పుంఖాలుగా వెలువడు తున్నాయి. 1964లో ఎన్.ఆర్.నంది రచించిన ''మరో మొహెంజొదారో" నాటకం ద్వారా తెలుగు నాటక ప్రయోగంలో "ఫ్రీజ్" ప్రవేశించింది. ఆ తరువాత లెక్కలేనన్ని ప్రయోగాలు ఆధునిక నాటకరంగాన్ని వరించాయి. సాంఘిక నాటకాలలో లేజర్ టెక్నిక్‌ను వాడడం ద్వారా సైంటిఫిక్ పోకడలను సైతం గ్రహించి ప్రదర్శించే అవసరం అనివార్యం అయింది. ఇక ప్రస్తుతం రంగస్థలానికి కావల్సిన సౌకర్యాలు సరైన థియేటర్లు లేవు. ఏదో హాలులో నాటకం వేయ్యాల్సిన పరిస్థితులు. అతి ముఖ్యమైన మైకులూ, స్పీకర్ సిస్టములూ ఉండవు. ఉన్నా సరిగా పనిచేయవు. మైకులు మొరాయించని నాటకం ఉండదూ అంటే అతిశయోక్తి కాదు. నటులూ అంటే సినిమా నటులే అన్న ఒక అభిప్రాయం బలంగా నాటుకు పోయింది. సినిమాల్లో నటన ముక్కలు ముక్కలుగా చిత్రీకరించ బడుతుంది. నాటకంలో ఏకబిగిన మొత్తం సన్నివేశంలో నిమగ్నమై నటించాలి. అది చాలా కష్టం. నాటకాలు వేసిన వాళ్ళు సినిమాల్లో రాణిస్తారేమో కానీ, సినిమా నటులు నాటకాల్లో రాణించడం అంత సులభం కాదు. ఇది వరకు తెలుగు సినిమా నటుల్లో అధికులు నాటక రంగం నుండి వచ్చిన వారే అన్న విషయం గుర్తుంచు కోవాలి. ఏటా నంది నాటకాలు పేరు చెప్పి ఓ పది పదిహేను నాటకాలు వేయించి ప్రభుత్వమూ చేతులు దులిపేసు కుంతిండ్. ప్రభుత్వాలు చొరవ తీసుకుని, నాటక సంస్థలకు చేయూత అందించి, ప్రోత్సహిస్తే తప్ప మినుకు మినుకు మంటూ అరి పోవడానికి సిద్దంగా ఉన్న నాటకరంగం బతికి బట్ట కట్టడం కష్టం. ఈ విషయాన్ని ప్రభుత్వాలు ఇకనైనా గ్రహించక పోతే చరమాంకంలో ఉన్న నాటక రంగం తెర మరుగు కాక తప్పని స్థితి నెలకొంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## బూడిద.. చూపుతుంది ఉపాధి

మణుగూరు : విద్యుదుత్పత్తి ప్లాంట్ నుంచి వెలువడే బూడిద వ్యర్థాలు ఉపాధిని కలిగించనున్నాయి. విద్యుదుత్పత్తికి వినియోగించే బొగ్గు ద్వారా బూడిద వెలువడుతుంది. అటువంటి బూడిదను అందించి ఇటుక తయారీ యూనిట్లను నెలకొల్పేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. బీటీపీఎస్ ప్లాంట్ నుంచి రోజుకు వేల టన్నుల్లో బూడిద వ్యర్థాలు వెలువడతాయి. అయితే ఆ బూడిదను సిమెంటు పరిశ్రమలు వినియోగిస్తాయి. అంతేకాకుండా బూడిదతో ఇటుకలను తయారు చేస్తారు. బూడిదను అందించటంతో ఇటుకల తయారీ పరిశ్రమలను స్థానికులు ఏర్పాటు చేసుకునే అవకాశం వచ్చింది. ఆ దిశగా యువకులు, ఔత్సాహికులు ముందుకు రావాలి. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్న క్రమంలో వాటి నిర్మాణానికి ఇటుకల అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటుకల తయారీ పరిశ్రమలు ఉపాధిని కలిగిస్తాయి. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బూడిదతో



ఇటుకల తయారీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

**తక్కువ ధరకే...**బీటీపీఎస్ నుంచి వెలువడే బూడిదను అతి తక్కువ ధరకే అందించను న్నారు. బీటీపీఎస్ నుంచి వెలువడే బూడిదను రోజుకు యాష్ పాండ్‌కి 4,500 టన్నులు, సైలోకి 2 వేల టన్నులు పంపిస్తున్నారు. యాష్‌పాండ్ బూడిదను టన్నుకి రూ.1కి, సైలో బూడిదను టన్నుకి రూ.99కి అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీటీపీఎస్ ప్లాంట్ దూరంగా ఉండటంతో బూడిదను కొనుగోలు చేసే వారి సంఖ్య తక్కువగా ఉంటుంది. స్థానికులకు ఎటువంటి టెండర్ లేకుండానే తక్కువ ధరకు బూడిదను అందించేందుకు ప్లాంట్ అధికారులు సిద్ధంగా ఉన్నారు.**స్థానికులను ప్రోత్సహిస్తాం : బిచ్చన్న, సీఈ**

ఇటుక తయారీ పరిశ్రమల ఏర్పాటుకు బూడిదను అందించి స్థానికులను ప్రోత్సహిస్తాం. స్థానిక ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

## రక్తశుద్ధి సేవలు భేష్

ఆదిలాబాద్ : రిమ్స్ ఆసుపత్రిలో అపెక్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డయాలసిస్(రక్తశుద్ధి) కేంద్రంలో బాధితులకు అందిస్తున్న సేవలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. గత నెలలో రిమ్స్ డయాలసిస్ కేంద్రం రెండో స్థానంలో నిలిచింది. సిద్దిపేటలోని డయాలసిస్ కేంద్రం గత నెలలో 1,035 సెషన్స్ రక్త శుద్ధి చేసి మొదటి స్థానం, ఆదిలాబాద్ కేంద్రంలో 1,015 సెషన్స్ పూర్తయి రెండోస్థానంలో నిలిచాయి. ప్రతి రోజు నాలుగు షిఫ్టుల్లో 40 మంది బాధితులకు రక్తశుద్ధి చేస్తున్నారు. మొత్తం 97 మంది ఇందులో సేవలు పొందుతున్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో డయాలసిస్ కేంద్రం 2018లో డీమెట్ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆ తరువాత అపెక్స్ సంస్థ వారు 2023 నుంచి ఈ కేంద్రం నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. 2023 నుంచి గత నెల వరకు ఈ కేంద్రంలో 20,116 సెషన్స్‌లో రక్త శుద్ధి చేశారు. ఈ కేంద్రంలో మొత్తం 15 పడకలు ఉన్నాయి. మొత్తం 97 మంది కిడ్నీ బాధితులకు డయాలసిస్ సేవలను అందిస్తున్నారు. అత్యధిక మంది బాధితులకు సేవలందించడానికి కేంద్రం బాధ్యుడు రాథోడ్ ప్రేందాస్ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటూ బాధితులకు మెరుగైన విధంగా సేవలందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

బాధితులు నేరుగా సంప్రదించవచ్చు - డాక్టర్ రాథోడ్ జైసింగ్, రిమ్స్ సంచాలకుడురిమ్స్ డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ బాధితుల రక్తశుద్ధి కోసం అన్ని విధాల సౌకర్యవంతంగా మెరుగైన సేవలందించే ఏర్పాట్లు చేశారు. అవసరమైన బాధితులు నేరుగా కేంద్రంలో సంప్రదించి సేవలు పొందటానికి వీలు కల్పించాం. ప్రతి రోజు నాలుగు విడతలుగా రక్త శుద్ధి సేవలందిస్తున్నాం.

## పెన్‌గంగ హోరు.. కర్షకుల కన్నీరు

ఆదిలాబాద్ : వర్షాకాలంలో చెరువు నిండిందంటే చాలు చెరువుగట్టు దగ్గర కట్ట మైసమ్మ పేరిట ఊరంతా కలిసి చేసే వేడుక నేటికీ ఆనవాయి తీగా వస్తూనే ఉంది. అందులో అంతర్లీనమైన భావమేంటో నేటి తరానికి అంతగా తెలియకపోయినా చెరువు పొంగి పంటలను ముంచెత్తకుండా, ఊరిపై ఉపద్రవం తలెత్తకుండా సమతుల్యతను పాటించాలని ముందు జాగ్రత్తలను వెల్లడించే హితం అందులో ఇమిడి ఉంది. నదుల ప్రాముఖ్యతను, వాటి వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వెల్లడించేలా ఏటా మార్చి 14న అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లాలో పెన్‌గంగ నది దాని ప్రాముఖ్యతపై ప్రత్యేక కథనం.

**ఇదీ ప్రాముఖ్యత..** పెన్‌గంగ నది మహారాష్ట్రలోని బుల్డనా జిల్లా అజంతా పర్వత శ్రేణుల్లో మహద్ గ్రామంలో పుడుతుంది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గుబిడి నుంచి కుమురం భీం జిల్లా తుమ్మిడిహెట్టి వరకు 140 కి.మీ మేర నది ప్రవహిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో భీంపూర్, జైనథ్, బేల మండలాల మీదుగా ప్రవహిస్తోంది. వరదల సమయంలో భారీగా నీరు వృథాగా పోతోంది. జైనథ్ మండలం కోర్ట సమీపంలో 6 టీఎంసీల సామర్థ్యంతో చనాఖా-కోర్ట బ్యారేజీని ప్రభుత్వం చేపట్టింది. సంవత్సరం పొడవునా పెన్‌గంగలో నీరుంటుంది. మూగజీవాల దాహం తీర్చుతుంది. పంటలకు జీవం పోస్తోంది. పెన్‌గంగలో ఇసుక అక్రమ రవాణా నది పాలిట శాపంగా మారుతోంది. రోజూ వందలాది ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. వర్షాకాలంలో గ్రామాలతో పాటు వేల ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నాయి.

**ఆక్రమణలతో ఏటా కష్టాలు..**పెన్‌గంగ ఉద్ధృతితో వర్షాకాలంలో అన్నదాతలకు కంటిపై కునుకు ఉండదు. సాత్నాల నుంచి వచ్చే వాగులపై కూడా ప్రభావం పడుతుంది. ఆదిలాబాద్‌లోని ఖానాపూర్, మావల చెరువులు పొంగినప్పుడు పట్టణంలోని శివారు కాలనీలకు ముప్పు పొంచి ఉంటోంది. మావల చెరువును ఆనుకొని ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో అనర్థాలకు దారి తీస్తోంది. బంగారుగూడ వాగు, భీంపూర్ మండలంలోని గుబిడి వాగు, తాంసి మండలంలోని మరికొన్ని వాగులు, ఒర్రెలకు వరద పోటెత్తుతుంది. ప్రధానంగా ఏజెన్సీలోని ఇంద్రవెల్లి, ఇచ్చోడ, ఆదిలాబాద్ గ్రామీణ మండలం వాగులలో నీటి ఉద్ధృతి పెరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

**ముంచెత్తుతున్న వరద..**ఉమ్మడి జిల్లాలో సగటున 1,147 మి.మీ వర్షపాతం నమోదవుతోంది. వాగులు, వంకలు వరదలతో పోటెత్తినా ఎలాంటి ఇబ్బంది తలెత్తేది కాదు. ఇటీవలి కాలంలో పరిస్థితి మారుతోంది. ఒకప్పుడు 43 శాతం ఉన్న అటవీ విస్తీర్ణం క్రమంగా 23 శాతానికి తగ్గిపోవటం, నదులు, చెరువులను ఆక్రమించుకోవటంతో వరద గ్రామాలను ముంచెత్తుతోంది.

చురకలు


# ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలు

చీడికాడ : ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా 163 ఆదర్శ పాఠశాలలు ఉండగా అనకాపల్లి జిల్లాలో ఐదు ఉన్నాయి. చీడికాడ మండల మంచాల, రావికమతం మండలం మరుపాక, నర్సీపట్నం మండలం వేములపూడి, కశింకోట మండలం తేగాడ, మునగపాక మండలం పాటిపల్లిలోని ఆదర్శ పాఠశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40 చొప్పున ఐదుచోట్ల అన్ని గ్రూపుల్లో కలిపి 800 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మే 22లోగా..: ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు మే 22లోగా దరఖాస్తు చేసుకోవాలి. బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుం చెల్లించాలి. రుసుం చెల్లించిన వెంటనే జనరల్ నంబరు కేటాయిస్తారు. ఆ నంబరు ఆధారంగా ఆదర్శ పాఠశాల వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాల్సి ఉ




ంటుంది. పదో తరగతిలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుంది. మరిన్ని వివరాలకు జిల్లాలోని ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపల్/ డీఈవో/ ఎంఈవోలను సంప్రదించవచ్చు.

గ్రామీణ విద్యార్థులకు చక్కని అవకాశం

– వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్, మంచాల

గ్రామీణ ప్రాంతాల్లోని బాలబాలికలు ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ చదువుకునేందుకు చక్కని అవకాశం. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. బాలికలకు ప్రత్యేకంగా హాస్టల్ సౌకర్యం ఉంటుంది. ఇంటర్ తర్వాత కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

# కాసులొస్తేనే కాలువలకు మోక్షం

ఉండి: డెల్టాలో జలవనరులు, డ్రెయినేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గత అయిదేళ్లలో నిర్వహణ పనులకు కూడా అవసరమైన నిధులు ఇవ్వలేదు. ఫలితంగా ఏమాత్రం వర్షం కురిసినా.. పంట కాలువల్లో నీటి మట్టం తగ్గించాల్సి వస్తోంది. పలు డ్రెయిన్లలో మురుగు నీటితో వేలాది ఎకరాలకు ముంపు సమస్య వేధిస్తోంది. రబీలో శివారు ప్రాంతాలకు సకాలంలో సాగు నీరందడం లేదు. ఈ దశలో ఎదురవుతున్న అవాంతరాలను అధిగమించాలంటే సకాలంలో నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉంది.

**నిధులు వస్తేనే..** డెల్టాలో 11 ప్రధాన పంట కాలువలు, 500పైబడే ఉప కాలువల్లోని తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. వైకాపా హయాంలో అన్నదాతలను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ దశలో కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందనే



ఆశాభావం సాగుదారుల్లో వ్యక్తమవుతోంది. నిర్వహణ పనులకు నిధులు మంజూరైతే వాటిలో పెద్ద పనులకు టెండర్లు పిలవడం, గుత్తేదారులను ఖరారు చేయాల్సి ఉంది. కాలువలకు నీరిచ్చే జూన్ ఒకటో తేదీలోపు గట్లను పటిష్ఠ పరచడం, లాకులు, షెట్టర్ల మరమ్మతులు, తారింగ్, ఆయిలింగ్ వంటి పనులు చేయాలి. నాణ్యత ప్రకారమే ఇవన్నీ పూర్తి చేయాలంటే వెనువెంటనే అనుమతి ఇవ్వాలని సాగుదారులు కోరుతున్నారు. బొండాడ మేజర్ డ్రెయిన్‌లో మట్టి పూడికతీత పనులు తీసి 15 సంవత్సరాలు గడిచిపోయాయి. ఆధునికీకరణ పనుల్లో ఈ డ్రెయిన్ ప్రక్షాళన నాడు సరిగా జరగలేదనే ఆరోపణలున్నాయి. అధిక వర్షాలకు యండగండి మీడియమ్ డ్రెయిన్ వెంబడి వందలాది ఎకరాల్లో భూములు ముంపు బారినపడుతున్నాయి. 'కాలువలపై నిర్వహణ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే ఆ పనులకు సాంకేతిక అనుమతినివ్వనున్నాం.' అని డీఈఈ సత్యనారాయణమూర్తి అన్నారు.

# బడికి నిధి భవిష్యత్తుకు పునాది

కర్నూలు : కర్నూలు పాతబస్తీలో ఉన్న కేవీఆర్ గార్డెన్‌లోని నగరపాలక ఉర్దూ పాఠశాలను నాడు-నేడు కింద ఎంపిక చేశారు. పాత భవనాన్ని కూల్చేయడంతో పక్కనే ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలో స్థల సమస్య ఉంది. ఇక్కడ సుమారు 150 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు.

గత వైకాపా ప్రభుత్వం విద్యావ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. నాడు-నేడు పేరుతో గదులు కూలగొట్టారు. తిరిగి పనులు చేపట్టడంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారు. నిధుల మంజూరులో తాత్సారం చేశారు. ఫలితంగా విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. గదులు లేక ఆరుబయట చదువుకోవాల్సిన దుస్థితి. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం మనబడి.. మన భవిష్యత్తు పేరుతో పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. నాడు-నేడు రెండో విడత కింద అసంపూర్తిగా ఉన్న పనులకు నిధులు కేటాయించింది. మరోవైపు ఇదే పథకం కింద ఆయా ప్రాంతాల్లో 25 శాతం పనులు మిగిలి ఉన్న విద్యాలయాల జాబితా పంపాలని జిల్లా విద్యాశాఖకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.

రూ.423 కోట్లు అవసరం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గతంలో నాడు-నేడు కింద పనులు చేపట్టారు. చాలా ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్నాయి. అవన్నీ పూర్తవ్వాలంటే రూ.423 కోట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో నంద్యాల జిల్లాకు రూ.180 కోట్లు, కర్నూలుకు 243 కోట్లు కావాల్సి ఉంది.కర్నూలు జిల్లాలో నాడు-నేడు రెండో విడత కింద 594 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.29.83 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.3.73 కోట్లు ఆయా పాఠశాలల పీడీ ఖాతాలో జమయ్యాయి. నంద్యాల జిల్లాకు రూ.11.77 కోట్లు కేటాయించారు. అందులో రూ.3 కోట్లు వచ్చినట్లు సమాచారం.

# కుట్టు శిక్షణ.. ఉపాధికి రక్షణ



గోరంట్ల : కుటుంబాల్లో ఒకరి సంపాదన చాలని విధంగా రోజురోజుకు ఖర్చులు పెరిగిపోతున్నాయి. నిత్యావసరాలే కాదు.. పిల్లలను చదివించాలంటే రూ.వేలు. రూ.లక్షల్లో ప్రణాళిక బద్ధంగా సిద్ధం చేసుకోవాల్సి వస్తోంది. నగరాలు, పట్టణాలే కాకుండా మారుమూల గ్రామాల్లో సైతం మహిళలు ఉపాధి అవకాశాలు వెతుక్కోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా స్వావలంబన దిశగా అలోచించింది. ఆర్థికంగా ఏదగడానికి తోడ్పాటు అందివ్వాలని సంకల్పించింది. ఆ దిశగా ముందడుగు వేసింది. ఉచితంగా కుట్టుశిక్షణతో పాటు మిషన్‌కూడా ఇచ్చేందుకు శరవేగంగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రాష్ట్ర బీసీ సంక్షేమశాఖా మంత్రి సవిత చొరవతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే మొదటి ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని గోరంట్లలో లాంఛనంగా ప్రారంభించారు. మొదటి విడతలో 1000 మందికి శిక్షణ ఇవ్వడానికి అయిదు కేంద్రాలు ఏర్పాటుచేశారు. గోరంట్లలో నాలుగు, వానవోలు గ్రామంలో ఒకటి ప్రారంభించారు.

**ఒక్కో కేంద్రంలో 120 మంది**

ప్రతి కేంద్రంలో రోజూ 120 మందికి శిక్షణ అందించే విధంగా అయిదే కేంద్రాల్లో 600 మందిని ఎంపిక చేశారు. మొదటి విడతలోనే 746 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆయా కేంద్రాలకు మిషన్లు చేరాయి. కేంద్రానికి ఇద్దరు చొప్పున ట్రైనర్లు ఎంపికచేసి 90 రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లుగా ఒక్కో కేంద్రానికి 120 మందిని ఎంపికచేశారు.

**హాజరు తప్పనిసరి**

లక్ష్యం పక్కదారి పట్టకుండా ఫేషియల్‌యాప్ హాజరు పద్ధతిని ప్రవేశపెట్టారు. దీంతో ప్రతి ఒక్కరూ కేంద్రానికి వచ్చిన సమయంలో, వెళ్లే సమయంలో ముఖహాజరు వేయాల్సి ఉంది. 75 శాతానికి తగ్గకుండా హాజరు ఉంటేనే మిషన్ ఇవ్వడం జరుగుతుందని నిబంధన పెట్టారు. మహిళలు తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాలి. కుట్టుమిషన్‌తో వచ్చే ఆదాయంతో కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలన్నది ప్రభుత్వ ఆశయం.

**మాలాంటి పేదలకు వరం**

ప్రభుత్వం ఉన్నతాశయంతో పెట్టిన ఈకేంద్రం మాలాంటి పేదలకు వరం లాంటింది. వ్యవసాయ కూలీగా జీవనం చేస్తున్నాం. ఏటికేడు వ్యవసాయం తగ్గిపోతోంది. చేయడానికి పనుల్లేకుండా పోతున్న సమయంలో కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. నాగవేణి, బూదిలి

కుటుంబానికి ఆసరాగా నిలవొచ్చు

గోరంట్లలో కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటవుతున్నట్లు తెలిసి దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటి వరకు ఎలాంటి అనుభవం లేదు. ఉచిత శిక్షణతో పాటు మిషన్ ఇస్తుండడంతో స్వయం ఉపాధితో కుటుంబానికి ఆసరాగా నిలబడవచ్చన్న భరోసా కలుగుతోంది. విజయలక్ష్మి

సొంతంగా మిషన్ కొనలేని పరిస్థితి

అవసరాలు ఎక్కువ.. ఆదాయం తక్కువతో కుటుంబం నెట్టుకొస్తున్నాం. సొంతంగా మిషన్ కొనలేని పరిస్థితిలో ఉన్నాం. మాలాంటి వారికి ఈపథంలో ఎంతో ఉపయోగం. కుట్టుశిక్షణ పూర్తయితే సొంతకాళ్లపై నిలబడగలమన్న ధైర్యం వచ్చింది. మంజుళవాణి, గోరంట్ల

# సర్కారు స్థలం.. ప్రైవేటుకు ఆదాయం



ధర్మవరం : ప్రభుత్వ స్థలాలపై ఆయా శాఖల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు దర్జాగా కబ్జా చేస్తున్నారు. వాటిలో దుకాణాలు ఏర్పాటు వేసుకుని సొమ్ము చేసుకుంటుండగా... మరికొందరు భవనాలను నిర్మించుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. మొదట కొంత స్థలంలో చిన్నగుడిసెలు వేసుకుని వ్యాపారం చేస్తున్నారు. తరువాత ఎవ్వరూ ప్రశ్నించకపోతే మొత్తం జాగాను ఆక్రమించుకుని సొంత స్థలంలోకి కలిపేసుకుంటున్నారు. కొందరైతే ఏకంగా భవనాలు నిర్మించుకున్నారు. ధర్మవరంలోని బెంగళూరు రోడ్డులో ర.భ.శాకు విలువైన స్థలం ఉంది. దీనికి సమీపంలోనే ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలాలు ఉన్నాయి. వాటి యజమానులు ప్రభుత్వ స్థలంలో దుకాణాలు, షెడ్లు వేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ఇక్కడ సెంటు ధర సుమారు రూ.25 లక్షలకు పైగా ఉంటుంది. ముదిగుబ్బ వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద మండలం. దీని మీదుగా పలు జాతీయ రహదారులు వెళుతుండటంతో స్థలాలకు భారీగా డిమాండ్ ఉంది. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి, దొరిగల్లు, ప్రభుత్వ పాఠశాలల సమీపంలో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. కొందరు నాయకులు... ఆక్రమణదారులతో ప్రతి నెలా డబ్బు వసూలు చేసుకుంటున్నారు.

పుట్టపర్తి ఎనుములపల్లిలోని బైపాస్ రోడ్డులో పురపాలిక స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని షెడ్లు నిర్మించుకుంటున్నారు. ఇక్కడ సెంటు రూ. 8లక్షలకు వరుకు ఉంటుంది. విలువైన స్థలాలను ఆక్రమించుకుంటున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. **కఠిన చర్యలు తప్పవు**

నాగపుల్లంరావు ర.భ.శా డీఈ, దివాకర్ ఎంపీడీఓ (ముదిగుబ్బ), ప్రహ్లాద పురపాలక కమిషనర్(పుట్టపర్తి)

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయిస్తాం. ఇలాంటి పనులు ఎవ్వరూ చేసినా ఉపేక్షించేది లేదు. ఇప్పటికే కొన్ని చోట్ల ఆక్రమణలను తొలగించాం. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

# చిన్నారులకు శుద్ధ జలం

చిత్తూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపుతోంది. కిచెన్ గార్డెన్, క్రీడా పరికరాలు, ఆకుకూరల సాగు, వాన నీటి సంరక్షణ తదితర సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రస్తుతం శుద్ధి నీటిని అందించేందుకు యంత్రాలను అందజేస్తోంది.

**సౌకర్యాలున్న వాటిల్లోనే..**

సౌకర్యాలు ఉన్న వాటిని సక్షం అంగన్‌వాడీ కేంద్రాలుగా ఎంపిక చేశారు. చిత్తూరు జిల్లాలో మొత్తం 2,420 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో 814 కేంద్రాలను సక్షం కేంద్రాలుగా ఎంపిక చేశారు. వీటికి 814 శుద్ధి నీటి యంత్రాలను కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసింది. తిరుపతి జిల్లాలో మొత్తం 2,492 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో 475 కేంద్రాలను సక్షం పథకం కింద ఎంపిక చేసి 475 శుద్ధి జల నీటి యంత్రాలు సరఫరా చేశారు. వీటికి ఎల్ఈడీ టీవీలు సైతం రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. మినరల్ వాటర్ ఆర్వో యంత్రాలను ఆయా ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రాలకు పంపారు. ఒక్కో యంత్రానికి సగటున రూ.7 వేల చొప్పున ప్రభుత్వం వెచ్చించింది. వాటిని టెక్నీషియన్లు ఆయా కేంద్రాల్లో అమర్చాల్సి ఉంది.

**గతంలో ఇచ్చినవి నిరుపయోగం..**

చిత్తూరు జిల్లాలో గతంలో 225 అంగన్‌వాడీ కేంద్రాల్లో రూ.7,500తో శుద్ధి నీటి యంత్రాలు అందజేశారు. ఇప్పుడవి పలు కేంద్రాల్లో పనిచేయటం లేదు. ఈ కేంద్రాల్లో శుద్ధి నీటి యంత్రాలు పనిచేస్తున్నాయా..? లేదా..? పరిశీలించే వారు లేరు. పలుచోట్ల ఈ




యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. ఇంటి నుంచి తెచ్చుకున్న సీసాల్లోని నీటిని చిన్నారులు తాగుతున్నారు. మరికొందరు కుళాయిల వద్దకు వెళ్తున్నారు.

**చిత్తూరు జిల్లాలో..**

ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 12
అంగన్‌వాడీ కేంద్రాలు:2,420
ఆరేళ్ల లోపు చిన్నారులు: 92,248 మంది
గర్భిణులు: 10,373 మంది
బాలింతలు: 11,336 మంది
సక్షం కేంద్రాలు: 814

# కన్నీటికే వేదన

భీమవరం : ఇంట్లో మనిషి చనిపోయాడన్న బాధ కంటే ఆ మృతదేహానికి అంత్యక్రియలు ఎక్కడ చేయాలన్న ఆందోళన వెంటాడుతోంది. గత వైకాపా ప్రభుత్వం శ్మశానవాటికల అభివృద్ధికి రూపాయి కూడా విడుదల చేయకపోగా, ఉన్న వాటి నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో జిల్లాలో పలు చోట్ల కాలువ గట్లు, రహదారులపైన దహన సంస్కారాలు చేస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కనీస సౌకర్యాలు కరవు..** చాలాచోట్ల శ్మశానాలు లేకపోగా, ఉన్నవాటిలో కూర్చునేందుకు బల్లలు, స్నానం చేసేందుకు నీటి సౌకర్యం వసతులు లేవు. ఆలమూరు శివారు కోమటిచెరువు దగ్గర శ్మశానవాటిక లేకపోవడంతో భగ్గేశ్వరం డ్రెయిన్‌పై దహనం చేస్తున్నారు. పొలమూరులో సుమారు 500 కుటుంబాల శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నారు. వనంపల్లి, మామిడూరు గ్రామాల్లో సౌకర్యాలు లేవు. తణుకు మండలం కోనాల, ముద్దాపురం, దువ్వ గ్రామాల్లోని శ్మశానవాటిక లేక యనమదుర్రు గట్టుపక్కనే దహన సంస్కారాలు చేస్తున్నారు. వర్షాలకు గట్టుపైకి నీరు చేరితే రెండు, మూడు రోజుల పాటు మృతదేహాన్ని ఇంటి దగ్గర భద్రపరచాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వశిష్ఠ గోదావరిని అనుకుని ఉన్న సిద్ధాంతంలో శ్మశాన



వాటిక లేక గోదావరి గట్టునే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. దక్షిణ కాశీగా పేరొందడంతో చుట్టుపక్కల 30 గ్రామాల ప్రజలు ఇక్కడకు వస్తున్నారు. కేదార్‌ఘాట్ ఒడ్డున, గోదావరిలోని నీరు పైకొస్తే రోడ్లపై దహనం చేస్తున్నారు.

వైకుంఠధామాల్లో ఎక్కడా కనీస సౌకర్యాలు లేవని గత పాలకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని పరిస్థితులపై కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**కూటమి చొరవ:** అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులున్న గ్రామాలను గుర్తించి ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో శ్మశానవాటికల నిర్మాణాలకు, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆచార వ్యవహారాల నిర్వహణకు వసతులు, చుట్టూ కంచె నిర్మాణాలకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు డ్వామా పీడీ అప్పారావు తెలిపారు.

# 14 ఏళ్లు నిర్వాసితుల కన్నీళ్లు

నంద్యాల : కర్నూలు- కడప నాలుగు వరుసల రహదారిని ఎనిమిది ఏళ్ల కిందట పూర్తి చేశారు. నిత్యం ఏడు వేల వాహనాలు వెళ్తుంటాయి. రూ.12 లక్షల వరకు టోలు రుసుము జమ చేస్తున్నారు.. రోడ్డు నిర్మాణానికి భూములిచ్చిన రైతులు మాత్రం పరిహారానికి ఎదురుచూస్తూనే ఉన్నారు. 'న్యాయం' చేయండని కోర్టులు తీర్పులు వచ్చినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. రహదారి పొడవునా భూసేకరణకు సంబంధించి ఇంకా రైతులకు రూ.20 కోట్ల వరకు చెల్లించాలి. ఆ నిధులు జాతీయ రహదారి అధికారుల వద్ద మూలుగుతున్నాయి. రెవెన్యూ శాఖ అధికారులు చొరవ తీసుకోకపోవడంతో బాధితులు ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు.

**300 కి.మీ.. 3 వేల ఎకరాలు**

నాలుగు లేన్ల విస్తరణ పనులు 2009లో ప్రారంభయ్యాయి. నిర్మాణానికి 300 కి.మీ. పొడవునా మూడువేల ఎకరాలు సేకరించారు. మాగాణికైతే ఎకరాకు రూ.8.25 లక్షలు, మెట్ట భూములైతే రూ.7.50 లక్షలు, ఇళ్ల స్థలాలకైతే సెంటు రూ.9 లక్షల చొప్పున చెల్లించారు. భూవిస్తీర్ణంలో తేడాలు, రైతుల వద్ద సరైన దస్త్రాలు లేకపోవడం, కోర్టు తీర్పుల ప్రకారం చెల్లించాల్సిన అదనపు మొత్తం తదితర సమస్యలకు సంబంధించి సుమారు 300 మందికి పైగా రైతులకు ఇంకా పూర్తి స్థాయిలో పరిహారం అందలేదు.

నంద్యాల పట్టణ శివార్లలోని ఉడుమాల్పురం, వెంకటేశ్వరపురం గ్రామాలకు చెందిన 37 మంది రైతుల నుంచి 18.51 ఎకరాలు సేకరించి రూ.1,51,94,400 చెల్లించారు. దీనిపై రైతులు అభ్యంతరం చెప్పడంతో 2014లో అప్పటి కర్నూలు కలెక్టర్ మరో రూ.67 లక్షలు అదనంగా చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై నేషనల్ హైవే అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం రైతులకే అనుకూలంగా తీర్పునిచ్చింది. రూ.67 లక్షలతో పాటు పరిహారం చెల్లింపులో ఆలస్యం చేసినందుకు 9 శాతం వడ్డీతో కలిపి ఇవ్వాలని ఆదేశించింది. రూ.1.18 కోట్ల పరిహార సొమ్ము కోసం 37 మంది రైతులు 11 ఏళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు.

**'గూడు' కూల్చారు.. గోడు మిగిల్చారు**

విస్తరణలో భాగంగా శిరివెళ్ల మండలం యర్రగుంట్ల, వెంకటాపురం గ్రామాల్లో 105 మంది ఇళ్లు, స్థలాలను కోల్పోయారు. పునరావాసం కల్పిస్తామని 2012లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు హామీ ఇచ్చారు. నిర్వాసితులకు ఒక్కొక్కరికి 2.50 సెంట్ల చొప్పున స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేశారు. తీరా ఇళ్ల నిర్మాణానికి వచ్చే సరికి..నిర్వాసితులు గతంలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు తీసుకున్నట్లు వివరాలు ఉన్నాయి.. మరోమారు ఇవ్వడానికి సాధ్యం కాదని అధికారులు తేల్చారు. నిర్వాసితులు చాలా మంది అద్దె ఇళ్లలో కష్టంగా జీవిస్తున్నారు.

**రూ.13 లక్షలు రావాలి – సుధాకర్, వెంకటేశ్వరపురం**

నలుగురు అన్నదమ్ములం. ఇంకా రూ.13 లక్షలు రావాలి. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. రూ.కోట్లలో ఎకరం భూమి ఉండగా కొద్దిపాటి మొత్తాన్ని ఇవ్వడానికి ఇబ్బందులు పెడుతున్నారు.

**పట్టించుకోడం లేదు– శివనాగిరెడ్డి, ఉడుమాల్పురం**

రహదారి నిర్మాణంలో 2.50 ఎకరాల భూమిని కోల్పోయా. పొలంలో బావి ఉంటే దాన్ని పూడ్చి రోడ్డు వేశారు. పరిహారం ఇవ్వమంటే తిప్పుతున్నారు. చిన్న రైతులం కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. కర్నూలుతో పాటు నంద్యాల కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. దస్త్రాలు చూపిస్తున్నా ఆలస్యం చేస్తున్నారు.

చురకలు



# ఉద్యాన రైతుల నిరీక్షణ



పుట్టపర్తి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటలు సాగు చేసిన రైతులు బకాయిల కోసం నిరీక్షిస్తున్నారు. ఆ పథకం కింద డబ్బు వస్తుందని భావించిన రైతులు అప్పులు చేసి దూర ప్రాంత నర్సరీల నుంచి మొక్కలు తీసుకొచ్చి సాగుచేశారు. అయితే నిధులు విడుదల కాకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఐదు ఎకరాలలోపు పొలం ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఉపాధి హామీ కింద పండ్ల తోటలు పెంపకం చేపట్టేలా ప్రోత్సహించి, వారు ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పండ్ల తోటల పెంపకం పథకాన్ని అమలు చేస్తోంది. 2024-25 సంవత్సరంలో 7,500 ఎకరాలు లక్ష్యం నిర్దేశించారు. 3,031 మంది రైతులు 7,072 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటారు. జనవరి నుంచి ఆ పథకం బకాయిలు రైతులకు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**ఆదుకోవాలని వేడుకోలు**

ఉపాధి హామీ పథకం కింద వివిధ పండ్ల తోటలను జిల్లా వ్యాప్తంగా 7,032 ఎకరాల్లో సాగు చేశారు. 3,031 మంది రైతులకు రూ.4.31 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. మామిడి 70, బత్తాయి 110, సీతాఫలం, జామ, నిమ్మ 240 మొక్కల చొప్పున సాగు చేసేలా నిర్ణయించారు. జనవరి నుంచి నిధులు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నెలకు మూడు నీటి తడుల చొప్పున ఒక్కో మొక్కకు ఒక్కో తడికి రూ.5.40 చొప్పున చెల్లించాల్సి ఉండగా.. అవి మంజూరు కాలేదు. చాలా మంది ట్యాంకర్లతో నీటిని తెచ్చి తడులు అందిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌ను రూ.వేయి వరకు ఖర్చవుతోందని చెబుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిధులు మంజూరు కావాల్సి ఉంది

విజయప్రసాద్, డ్వామా పీడీ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం పనులకు సంబంధించి జనవరి నుంచి నిధులు మంజూరు కాలేదు. 3,032 మంది రైతులకు దాదాపు రూ.4.31 కోట్లు మంజూరు కావాల్సి ఉంది. త్వరలో విడుదలవుతాయి.

## కలిపేయ్.. కబ్జా చేసేయ్!

ఏర్పేడు : ప్రభుత్వం మారినా.. వైకాపా నాయకులు ఆక్రమణలు చేస్తూ.. చెలరేగిపోతున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను స్వాహాకు యత్నిస్తున్నారు. తాజాగా శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అనధికారిక లేఅవుట్‌లో కలుపుకొని కొనుగోలుదారులను ఏమార్చేందుకు రంగం సిద్ధం చేశారు.

శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు సమీపంలో ప్రభుత్వ భూముల కబ్జాకు సిద్ధం చేయడం, విమర్శలు రావడం, అధికారులు నిలుపుదల చేయడం జరుగుతూనే వస్తోంది. తాజాగా సర్వే నంబరు 121లోని 1.52 ఎకరాలు, 122/3లో 59 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. వెంకటగిరి-ఏర్పేడు రహదారిని ఆనుకుని ఉండటంతో అనధికారిక లేఅవుట్ పేరుతో ఇక్కడి భూములను కలుపుకొని కొందరు



ఆక్రమణలకు సన్నాహాలు చేస్తున్నారు. వైకాపా హయాంలో అపాచీ పరిశ్రమల కోసం సేకరించిన భూములకు కూతవేటు దూరంలో ఈ స్థలాలు ఉండటంతో వీటిని స్వాహా చేసేందుకు యత్నిస్తున్నారు. ప్రస్తుతం ఆక్రమిత భూముల విలువ రూ.2. కోట్లకు పైగానే ఉంటుంది.

**మరికొన్ని చోట్ల..**

ఏర్పేడు మండలంలోని శ్రీనివాసపురం ఐసర్ సమీపంలో అనధికారిక లేఅవుట్ పేరుతో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇక శ్రీకాళహస్తి మండలం మద్దిలేడు సమీపంలో ఇదే తరహాలో ప్రభుత్వ భూమిపై అక్కడి రాజకీయంగా పలుకుబడి కలిగిన స్థిరాస్తి వ్యాపారులు కన్నేసి అక్రమాలకు యత్నించడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

ఇనగలూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయమై సమాచారం లేదు. పరిశీలించి కబ్జాకు యత్నించిన వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రేమ్‌కుమార్, ఇన్‌ఛార్జి తహసీల్దార్, శ్రీకాళహస్తి

## ఈ ప్రాంతాలకు మోక్షమెన్నడో..?

చిత్తూరు : పేరుకేమో జిల్లా కేంద్రం.. ఆపై నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ అయి పదమూడేళ్లవుతోంది.. అయినా ఇక్కడి వీధుల్ని చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనేలా ఉంది.. నిధుల లేమి కారణంగా నగర శివారుల్లోని విలీన పంచాయతీల పరిధిలోని కాలనీల్లో సదుపాయాల కల్పన ఒక్క అడుగు ముందుకు పడలేదు.. పదేళ్ల కిందట ఎలా ఉందో.. నేటికీ అలానే ఉంది.. ప్రభుత్వాలు, నగరపాలక కౌన్సిళ్లు మారినా ప్రజలు అసౌకర్యాల నడుమ నివసించాల్సిన దుస్థితి. శివారు ప్రాంతమైన కుప్పన్నగారిపల్లెలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ మౌలిక సదుపాయాల కొరత కారణంగా స్థానికులు అవస్థలు పడుతున్నారు. కాలనీ ప్రారంభమే సమస్యలతో స్వాగతం పలుకుతోంది. ఇళ్ల నిర్మాణాలతో వేగంగా మారుతున్న ఈ ప్రాంతంలో రోడ్డు సౌకర్యం లేదు. ఎగుడుదిగుడుగా ఉన్న మట్టిరోడ్లపైనే వాహనాల ప్రయాణం చేస్తున్నారు. వీధిదీపాలు ఉన్నా సక్రమంగా వెలగని కారణంగా ఇళ్ల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో రాత్రివేళ విషపురుగుల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు. కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో నివాసాల ఎదుట చిన్నపాటి గుంతల్లో మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, కాలువ మంజూరైనా ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. ఈ కాలనీకి పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా విధులకు రావడం లేదని ఆరోపిస్తున్నారు. నగర శివారు ప్రాంతమైన



ఇక్కడ సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు పేర్కొన్నారు.

అధ్వాన రహదారులే దిక్కు..

తేనెబండ సమీపంలోని జగనన్న కాలనీ సమస్యల సుడిలో చిక్కుకుంది. బోడికొండ వెనుక గుట్టపైన ఉన్న ఈ కాలనీలో కంకర తేలిన మట్టిరోడ్లపైనే ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ఇళ్ల నిర్మాణాలతో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలనీలో వీధిదీపాల కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు అలంకారప్రాయమే. అవి సక్రమంగా వెలగని కారణంగా ఇళ్ల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో రాత్రివేళ పాములు, కీటకాల బెడదతో స్థానికులు సతమతమవుతున్నారు. కాలువలు నిర్మించక పోవడంతో నివాసాల ఎదుట చిన్నపాటి గుంతల్లో ఇళ్ల నుంచి విడిచిపెట్టే వ్యర్థ నీటిని నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి. ఫలితంగా దోమల బెడదతో పాటు దుర్వాసన భరించలేక పోతున్నట్లు స్థానికులు తెలిపారు. కాలనీలో వివిధ సమస్యలు ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఇక్కడ రాత్రివేళ మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని, ఇటువైపు రావాలంటేనే మహిళలు వెనుకంజ వేస్తున్నారు. కాలనీలో సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపించారు.

**ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం..**

నగర శివారుల్లోని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. సదుపాయాల కొరత ఉన్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తాత్కాలిక ఏర్పాట్లు చేస్తాం. వెంకట్రామిరెడ్డి, ఎంఈ, నగరపాలక సంస్థ


## ఆదాయమే చూస్తాం.. అవస్థలతో మాకేం!



అనంతపురం : అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో చీనీ రైతులు పడే బాధలు అన్నీ ఇన్నీకావు.. మండే ఎండలో కుప్పల రాసులు పోసుకొని వారు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. ఏటికేడు ఆదాయం పెరుగుతున్నా రైతుల అవస్థలను పట్టించుకున్నదే లేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో చీనీకాయల సంతకు రూ.3.60 కోట్లతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినా.. మూడేళ్ల క్రితం పనులు ఆగిపోయాయి. నిత్యం 1000-1500 టన్నుల వరకు చీనీకాయలు సంతకు వస్తున్నాయి. జిల్లా మార్కెటింగ్‌శాఖ కార్యాలయం వెనుక భాగంలో పెద్ద చెట్లు ఉండేవి. చెట్ల కింద చీనీకాయలు కుప్పలు పోసుకునేవారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, యార్డు ఛైర్మన్ ఫయాజ్ పదుల సంఖ్యలో చెట్లును కొట్టించి కూరగాయలు మార్కెట్‌కు షెడ్లు కట్టించారు. అవి ఏమైనా పూర్తి చేశారా? అంటే అదీ లేదు. షెడ్లన్నీ అర్ధాంతరంగా ఆగిపోయాయి. కొత్త కవరింగ్ షెడ్డు పూర్తి చేయకుండా, ఉన్న చెట్లను కొట్టించి ఇబ్బందులు పెట్టారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిమెంటు ప్లాట్‌ఫాంపై కుప్పలు పోసి వరిగడ్డిని కప్పుకుంటున్నారు. ప్లాట్‌ఫారంపై ఎండకు కాయలు మాడి, రసం తగ్గి అమ్ముకునేందుకు పనికి రాకుండా పోతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండలో లారీలకు నింపేందుకు కూలీల అవస్థలు వర్ణనాతీతం. మొదటి దశలో రూ.2.20 కోట్లతో కవరింగ్ షెడ్డు పైకప్పు వేశారు.

రెండో దశలో రూ.1.40 కోట్లతో కవరింగ్ షెడ్డును పెంచారు. పిల్లర్లు వేసి వదిలేశారు. మిగిలిన పనులన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. షెడ్డు సంగతి ఇప్పటికీ తేలలేదు. చీనీ వ్యాపారులు యూజర్ ఛార్జీలు కింద నిత్యం రూ.1.50-2 లక్షల వరకు చెల్లిస్తున్నారు. యార్డుకు ఆదాయం బాగున్నా అధికారులు అభివృద్ధి పనులను ఎందుకు చేయడం లేదని రైతులు, వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దృష్టి సారించి కవరింగ్ షెడ్డు పనులు పూర్తి చేయించాలని, చీనీ సంతకు ఇబ్బందుల్లేకుండా చూడాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

## తుక్కు.. తుప్పొదిలేనా..?



చిత్తూరు : విద్యుత్తు శాఖ పలమనేరులోని నియంత్రికల మరమ్మతు కేంద్రంలో తుక్కు స్వాహా చేసిన అక్రమార్కులపై చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు.. వారిని రక్షించేందుకు ఉన్నతాధికారులు తెరచాటు యత్నాలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. ఈ కేంద్రంలో కాలిపోయి, తుప్పు పట్టిన తీగలు, కమ్మీల నుంచి దిగమింగిన తుక్కును రూ.6 కోట్ల మేర స్వాహా చేసినట్లు విద్యుత్తుశాఖ యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్ విజిలెన్స్ విభాగం నిర్ధారించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినా ఎవరిపై చర్యల్లేకపోవడం గమనార్హం.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎనిమిది మరమ్మతు కేంద్రాలకు కాలిపోయిన నియంత్రికలను తరలిస్తే మరమ్మతు చేసి అప్పగిస్తారు. అది పనికిరాదనుకుంటే కొత్తదాన్ని ఇస్తారు. పలమనేరు కేంద్రంలో మరమ్మతులకు వినియోగించాల్సిన అల్యూమినియం, రాగి వైండింగ్ వైర్లు టన్నుల కొద్దీ పక్కదారి పట్టించి రూ.కోట్లు స్వాహా చేశారు.

**బాధ్యులను రక్షించేందుకు పైరవీలు..**

రూ.లక్షల్లో సంస్థ నుంచి వేతనాలు పొందుతూ ఇంతజరుగుతున్నా తమకేమీపట్టనట్లు వ్యవహరించడంపై ఆ శాఖ అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులను రక్షించేందుకు పెద్దఎత్తున రాజకీయ, ఆర్థిక పరమైన పైరవీలు మొదలైనట్లు తెలిసింది. ఎలాగైనా గత వైకాపా పాలనలో ఆ విభాగంలో పనిచేసిన అధికారులను కాపాడేందుకు ఉన్నతాధికారులు తమదైన శైలిలో ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. కొత్తగా విధుల్లోకి చేరడం.. మరమ్మతు కేంద్రం నిర్వహణపై అవగాహన లేని కేంద్రం ఉప-ఇంజినీరు సస్పెన్షన్‌తోనే చేతులు దులిపేసుకున్నారు. ఉప ఇంజినీరు అమాయకత్వాన్ని అలుసుగా తీసుకుని.. ఆ విభాగం అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. స్వాహాకు బాధ్యులైన అధికారులపై చర్యలకు ఉపక్రమించకుంటే భవిష్యత్తులో మరిన్ని అక్రమాలు జరగడం సహా సంస్థకు తీవ్ర నష్టం, మనుగడకు విఘాతం కలిగే అవకాశం లేకపోలేదు.

**కొరవడిన పర్యవేక్షణ..!**

తుక్కు స్వాహాకు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపమే అసలు కారణమని విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం అధికారులు నిర్ధారించి సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. మరమ్మతు కేంద్రాలను ప్రతి నెలా సంబంధిత విభాగం ఈఈ, డీఈఈలు పర్యవేక్షించాలి. కేంద్రం, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉందా..? నిబంధనలు పాటిస్తున్నారా..? తదితర అంశాలను ప్రతి నెలా పరిశీలించి రికార్డుల్లో తనిఖీలు చేసినట్లు సంతకాలు చేయాలి. పర్యవేక్షణ అధికారులు పూర్తిగా దృష్టి సారించలేదని విచారణ అధికారులు నిర్ధారించారు. తొలుతనే అక్రమాలు గుర్తించి సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించి ఉంటే ఇంత మొత్తంలో అక్రమాలకు తావు ఉండేది కాదు. ఇంత అవినీతికి ఆ విభాగం అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమవుతోందని ఆ శాఖ అధికారులే పేర్కొంటున్నారు.

## మట్టి పరీక్షలతోనే సరి!

విశాఖపట్నం : విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటనేది ప్రజల చిరకాల కోరిక. అందుకు విధానపరంగా అన్ని రకాల అడ్డంకులు తొలిగాయి. కానీ, కార్యకలాపాల నిర్వహణకు చేపడుతున్న పనుల్లో మాత్రం ఆటంకాలు ఎదురవుతున్నాయి. జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి ముడసర్లోవ వద్ద స్థలం అప్పగించినా పనులు వేగంగా ముందుకు సాగడం లేదు. కొందరు పరిహారం ఇవ్వాలని అడ్డుకుంటున్నారు. దీంతో కీలకమైన పనులు ఆగుతూ.. సాగుతూ.. ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపడంలో జాప్యం చేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఆ వెంటనే: దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను వీలైనంత తొందరగా పట్టాలెక్కించాలని అనుకుంటున్నా... ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జీఎం కార్యాలయం సముదాయానికి డిసెంబరులో తూర్పు కోస్తా రైల్వే జోన్ టెండరు పిలిచింది. రూ.149 కోట్లతో 9 అంతస్తులతో పాటు గ్రౌండ్ ఫ్లోర్, పార్కింగు కోసం మరో రెండు అంతస్తులు నిర్మించాలనేది ప్రతిపాదన. ఈ ప్రాజెక్టు మొత్తాన్ని రెండేళ్లలో పూర్తిచేయాలనే నిబంధన విధించారు. సాంకేతిక అంశాల పరిశీలన అనంతరం గుత్తేదారు ఎంపిక ప్రక్రియ పూర్తవ్వగా పనులు ప్రారంభానికి



చర్యలు తీసుకున్నారు. అనంతరం అప్పగించిన స్థలంలో మట్టి పరీక్షలు నిర్వహించారు. అర్హత సాధించిన కంపెనీ నిర్మాణ పనులకు సిద్ధమవగా ప్రతిపాదిత స్థలంలో తాత్కాలిక కార్యాలయాన్ని, పనులు చేసే కార్మికులకు వసతి ఏర్పాటు చేసింది. అక్కడ ఏ పనులు ఎక్కడ చేపట్టాలో మార్కింగ్ సైతం ఇచ్చింది. ముందుగా స్థలాన్ని చదును చేసే పనులు చేపట్టారు. అడ్డంకిగా ఉన్న పొదలను తొలగించారు. కొన్ని చోట్ల మట్టి పరీక్షల కోసం తవ్వకాలు జరుపుతుండగా అడ్డంకులు మొదలయ్యాయి. పరిహారం ఇవ్వకుంటే పనులు సాగనీయబోమని కొందరు అడ్డుతగులుతున్నారు. దీంతో గత కొద్ది రోజులుగా అక్కడ పనులు నిలిపేశారు.

**ఎప్పటిలోగా:** వాస్తవానికి ఆ స్థలంలో గతంలో కొందరు రైతులకు పట్టాలు ఇచ్చారు. ఆ తర్వాత వాటిని రద్దు చేశారు. నిబంధనల ప్రకారం ఆ స్థలంపై వారికి ఎటువంటి హక్కులు లేనట్లు గతంలోనే అధికారులు గుర్తించారు. ఆక్రమణదారులుగా కొందరు రైతులున్నట్లు తేల్చారు. వీరికి మానవీయ కోణంలో సాయం చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అక్కడ కాకుండా ఇంకెక్కడైనా వారికి స్థలాలు ఇచ్చే అంశంపై పరిశీలిస్తున్నారు. లేదంటే... సమీప కృష్ణాపురం కాలనీలోనే ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా స్థలాలు ఇవ్వాలని యంత్రాంగం ఆలోచిస్తోంది. కొద్ది రోజుల కిందట తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టరు హరేంధిరప్రసాద్‌తో చర్చించారు. రైతులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. దీనిపై ఇంకా పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## అటు మళ్లిస్తోంది 'ఆశే'

నర్సీపట్నం : మాతృత్వపు మధురిమలో పులకరించాలని ప్రతి మహిళ కోరుకుంటుంది. అమ్మా అనే పిలుపు కోసం పరితపిస్తోంది. ఎంత కష్టాన్నైనా ఇష్టంగా భరిస్తుంది. ఇల్లాలు గర్భం దాల్చింది మొదలు బిడ్డకు జన్మనిచ్చే వరకు ఇంటిల్లిపాదీ దృష్టి తల్లీబిడ్డ ఆరోగ్యంపైనే ఉంటుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదలు జిల్లా ఆసుపత్రి వరకు అన్నింటా ప్రసవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లున్నాయి. నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. పరీక్షల వరకు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నప్పటికీ ప్రసవాల కోసం చాలామంది ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా ఉండేది. ధనార్జనే ధ్యేయంగా కొంతమంది వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తూ ప్రైవేటుగా నిర్వహిస్తున్న ఆసుపత్రులకు ప్రసవాలకు వచ్చేలా ప్రోత్సహించేవారు. దీనికి కొంతమంది ఆశా కార్యకర్తలను పావులుగా వాడుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు గత ఏడాది ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగిన ప్రసవాలపై నమూనాగా అధికారులతో పరిశీలన చేయించినప్పుడు విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. 108 అంబులెన్సుల్లో బయలుదేరిన గర్భిణులను ఆశా కార్యకర్తలు కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకువెళ్తున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. నర్సీపట్నంలో పది నర్సింగ్ హోంలు ఉన్నాయి. ప్రసవాలకు చేరిన 500 మంది నుంచి వివరాలు సేకరించినప్పుడు ఓ ప్రైవేటు ఆసుపత్రికి అత్యధికంగా 240 మందిని తరలించినట్లు, మరో రెండు నర్సింగ్ హోంలలో 180ని చేర్చినట్లు గుర్తించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. తప్పనిసరి అయినప్పుడే శస్త్రచికిత్స చేస్తారు. అదే ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే ఇష్టారాజ్యంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఐదారు రోజుల తరువాత ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసేందుకు రూ. 35 వేల నుంచి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నారు.

సభాపతి అయ్యన్నపాత్రుడు నాలుగు రోజుల కిందట ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమావేశమై ప్రైవేటు ఆసుపత్రులకు గర్భిణుల తరలింపుపై గణాంకాలతో వాస్తవాలు వెల్లడించారు. ఎక్కువ కేసులు మాకవరపాలెం మండలం బూరుగుపాలెం, నర్సీపట్నం మండలం వేములపూడి ఆరోగ్య కేంద్రాల నుంచి తరలించారని వెల్లడించారు. ఏ ఆరోగ్య కేంద్రం నుంచి ఏ ప్రైవేటు ఆసుపత్రికి ఎన్ని కేసులు పంపారో కుండబద్దలు కొట్టినట్లు విప్పారు. ఎందుకిలా జరుగుతోంది, ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ప్రైవేటు ఆసుపత్రుల్లో బాగా ప్రసవాలు చేస్తున్నారా, లేక కాసులకు కక్కుర్తిపడి తరలిస్తున్నారా అన్నది తేల్చాలని ఆదేశించారు. తీగలాగితే డొంక కదలడంతో ఇప్పుడు ప్రతి కేసు ప్రభుత్వ ఆసుపత్రులకే వచ్చేలా చూస్తున్నారు. ఎవరైనా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తామని చెబితే అందుకు కారణాలను తెలుసుకోవాలని ఆశా కార్యకర్తలకు ఇప్పటికే సూచించారు. తల్లి గర్భం దాల్చింది మొదలు ప్రసవం వరకు ఆశా కార్యకర్తలు వారిని కనిపెట్టుకు ఉంటారు. ప్రసవం సమయంలో వెన్నంటి సహకరిస్తుంటారు. చాలామంది ఆశాలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలనే సూచిస్తుంటారు. కొంతమంది ప్రైవేటు ఆసుపత్రులు బాగుంటాయని సూచిస్తుంటారు. ఆశ కార్యకర్తలు తీసుకువచ్చే ప్రతి కాన్పునకు రూ.2 వేల వరకు ప్రైవేటు వైద్యులు ప్రోత్సాహంగా ఇస్తున్నారు. ఇంకొందరు ఆరు నెలలకోసారి విందు భోజనాలు ఏర్పాటు చేసి చీరలు బహుమతులుగా ఇస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది.

కొందరికి మెమోలు ఇచ్చాం- డాక్టర్ ప్రశాంతి, డీపీఎంఓ, విశాఖపట్నం ప్రైవేటు ఆసుపత్రులకు ఎక్కువ కేసులు తరలించారని ఆరోపణలు ఉన్న ఆశా కార్యకర్తలకు మెమోలు ఇచ్చాం.

# దళారులకే పంట!

శ్రీకాళహస్తి : వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతులను దళారుల బారిన పడేలా చేసింది. వరినాట్లు వేసిన సమయం నుంచి నెల రోజుల వ్యవధి వరకు విధిగా ఈ-క్రాప్ నమోదు చేయాలి. అధికారులు నామమాత్రంగా నమోదు చేసి చేతులు దులుపుకోవడంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టినా ఈ-క్రాప్‌లో నమోదు కాని రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

అన్నదాతల పరిస్థితిని అలుసుగా తీసుకుంటున్న వ్యాపారులు, మిల్లర్లు సిండికేట్‌గా మారి ప్రభుత్వ మద్దతు ధరతో సంబంధం లేకుండా తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. తేమ పేరుతో బస్తాకు ఏకంగా ఐదు కిలోల చొప్పున అధికంగా ధాన్యం సేకరిస్తూ రైతులను మోసగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో రైతులు బస్తాకు రూ.200 వరకు నష్టపోతున్నారు. పెట్టుబడులకు చేసిన అప్పులకు వడ్డీలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మద్దతు ధర కల్పించేలా చర్యలు– రమేష్‌రెడ్డి, ఏడీఏ, శ్రీకాళహస్తి

ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటాం. సులభతరంగా ధాన్యం అమ్ముకోవడంతో పాటు సకాలంలో రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చూస్తాం. దళారులు, మిల్లర్లు సిండికేట్‌గా వ్యవహరిస్తూ రైతులను మోసం చేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

రోజుకో ధరతో అవస్థలు– సుబ్రహ్మణ్యంనాయుడు, రైతు దళారులు రోజుకో ధర చెబుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారు. రెండేళ్లకు ముందు 80 కిలోల బస్తా ధర రూ.2200 వరకు ఉండగా.. మూడు రోజులకు ముందు రూ.1830.. ప్రస్తుతం రూ.1750కి అడుగుతున్నారు. ఈ ఏడాది నష్టాలు చవిచూడాల్సి వచ్చింది.

# అలివిగాని అక్రమాలు

నందికొట్కూరు : కృష్ణానదిలో నిషేధిత అలివి వలలతో బహిరంగంగా చేపల వేట సాగుతున్నా మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దళారులు కోస్తా ప్రాంతం నుంచి వందలాది మంది జాలర్లను పిలిపించుకున్నారు. వారు నది ఒడ్డునే గుడారాలు వేసుకుని తిష్టవేశారు. రేయింబవళ్లు వేట సాగిస్తున్నారు. చేప పిల్లల్నీ పట్టి ఒడ్డున ఆరబెడుతున్నారు. వాటిని ఎండు చేపలుగా మార్చి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. దీనివల్ల నదిలో మత్స్య సంపద తరిగిపోయి తాము జీవనోపాధి కోల్పోవాల్సి వస్తోందని స్థానిక మత్స్యకారులకు వాపోతున్నారు.

**అందరికీ మామూళ్లు**

ప్రస్తుతం నదిలో నీటిమట్టం తగ్గడంతో చేపల వేటకు అనుకూలంగా మారింది. ఇదే అదనుగా దళారులు వైజాగ్, ఇతర కోస్తా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జాలర్లను రప్పించారు.

నందికొట్కూరు మండలం శాతనకోట, జంగంపాడు, పగిడ్యాల మండలం నెహ్రూగనర్, కొత్తపల్లి మండలం సంగమేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప గ్రామాల సమీపాన కృష్ణానది ఒడ్డున ఇతర ప్రాంతాల జాలర్లు సుమారు 50 గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరు రేయింబవళ్లు వేట సాగిస్తున్నారు.

దళారులు జాలర్లకు నెలకు రూ.10 వేలు చెల్లించడంతో పాటు నెలకు సరిపడా సరకులు ఇస్తూ చేపలు పట్టిస్తున్నారు. దీంతో స్థానిక మత్స్యకారులు ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది.

రోజూ రూ.లక్షలు దండుకుంటున్న దళారులు మత్స్యశాఖ, పోలీస్,



రెవెన్యూ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు మామూళ్లు ఇస్తున్నారు. దీంతో పట్టపగలే బహిరంగంగా వేట సాగిస్తున్నా ఒక్కరూ అడ్డు చెప్పడం లేదన్న ఆరోపణలున్నాయి.

**నిత్యం రూ.లక్షల్లో ఆదాయం** ప్రస్తుతం నదిలో అలివి వలలకు చిరు చేపల నుంచి 4 కిలోల పరిమాణంలోని మీనాలు పడుతున్నాయి. పెద్ద చేపల్ని కిలో రూ.160తో విక్రయిస్తున్నారు. చిన్న చేపలను ఒడ్డునే ఆరబెడుతున్నారు. ఎండిన తర్వాత కిలో రూ.120తో విక్రయిస్తున్నారు. నిత్యం మూడు మండలాల పరిధిలో 1500 కిలోలకు పైగా చేపలు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎండు చేపలు పెద్దఎత్తున విక్రయిస్తున్నారు. ఏటా డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకు దళారులు వేట సాగిస్తూ భారీగా ఆర్జిస్తున్నారు.

# నీటిశుద్ధికి తుప్పు



డోన్ : ఎస్సీ వసతి గృహ విద్యార్థులకు మంచినీరు కరవైంది. నీటి శుద్ధి యంత్రాలకు మరమ్మతులకు గురికావడంతో 'బోరు' నీటినే తాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ బాలుర, బాలికల ప్రీ-మెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతిగృహాల విద్యార్థులకు శుద్ధి చేసిన నీరు ఇవ్వాలని 2019లో తెదేపా ప్రభుత్వం నిర్ణయించింది. డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్ (డీఎంఎఫ్) నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 74 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఆర్వోప్లాంట్లను ఏర్పాటు చేసే బాధ్యతను నాలుగు ఏజెన్సీలకు అప్పగించారు. ఒక్కో శుద్ధజలం ప్లాంటుకు రూ.1.46 లక్షల చొప్పున రూ.1.08 కోట్లు వెచ్చించారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో ఏడాది తర్వాత మూలకు చేరాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కొన్ని చోట్ల సంక్షేమాధికారులే సొంత నిధులు వెచ్చించి బాగు చేయించారు. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించి బాగు చేయించాలని భావిభారతం విన్నవిస్తోంది. " త్వరలోనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తామని" జిల్లా అధికారిణి చింతామణి పేర్కొన్నారు.

# ఏదీ బకాయి వేతనం.. ఎన్నాళ్లీ దుర్భర జీవనం?



అనంతపురం : ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న వేతనదారులకు (కూలీలకు) ఇబ్బందులు తప్పటంలేదు. జనవరి 13 నుంచి చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. కూలీలకు రూ.48 కోట్లు వేతన బకాయిలు చెల్లింపులు నిలిచిపోవటంతో కష్టాలు ఎక్కువయ్యాయి. ఎండలో పనిచేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవటంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. అనంతపురం జిల్లాలో 31 మండలాల పరిధిలో రోజువారీ 42 వేల మంది పనులు చేస్తున్నారు. వేసవి కావటంతో వ్యవసాయ పనులు లేక ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులపైనే ఆధారపడుతున్నారు. ఒక్కో కూలీకి వారు చేస్తున్న పనిని బట్టి సగటున రూ.263 మొత్తం రోజు కూలి చెల్లించాల్సి ఉంది. కరవు మండలాల్లో జాబ్‌కార్డులో ఉన్నవారికి 100 రోజుల పనిదినాలను 150 రోజులకు పెంచి ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోంది.

2018 సంవత్సరం వరకూ వేసవి కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం కూలీలకు పని ప్రదేశంలో తాత్కాలికంగా పరదా నీడ, తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి సౌకర్యాలు కల్పించి.. వారికి పనిముట్లను కల్పించింది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టార్పాలిన్ పట్టలు మాత్రమే ఇచ్చి మిగిలినవన్నీ నిలిపివేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మునుపటి సౌకర్యాలు కల్పిస్తుందని కూలీలు ఎదురుచూస్తున్నారు.

ఆదేశాలు వచ్చాయి... : సలీంబాషా, పీడీ, డ్వామా

కూలీలు పనిచేసే ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు వచ్చాయి. పంచాయితీ అధికారుల సహకారంతో తాగునీరు, వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పని ప్రదేశాల్లో అందుబాటులో ఉంచుతాం. గతంలో ఇచ్చిన టార్పాలిన్ పట్టలు ఎక్కడున్నాయనే వివరాలు తెలుసుకుంటున్నాం. అందుబాటులో ఉన్న వాటిని పని ప్రదేశాల్లోకి తీసుకొస్తాం. అవి లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొనుగోలు చేసి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం. బకాయి వేతనాలు త్వరలోనే విడుదలవుతాయి.

అనంతపురం జిల్లాలో మొత్తం జాబ్‌కార్డులు: 3.13 లక్షలు
రోజువారీ పనులకు వస్తున్న కూలీలు: 42వేలు
వేతన బకాయిల మొత్తం : సుమారు రూ.48కోట్లు

# నిర్లక్ష్యమే శాపమై.. నిలువెల్లా కూపమై..



పాడేరు : నదులు నాగరికతను నేర్పాయి.. పాడి పంటలకు ఆధారంగా నిలిచాయి.. అభివృద్ధి అవకాశాలను చూపాయి. ఇంతటి ప్రాధాన్యతున్న నదులు నేడు మానవ నిర్లక్ష్యంతో వాటి సహజ స్వరూపం కోల్పోతున్నాయి. వాటి ప్రాముఖ్యం తెలియజేసేలా ఏటా మార్చి 14న అంతర్జాతీయ నదీ పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ప్రధాన నదుల పరిస్థితిని పరిశీలించగా చాలావరకు వాటి రూపురేఖలు మారిపోయాయి. నదుల్లోకి భారీగా వ్యర్థాలు, కలుషిత జలాలు వచ్చి చేరడంతో నీరు గరళమవుతోంది. ఇసుక తవ్వకాలు, ఆక్రమణలు పెరిగి వరదల వేళ పరిసర గ్రామాలను ముంచెత్తుతున్నాయి. జీవనాధారమైన నదీమతల్లులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

అనకాపల్లి జిల్లాలో శారదా, వరాహ, పెద్దేరు, తాండవ, సర్పా నదులు, అల్లూరి జిల్లాలో గోస్తనీ, సీలేరు నదులున్నాయి. ఇవి లక్షల మంది తాగునీటి అవసరాలను తీర్చుతున్నాయి. లక్షల ఎకరాల్లో పంటలకు సాగునీటికి ఆధారంగా ఉన్నాయి. కొంతమంది స్వార్థానికి ఈ నదులు జీవం కోల్పోతున్నాయి. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు సాగించడం, నదులకు ఇరువైపులా ఆక్రమించి పంటలు సాగుచేయడంతో నీటి చుక్క నిలవడానికి అవకాశం లేకుండాపోతోంది. ఫలితంగా తాగునీటి, సాగునీటికి ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. మన అభివృద్ధిలో నదుల పాత్రను అందరికీ తెలియజేసి వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వంతో పాటు ప్రజలు సామాజిక బాధ్యతగా తీసుకుని నదులకు రక్షణగా నిలవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

**పరిరక్షణ మన చేతుల్లోనే..**

అయిదేళ్ల క్రితం సోమదేవుపల్లిలో అమ్మవారి ఆలయం జనం చూస్తుండగానే నదిలో ఒరిగిపోయింది. అక్కడ వరదకట్ట నిర్మాణానికి రూ.10 కోట్లు, మూలపాలెం గ్రోయిన్ ఆనకట్టగా మార్చేందుకు రూ.37 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. వైకాపా ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.

వరాహ, సర్పా, శారదా, గోస్తనీ నదుల్లో ఆనకట్టలు, గ్రోయిన్లు అన్నీ పాడయ్యాయి. వీటికితోడు ఇసుక అక్రమ తవ్వకాల కారణంగా గోతులు ప్రాణాంతకంగా ఏర్పడుతున్నాయి. దీంతోపాటు నదుల ప్రవాహ దిశ మారే పరిస్థితులున్నాయి.

తాండవ నదిపై నిమ్మ, ముత్తా, భూమి ఆనకట్టలను పటిష్ఠపర్చాల్సి ఉంది. వరదలప్పుడు పాయకరావుపేటలో తాండవ నది ఒడ్డున ఉన్నవారు ముంపు భయాన్ని ఎదుర్కొంటున్నారు. గట్టు పటిష్ఠపరిచి ఉద్యానాలను ఏర్పాటు చేయొచ్చు. నర్సీపట్నంలో వరాహ నది ఉత్తరవాహినికి సమీపానే డంపింగ్‌యార్డు ఉంది. దీన్నుంచి కాలుష్యం నదిలో చేరుతోంది. ఈ తీరంలోనే స్నానఘట్టాలున్నా మహాశివరాత్రి, కార్తికమాసాల్లోనే నిర్వహణ పనులు చేపడుతున్నారు. మిగతా కాలాల్లో ఇక్కడంతా వ్యర్థాలే కనిపిస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమాలను చేపడుతోంది. అలాంటి రోజుల్లో నదుల్లో కాలుష్యంపైనా దృష్టిసారించాలి. వ్యర్థాలు నదుల్లో కలపకుండా సంపద కేంద్రాలకు చేరేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. ఇసుక తవ్వకాల్లో వాల్టా చట్టం పక్కగా అమలు అయ్యేలా చూస్తే నదులకు కొంతవరకు మేలు చేసినట్లే అవుతుంది.

# కారుణ్యం చూపండి




కర్నూలు : ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు పలువురు ఎదురుచూస్తున్నారు. వైకాపా హయాంలో వాటి జాడ లేకపోవడంతో కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకొన్నారు. ఉద్యోగాలభర్తీకి ఎన్నోసార్లు ఆందోళన చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అవసరమైన పత్రాలను పరిశీలించిన అధికారులు చర్యలేమీ తీసుకోకపోవడంతో స్పందించాలని కోరుతున్నారు. వయస్సు మీద పడుతుండటంతో ఉద్యోగం వస్తుందో...రాదోననే బెంగ ఎక్కువవుతోందని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కుటుంబాలను పోషించాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

**కూటమి రావడంతో...** కూటమి ప్రభుత్వం రావడంతో కారుణ్య నియామకాలపై కదలిక వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 23 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ముగ్గురు అభ్యర్థులు ఆరోగ్యపరంగా అర్హత సాధించకపోవడంతో తిరస్కరించారు. వేరే డిపార్ట్‌మెంట్ కావాలని కోరిన వారి దరఖాస్తులు కలెక్టరేట్‌కు చేరాయి. కనీస విద్యార్హత లేకపోవడంతో మరో ముగ్గురికి అవకాశం ఇవ్వలేదు. కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉంచారు. వారి దరఖాస్తులు పరిశీలించిన కమిటీ కర్నూలు జిల్లాలో 6, నంద్యాల జిల్లాలో అయిదుగురికి ఆర్టీసీలో ఉద్యోగావకాశాన్ని కల్పించారు.

**ప్రభుత్వ నిర్ణయంతో ఇంకొందరికి..**

ఆర్టీసీ ఉద్యోగులు జనవరి 1, 2020 నుంచి ప్రజా రవాణశాఖ ఉద్యోగులుగా సేవలు అందిస్తున్నారు. 2016 నుంచి 2019 డిసెంబరు వరకు చనిపోయిన వారి కుటుంబాలకు కారుణ్య నియామకాలకు ప్రభుత్వం అంగీకరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 డిసెంబర్ 31 ముందు వరకు కుటుంబాలకు వర్తించేలా ఉత్తర్వులు ఇచ్చారు. తాజా నిర్ణయంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మరో 50 మందికి ఉద్యోగాలు దక్కే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆయా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరలో జరుగుతుందని ఆర్టీసీ పరిపాలనాధికారులు వెల్లడించారు. వయసు మినహాయింపు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

**ప్రభుత్వ నిర్ణయమే కీలకం -శ్రీనివాసులు(ప్రజారవాణాధికారి)**

ప్రభుత్వ నిర్ణయం మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 23 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. కేవలం 26 మంది అర్హత సాధించారు. ఆరోగ్యపరంగా కొందరు అనర్హులవ్వడంతో ముగ్గురికి ఉద్యోగం రాలేదు. ఉన్నత చదువులు చదివిన వారు వేరే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం కావాలని కోరడంతో వారి దరఖాస్తులను కలెక్టరేట్‌కు పంపించాం.

# మది కదలాలి.. నది మురవాలి

కర్నూలు : జలం ఉంటే జీవం బతుకుతుంది. నది ఉంటే నాగరికత అభివృద్ధి చెందుతుంది.. ఆరోగ్యకరమైన నదులు, పరిశుభ్రమైన నీటిని పొందడం మనందరి ప్రాథమిక హక్కు.. సమస్త జీవుల మనుగడకు వేదికలైన నదులు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి.. వాటిపై ఆధారపడి బతికే ప్రాణులకు ముప్పు పొంచి ఉంది. రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో నాలుగు నదులు ప్రవహిస్తున్నాయి. సుమారు ఆరు లక్షల ఎకరాలకు సాగు.. వందల గ్రామాలకు మంచినీరు అందించే నదీ జలం విషమిస్తోంది.. నదుల కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం సందర్భంగా ఈసారి "మన నదులు.. మన భవిష్యత్తు" థీమ్‌తో ముందుకెళ్తున్నారు.. దీనిని స్ఫూర్తిగా తీసుకొని నదుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**శుద్ధీకరణ పట్టని పురపాలికలు**

నదీ జలాల కాలుష్యాన్ని గుర్తించిన ఎన్‌జీటీ శేషశయనారెడ్డి కమిటీ కర్నూలు కార్పొరేషన్‌కు గతంలో రూ.5 కోట్ల జరిమానా విధించింది. కాలుష్య నియంత్రణ మండలి కర్నూలు కార్పొరేషన్‌కు 20కు పైగా తాఖీదులు జారీ చేసింది. అయినా పరిస్థితిలో మార్పులేదు.

నగరంలో దేవనగర్ హంద్రీ వంతెన సమీపంలో 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. పాత నగరం జమ్మిచెట్టు వద్ద ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మిస్తున్న శుద్ధి కేంద్రం పనులదీ ఇదే పరిస్థితి. నంద్యాల పట్టణ శివార్లలోని కర్నూలు బైపాస్ రోడ్డు సమీపంలో రూ.3 కోట్ల వ్యయంతో మూడు ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు మూడేళ్ల కిందట ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటి వరకు అడుగులు పడలేదు.

నది: హంద్రీ
జిల్లాలో ప్రవాహం (కి.మీ): 95
ఎక్కడి నుంచి ఎక్కడికి: దేవనకొండ-పత్తికొండ మధ్యలో పుట్టి కర్నూలు నగర శివారులోని జొహరాపురం వరకు.

**కుందూ నిండా గరళమే**

నంద్యాల పట్టణంలో నిత్యం విడుదలవుతున్న 30 ఎంఎల్‌డీ మురుగు నేరుగా కుందూలోకి వదిలేస్తున్నారు.

మురుగు నీటిలో కోలిఫాం 500 ఎంపీఎన్/100 మిల్లీలీటర్లు ఉండాలి. నంద్యాల పట్టణంలోని మురుగులో వెయ్యి వరకు ఉంది. ప్రమాణాల ప్రకారం లీటరు నీటిలో బయో కెమికల్ ఆక్సిజన్ (బీవోబీ) 30 ఎంజీ ఉండాలి. కుందూ నదిలో ఇది 40- 50 ఎంజీ వరకు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

పాణ్యం, బనగానపల్లి, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ మండలాల్లోని 40 గ్రామాలు కుందూ జలాలపై ఆధారపడ్డాయి. లక్ష జనాభాకు ఈ నది ద్వారానే మంచినీటి సరఫరా జరుగుతోంది.

నది: కుందూ
జిల్లాలో ప్రవాహం (కి.మీ): 97
ఎక్కడి నుంచి ఎక్కడికి: ఓర్వకల్లులో మొదలై కోవెలకుంట్ల వరకు ప్రవహిస్తుంది

**సీమ ప్రజల జీవనాధారం**

శ్రీశైలం జలాశయం ఆధారంగా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారు. రాయలసీమ ప్రాంతానికి ఇక్కడి నుంచే సాగునీరు వెళ్తోంది. కర్నూలు, కడప కాల్వ, శ్రీశైలం కుడిగట్టు కాల్వ, తెలుగు గంగ, హంద్రీనీవా కాల్వలకు శ్రీశైలం వెనుక జలాలు తరలిస్తారు.

శ్రీశైలం జలాశయానికి గతేడాది జులై 17 నుంచి వరద ప్రవాహం మొదలైంది.. కృష్ణా (జూరాల), తుంగభద్ర (సుంకేసుల), హంద్రీ నదుల నుంచి వరద పోటెత్తడంతో ఆరుసార్లు జలాశయం రేడియల్ క్రస్ట్ గేట్లు పైకెత్తారు.

నది: కృష్ణా
జిల్లాలో ప్రవాహం (కి.మీ): 98
ఎక్కడి నుంచి ఎక్కడికి: శాతనకోట వద్ద మొదలై శ్రీశైలం జలాశయం వరకు

**తుంగ కాలుష్య గంగ**

కర్నూలు నగరపాలక పరిధిలో రోజుకు సగటున 60 ఎంఎల్‌డీ మురుగునీరు విడుదల అవుతోంది. శుద్ధి చేయకుండా నేరుగా తుంగభద్రలోకి వదులుతున్నారు.

సాధారణంగా ఈ వ్యర్థాల్లో కోలి బ్యాక్టీరియా సగటున 600 సీఎఫ్‌యూ/100 ఎంఎల్ ఉండాలి. వివిధ ప్రాంతాల్లో 1100- 1200 దాటుతున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి గతంలో ప్రకటించింది. కోలి బ్యాక్టీరియా 50 దాటితే ఆ నీటిని శుద్ధిచేసి తాగాలి. లేకపోతే విరేచనాలు, టైఫాయిడ్, హెపటైటిస్ బారినపడే ప్రమాదం ఉంది.

తుంగభద్ర జలాలపై ఆధారపడి వివిధ చోట్ల సీపీడబ్ల్యూ పథకాలు నడుస్తున్నాయి. 193 గ్రామాల పరిధిలోని 5 లక్షల మందికిపైగా జనాభా తాగునీటి అవసరాలకు తుంగభద్ర జలాలే ఆధారం.

నది: తుంగభద్ర
జిల్లాలో ప్రవాహం (కి.మీ): 115
ఎక్కడి నుంచి ఎక్కడికి: కౌతాళం మండలం మేళిగనూరు వద్ద మొదలై సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది.

# లోటుపాట్ల దిద్దుబాటు

కర్నూలు: భానుడి దాటికి మార్చిలోనే 'మాడు'తోంది. ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇళ్లల్లో ఏసీలు, ఫ్యాన్లు 24 గంటలు తిరగడంతో విద్యుత్తు మీటర్లు ఆగడం లేదు. ఏప్రిల్, మే వచ్చేసరికి వినియోగం తారస్థాయికి చేరుకుంటుంది. విద్యుత్తు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ఉప కేంద్రాలపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. సాంకేతిక లోపాలు తలెత్తి సరఫరా నిలిచిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని అధిగమించేందుకు విద్యుత్తు శాఖ ముందస్తుగా చర్యలు చేపట్టింది. ప్రీమాన్‌సూన్ ఇన్‌స్పెక్షన్ (పీఎంఐ) కింద లోపాలు సరి చేస్తున్నారు.

గృహ, వాణిజ్యం, వ్యవసాయం, ప్రభుత్వ శాఖలు, కర్మాగారాలకు సంబంధించిన విద్యుత్తు వినియోగం జరుగుతోంది. ఏప్రిల్ నుంచి కోటాకు మించి సుమారు 15 ఎంయూ వరకు వినియోగం ఉండే అవకాశముంది. ఎండకాలంలో గాలులు బలంగా వీస్తాయి. సమీపంలో ఉండే చెట్ల కొమ్మల కారణంగా తరచూ విద్యుత్తు ట్రిప్ అవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని పీఎంఐలో భాగంగా 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లతోపాటు నియంత్రికల సమీపంలో ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నారు.

విద్యుత్తు నియంత్రికలు, ఉప కేంద్రాల్లో ఉండే స్విచ్‌లను ఆన్ అండ్ ఆఫ్ చేసే సమయంలో స్పార్క్స్ వస్తుంటాయి. ఈ లోపాన్ని సరిచేసేందుకు గ్రీజ్ రాస్తున్నారు. వేసవిలో ఎండ తీవ్రత పెరిగేకొద్దీ విద్యుత్తు తీగలు మరింత వదులవుతాయి. పీఎంఐలో భాగంగా వదులుగా ఉన్న విద్యుత్తు తీగలు, వాలిపోయిన స్తంభాలు సరిచేస్తున్నారు. విద్యుత్తు స్తంభాలపై ఉండే పింగాణి భాగాలే ఇన్సులేటర్లు. షార్ట్‌సర్క్యూట్ కాకుండా ఇన్సులేటర్లు అడ్డుకుంటాయి. ఒక్కోసారి వాటిలో పగుళ్లు ఏర్పడతాయి. వేసవిలో విద్యుత్తు వినియోగం పెరిగినప్పుడు ఇన్సులేటర్లు పేలిపోయే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా తనిఖీలు చేస్తున్నారు.

చురకలు



# కన్నీరై'నది'

శ్రీకాళహస్తి : అక్రమార్కులు కబ్జా చేసి భారీ సౌధాలు నిర్మిస్తున్నారు. పరీవాహక ప్రాంతాల్లో ఇసుక దోచేస్తుండటంతో నదీమతల్లి కన్నీరు పెడుతోంది. నదులు సహజత్వాన్ని కోల్పోతున్నాయి. పంటలను సస్యశ్యామలం చేయాల్సిన జలాలు జనావాసాలను ముంచెతుతున్నాయి. ఏటా మార్చి 14న నదుల పరిరక్షణ కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని నదులు సాగుకు ఉపయోగపడుతున్న తీరు, పెరుగుతున్న ఆక్రమణలు, ఇప్పటివరకు తలెత్తిన నష్టంపై కథనం.

**4 లక్షల ఎకరాలకు నీరు అందిస్తూ** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కుశస్థలి, స్వర్ణముఖి, నీవా, కౌండిన్య, గార్గేయ, బాహుదా నదులు ప్రవహిస్తున్నాయి. సోమల, ఐరాల, గంగా ధరనెల్లూరు, చిత్తూరు, నగరి మండలాల్లో పెద్దగా ఇక్కట్లు తలెత్తడం లేదు. నదుల ద్వారా ఏటా సుమారు 4 లక్షల ఎకరాలు సాగవు తున్నాయి.

**కుశస్థలి కింద లక్ష ఎకరాలు**

జీడీనెల్లూరు, నగరి నియోజకవర్గంలోని మండలాల్లో సుమారు 50



కిలోమీటర్లు కుశస్థలి నది ప్రవహిస్తుంది. ఈ నది కార్వేటినగరంలోని కృష్ణాపురం రిజర్వాయర్ వద్ద చిన్న కాలువగా మొదలై ఏపీ, తమిళనాడు ప్రాంతాల్లో ఏటా వర్షాకాలంలో ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. ఏటా ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ నదిపై 1972లో అప్పటి ఎమ్మెల్యే కిలారి గోపాలనాయుడు బుగ్గ ప్రాజెక్టు చేపట్టారు. దీని ద్వారా నగరి, నింద్ర విజయపురం, పిచ్చాటూరు మండలాల్లో సుమారు 40 చెరువులు ఏటా నింపుతున్నారు. దీని కింద లక్ష ఎకరాలు సాగవుతాయి. 1999లో కుడి, ఎడమ కాలువలు, చెక్‌డ్యామ్‌లు కట్టారు. ప్రస్తుతం చెక్‌డ్యామ్ కొట్టుకుపోయింది. దాన్ని నిర్మిస్తే మరింత ప్రయోజనం ఉంటుంది. ఇసుక అక్రమార్కులకు నది వరంగా మారింది.

ఐరాల, పూతలపట్టులలో ప్రవహించే గార్గేయ నది కలవగుంటకు చేరుతుంది. అక్కడి నుంచి చిత్తూరుకు తాగునీరు అందిస్తున్నారు. ఈ నది సుమారు 20 కి.మీ ప్రవహిస్తుంది. ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

**కౌండిన్యపై 11 చెక్‌డ్యామ్‌లు దెబ్బతిన్నా..**

పెద్దపంజాణి, పలమనేరు ప్రాంత రైతులకు వరప్రసాదినిగా ఉన్న కౌండిన్య ప్రాజెక్టు కింద సమృద్ధిగా వర్షాలు పడితే సుమారు 70 వేల ఎకరాలు సాగువుతుంది. గత ప్రభుత్వాల హయాంలో కౌండిన్య ప్రాజెక్టుపై 11 చెక్‌డ్యామ్‌లు నిర్మించి నీటిని నిలువరించారు. ఇసుక అక్రమార్కులు ధ్వంసం చేయడంతో వర్షపు నీరంతా తమిళనాడుకు వెళుతోంది. కల్వర్టులు బాగు చేయాలని కోరినా ప్రజాప్రతినిధుల చెవికెక్కడం లేదు. చెక్‌డ్యామ్‌లు మరమ్మతులు చేపడితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఒకప్పుడు మంచి నీరు ప్రవహించే నీవా నదిలో ఇప్పుడు మురుగు పారుతోంది. చిత్తూరులోని తోటపాళ్యం, వీరభద్ర కాలనీ, రంగాచారి వీధి వెనుక భాగం, సంతపేట, రిక్షా కాలనీ, దొడ్డిపల్లి ప్రాంతాలు నీట మునుగుతున్నాయి.

సోమల మండలంలోని గార్గేయ నది పరీవాహక ప్రాంతమంతా ఆక్రమణకు గురైంది. వర్షాకాలంలో ఇబ్బందులే. ఈ నదులపై చెక్‌డ్యాంలు నిర్మించడం ద్వారా నీటి నిల్వలు పెంచుకోవచ్చు.

# అంటకాగి అక్రమాలు

అనంతపురం : పేదలకు ఇళ్లు నిర్మించి వారికి అండగా నిలవాల్సిన కొందరు ఇంటి దొంగలుగా మారుతున్నారు. గత వైకాపా హయాంలో వైకాపా నేతలతో అంటకాగి సిమెంటు, స్టీలు, ఇసుకను నేతల సొంతానికి ఇవ్వడంతో పాటు అధికారులు అక్రమార్గంలో నడిచారు. ఇప్పటికే పలువురు అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు మరికొందరిపై ఛార్జి మెమోలు ఇచ్చి విచారణ చేయిస్తున్నారు. ప్రధానంగా రాప్తాడు నియోజకవర్గంలోనే ఎక్కువగా అక్రమాలు సాగినట్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వచ్చాయి. అయినా కొందరు గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల్లో మార్పు రాలేదు. తాజాగా రాయదుర్గంలో టన్నుల కొద్దీ ఉక్కు మాయం అయినట్లు వెలుగులోకి వచ్చింది. మళ్లీ గోదాములో ఉంచి దాన్ని తొక్కి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**15 టన్నులు..**జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను బట్టి గృహనిర్మాణ సంస్థ గోదాముల్లో స్టీలు ఉంచుతారు. రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి అక్కడే గోదాములో నిల్వ ఉంచారు. నిల్వ ఉన్న దానికి




ఇళ్ల నిర్మాణాలకు వినియోగానికి భారీగా వ్యత్యాసం ఉన్నట్లు అనుమానం రావడంతో ఆ శాఖకు చెందిన అధికారులు పరిశీలించి నిజమేనని తేల్చారు. అంతర్గతంగా మరో డివిజన్ స్థాయి అధికారిని విచారణ అధికారిగా నియమించారు. సదరు అధికారితోపాటు స్థానికంగా సిబ్బందితో స్టీలు లెక్కగట్టారు. తక్కువగా ఉన్నట్లు తేలినా చర్యలకు వెనుకాడుతున్నారు. మొత్తంగా 15 టన్నులు మాయం అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఇళ్ల నిర్మాణానికి ఉపయోగించే స్టీలు నాణ్యతను బట్టి టన్ను రూ.65 వేల నుంచి రూ.70 వేల వరకు ఉంది. ఈ లెక్కన రాయదుర్గంలోనే రూ.10 లక్షల విలువైన స్టీలు మాయం చేసి విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం.

# బాల్య వివాహాలు బంద్ అయ్యేదెలా?



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లాలో జరిగే ప్రతి వంద పెళ్లిళ్లల్లో.. 37 బాల్య వివాహాలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పేదరికం.. సంప్రదాయం, నిరక్షరాస్యత.. ఇలా కారణం ఏదైనా చదువుకునే వయసులో బాలికలపై మోయలేని భారాన్ని మోపుతున్నారు. బాలికకే కాదు.. పుట్టబోయే బిడ్డలకు ప్రాణాపాయమే. కుటుంబాలపై మరింత ఆర్థిక భారంతోపాటు మానసికంగా కుంగిపోవాల్సి వస్తోంది. మరోవైపు ఐసీడీఎస్ శాఖలు తూతూమంత్రంగా గణంకాలను నమోదు చేసి ఉన్నతాధికారులను బురిడీ కొట్టిస్తున్నాయి. గడిచిన ఏడాదిలో ఇరు జిల్లాల్లో 282 బాల్యవివాహాలు జరిగినట్లు చూపుతున్నారు. 18 ఏళ్లలోపు గర్భం దాలుస్తున్న వారి వివరాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేశారు. టీనేజీ గర్భిణులు/తల్లులు 2,800 పైచిలుకు ఉండటం గమనార్హం. దీన్నిబట్టి బాల్యవివాహాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు అవగతం అవుతోంది.

**శాఖల సమన్వయంతో అడ్డుకట్ట**

బాల్యవివాహాల నిర్మూలన బాధ్యత ఐసీడీఎస్‌దేనన్న భావన ప్రభుత్వ శాఖల్లో నెలకొంది. విద్య, వైద్య–ఆరోగ్యం, మెప్మా, డీఆర్‌డీఏ–వెలుగు, కార్మిక, రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, మున్సిపాలిటీ, సంక్షేమ.. ఇలా పలు శాఖల అధికారుల సమన్వయంతో పక్కా ప్రణాళికతో ముందుకెళితేనే నిర్మూలన సాధ్యం.

జిల్లా స్థాయి నిర్మూలన కమిటీలో 30 మంది సభ్యులు ఉంటారు. ఇందులో 23 మంది ప్రభుత్వ శాఖల నుంచి తక్కిన వారందరూ ఎన్జీఓలు. ప్రతి నెలా సమీక్షలు నిర్వహించడం తప్ప..నిర్మాణాత్మక చర్యలు శూన్యం. గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లోనూ కమిటీలు ఉన్నా నిష్ప్రయోజనంగా మారాయి.

**ఎక్కువగా ఎక్కడెక్కడంటే..**

అనంత జిల్లా పరిధి: కళ్యాణదుర్గం, రాయదుర్గం, శింగనమల, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాలు

శ్రీసత్యసాయి జిల్లా: కదిరి, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, రాప్తాడు నియోజకవర్గాలు

**విస్తృతంగా అవగాహన–** నాగమణి, పీడీ, ఐసీడీఎస్

బాల్య వివాహాల నిర్మూలన నిరంతర కార్యక్రమం. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. గతంతో పోల్చితే ఇప్పుడు బాల్యవివాహాలు తగ్గాయి. మరింత విస్తృతంగా అవగాహన శిబిరాలను నిర్వహిస్తాం. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తున్నాం.

# నది..ఆక్రమణలకు అడ్డేదీ?



అనంతపురం: ఉమ్మడి అనంత జిల్లా ప్రజలు తాగు, సాగు నీటికి నదీజలాలపైనే ఆధారపడుతున్నారు. పెన్నాపై ఎగువ పెన్నా, పీఏబీఆర్, కుముద్వతి, మిడ్‌పెన్నార్, చాగల్లు.. చిత్రావతిపై బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, వేదవతిపై బైరవానితిప్ప ప్రాజెక్టులు నిర్మించి తాగు, సాగు నీరు అందిస్తున్నారు. కృష్ణా, తుంగభద్రను ఆధారం చేసుకుని హంద్రీనీవా, హెచ్చెల్సీ పథకాలను రూపొందించి లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న నదులకు ముప్పు వాటిల్లుతోంది. నేడు నదుల కోసం అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

**కబ్జా కోరల్లో పెన్నా..**

ఉమ్మడి జిల్లా పరిధిలో ఎన్ని కిలోమీటర్లు: 275

వరద ప్రభావిత ప్రాంతాలు: హిందూపురం, పామిడి, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలాలు

నంది హిల్స్‌లో పుట్టి హిందూపురం మండలంలో ప్రవేశిస్తుంది. పరిగి, రొద్దం, రామగిరి, కంబదూరు, బెళుగుప్ప, కూడేరు, శింగనమల, గార్లదిన్నె, పామిడి, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలాల మీదుగా కడప జిల్లాలోకి వెళుతుంది. 500 మీటర్ల వెడల్పు ఉండాల్సిన పెన్నా 100 మీటర్లకు కుదించుకుపోయింది.

2022 నుంచి వరదలు పోటెత్తుతున్నాయి. ఏటా 3 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లుతున్నట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. పునరుజ్జీవం కోసం సబ్ సర్‌ప్లస్ డ్యాంలు నిర్మించాలని.. ఇందుకు రూ.100 కోట్లు అవసరమని అంచనా వేశారు. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు.

**చిత్రావతిలో నిర్మాణాలు** ఉమ్మడి జిల్లా పరిధిలో ఎన్ని కిలోమీటర్లు: 166

వరద ప్రభావిత ప్రాంతాలు: గోరంట్ల, పుట్టపర్తి

కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్‌లో పుట్టి చిలమత్తూరు, గోరంట్ల, బుక్కపట్నం, పుట్టపర్తి, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, యల్లనూరు మండలాల మీదుగా కడప జిల్లాలోకి ప్రవేశిస్తుంది.

2021, నవంబరులో వరదలు పుట్టపర్తి పట్టణాన్ని ముంచెత్తడంతో ఆస్తి నష్టం వాటిల్లింది. అప్పట్లో అక్రమనిర్మాణాలు గుర్తించినా తొలగించలేదు.

పుట్టపర్తిలో మురుగును శుద్ధి చేయకుండానే చిత్రావతిలోకి విడుదల చేస్తుండటంతో కలుషితమవుతోంది. సీసం వంటి హానికర మూలకాలు ఉన్నట్లు గుర్తించారు.

వేదవతి–హగరిలో ఇసుక దోపిడీ

ఉమ్మడి జిల్లా పరిధిలో ఎన్ని కిలోమీటర్లు: 100(చిన్న హగరితో కలిపి)


వరద ప్రభావిత ప్రాంతాలు: బొమ్మనహాళ్, రాయదుర్గం మండలాలు

కర్ణాటకలో పుట్టి గుమ్మఘట్ట మండలం బైరవానితిప్ప వద్ద ప్రవేశిస్తుంది. బొమ్మనహాళ్ మండలం సింగనహళ్లిలోని సంగమేశ్వరం వద్ద చిన్నహగరి నది కలుస్తుంది.

నదిలో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేసి రూపు కోల్పోయేలా చేస్తున్నారు. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాల్, రాయదుర్గం మండలం జుంజురాంపల్లి, గుండ్లపల్లిలో నదిని ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల ఆర్డీటీ సంస్థ సబ్ సర్‌ప్లస్ డ్యాంలు నిర్మించినా ఆక్రమణల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి.

పండమేరు.. కర్ణాటకలో పుట్టే పండమేరు నది రామగిరి మండలం నసనకోటలో శ్రీసత్యసాయి జిల్లాలోకి ప్రవేశిస్తుంది. కనగానపల్లి, రాప్తాడు మీదుగా అనంతపురం చెరువులో కలుస్తుంది. 73 కిలోమీటర్ల ఉన్న నది అనంతపురం పరిధిలో కబ్జాకు గురైంది. గతేడాది వరదలకు పలు కాలనీలు జలదిగ్బంధం అయ్యాయి.

# రిజిస్ట్రేషన్ శాఖకు దొరకని అద్దె భవనం




అనంతపురం : ప్రభుత్వానికి పైసా ఆదాయం ఇవ్వని శాఖలకు సొంత భవనాలు ఆధునిక హంగులతో ఉన్నాయి. ఆదాయం సమకూర్చే ఈ శాఖకు సొంత భవనాలు లేకపోవడం విడ్డూరంగా ఉంది. జిల్లా రిజిస్ట్రేషన్, అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నడుస్తున్న అద్దె భవనాన్ని 4 నెలల్లోగా ఖాళీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆ భవనాన్ని సంబంధించిన యజమాని హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఆ మేరకు తీర్పు ఇచ్చింది. రాష్ట్ర ఖజానాకు కామధేనువు లాంటి రిజిస్ట్రేషన్ శాఖకు సొంత భవనాలు లేవు. రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్, మార్కెట్ విలువల రిజిస్ట్రార్, అర్బన్, గ్రామీణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. రాంనగర్‌లో ఉన్న జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నడుస్తున్న భవనం పాతదైంది. ఇరుకుగా కూడా ఉంది. వసతులు కూడా లేవు. రోజు వేలాది మంది ప్రజలు పనుల కోసం వస్తుంటారు. కూర్చోడానికి స్థలం, మూత్రశాలలు కూడా లేవు. 25 ఏళ్ల నుంచి మూడు కార్యాలయాలు ఈ భవనంలోనే నడుపుతున్నారు. రాంనగర్‌లో ఉన్న జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్, చిట్‌ఫండ్ కార్యాలయాలు ఖాళీ చేయాలని గతంలో యజమాని తాఖీదులు ఇచ్చాడు. మరోచోట భవనం లేకపోవడంతో ఐదారేళ్ల నుంచి నడుపుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఈ భవనం పరిస్థితి బాగా లేదని తేల్చారు. ప్రస్తుతం ఈ భవనానికి నెలకు రూ. 70 వేల వరకు ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. ఒక చదరపు అడుగు రూ.10ల లెక్కన అద్దె చెల్లిస్తున్నారు. ఎక్కడ వెతికినా అనుకూలమైన అద్దె భవనం దొరకలేదు. మూడు కార్యాలయాలకు అనుగుణంగా ఉండే భవనం కావాలని ఆ శాఖ అధికారులు అన్వేషిస్తున్నారు. ఇప్పటికి అలాంటి భవనం ఎక్కడా కనిపించలేదు. జిల్లా రిజిస్ట్రార్ జి.భార్గవ్ ప్రభుత్వ భవనం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

మే లోగా ఖాళీ చేయాల్సిందే... : రమణరావు, అనంతపురం సబ్ రిజిస్ట్రార్ మే లోగా వేరొక భవనంలోకి మారాలని చూస్తున్నాం. త్వరలో ప్రకటన కూడా ఇస్తున్నాం. అనుకూలమైన భవనం ఉంటే వెంటనే కార్యాలయాన్ని తరలిస్తాం.

# గుట్టుగా పట్టణ ప్రణాళిక!

హిందూపురం : హిందూపురం పురపాలికలో పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) అధికారుల తీరు విస్తుగొలిపేలా ఉంది. అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ దిక్సూచి లాంటిది. రాబోయే 30 ఏళ్లలో పట్టణ విస్తరణ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించాలి. అన్ని వివరాలు సేకరించి, అన్ని వర్గాలతో సమావేశాలు నిర్వహించి, ప్రజల సలహాలు, సూచనలతో తయారు చేయాలి. వైకాపా హయాంలో అలాంటివి ఏమీ చేయలేదు. అవగాహన లేనివారు రూపొందించారు. దానిని దాచిపెట్టి ఇటీవల అమల్లోకి తెస్తున్నారు.

**గోడమీదే మాస్టర్ ప్లాన్...**ఎవరైనా పట్టణంలోని వివరాలు తెలుసుకోవా



లంటే... మున్సిపల్ కార్యాలయంలో గోడకు అతికించిన మాస్టర్ ప్లాన్ నమూనా కాగితాన్ని చూడాల్సిన పరిస్థితి. దానిని చూసి ఎవరూ అర్థం చేసుకోలేరు. డిజిటల్ రూపంలో రూపొందించకుండా గోడకు పరిమితం చేశారు. వాటి వివరాలు మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లుకు తెలియవంటే ఆశ్చర్య పోవాల్సిన పని లేదు. గోడ మీద చూసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతుండటం గమనార్హం.

**పలు తప్పిదాలు..**పట్టణంలోని డీఆర్ కాలనీలో భవన నిర్మాణాలు అడ్డుగా ఉన్నా, అవసరం లేకపోయినా 80 అడుగుల రోడ్డును ప్రతిపాదించారు. పరిగి రోడ్‌ను పరిశ్రమల జోన్‌గా గుర్తించారు. ఇలా చేయడంతో ఈ రెండు ప్రాంతాల్లో స్థల, భవన యజమానులు నష్టపోతున్నారు. ఇలాంటి తప్పిదాలు అనేకం ఉన్నట్లు తెలుస్తోంది.

**అందరికీ తెలిసేలా చేస్తాం : రమేశ్, మున్సిపల్ ఛైర్మన్.**మాస్టర్‌ప్లాన్ రికార్డు లేని మాట వాస్తవమే. కౌన్సిల్‌కు అందజేయలేదు. అధికారులతో చర్చించి, డిజిటలీకరణ చేయించి పుస్తక రూపంలోనూ తీసుకొచ్చేలా చర్యలు తీసుకొంటాం. అంతా పారదర్శకంగా ఉండేలా చూస్తాం.

# రక్షణ కరవు.. సిబ్బంది కొరత

పెనుకొండ : అటవీశాఖలో అడవుల విస్తీర్ణానికి తగ్గట్టుగా సిబ్బందిని నియమించక పోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పెనుకొండ అటవీశాఖ పరిధిలో మొత్తం 32 వేల హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని పర్యవేక్షించడానికి క్షేత్ర అధికారులు, సహాయ అటవీ క్షేత్ర అధికారులు, గార్డులు ఇలా మొత్తం 35 మంది ఉండాలి. కేవలం 13 మందితోనే నెట్టుకురావడంతో ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా సకాలంలో సంఘటనా స్థలికి చేరుకోలేక విలువైన అటవీసంపద అగ్నికి ఆహుతవుతోంది.

**పర్యావరణానికి ముప్పు**

ఫిబ్రవరి నెలాఖరు వచ్చిందంటేచాలు సువిశాల అటవీ ప్రాంతంలో ఎక్కడో ఒకచోట ఆకతాయిలు, మందుబాబులు, పశువుల కాపరులు ఇలా ఎవరో ఒకరు ఎండు గ్రాసానికి నిప్పు పెడుతున్నారు. దీంతో వేలాదిగా పచ్చని మొక్కలు, చెట్లు మంటల్లో తగలబడి పోతున్నాయి. అడవి జంతువులు, పశుపక్షాదులు హాహాకారాలు చేస్తున్నాయి. పర్యావరణానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నారు. అగ్నిమాపక వాహనం అధికారులు, సిబ్బందితో కలసి తమ శాఖలో ఉన్న అరకొర అధికారు



లు, సిబ్బంది అటవీ ప్రాంతానికి సకాలంలో చేరుకోలేక మంటలను ఆర్పడం, అటవీ ప్రాంతాలను కాపాడుకోవడం కత్తిమీద సాములా మారింది. మంటలను అదుపు చేసేందుకు అవసరమైన ఆధునిక యంత్రాలు, పద్ధతులను ప్రభుత్వం, ఉన్నతాధికారులు అమలు చేయక పోవడంతో ఏటా వేల ఎకరాల్లో అటవీ సంపద బూడిదయిపోతోంది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

అధికారులు, సిబ్బంది కొరతగా ఉన్న విషయాన్ని తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొన్నేళ్లుగా అటవీశాఖలో సిబ్బంది నియామకాలు చేపట్టకపోవడంతో కొరత ఏర్పడింది. వెంటనే స్పందించి సిబ్బందిని సమకూర్చాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. సిబ్బంది సమకూరితే సమస్యలు తీరిపోతాయి. శ్రీనివాసరెడ్డి, అటవీశాఖ రేంజర్, పెనుకొండ

# ప్రజల కష్టాలు

పుంగనూరు : జిల్లాలో తాగునీటి ప్రాజెక్టులు అంతంతమాత్రమే.. ఫలితంగా వేసవి వచ్చిందంటే చాలు ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈసారి వేసవికి ముందే దాహార్తి సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, కుప్పం, నగరి పురపాలికల్లో, చిత్తూరు కార్పొరేషన్‌లో నీటి సమస్య తలెత్తుతోంది. దీనికి తోడు సక్రమంగా పనిచేయని బోరు మోటార్లు, విస్తరించని తాగునీటి గొట్టాలతో ప్రజలు నీటి కటకట అనుభవిస్తున్నారు. ప్రస్తుతం నగరి పురపాలికలో మినహా మిగిలిన మున్సిపాలిటీల్లో ఏదొక వీధిలో, కాలనీలో నీటి సమస్య తాండవం చేస్తోంది. ఈ క్రమంలో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది.

**మున్సిపాలిటీలో ఇలా..**పుంగనూరు పురపాలికలో భగత్‌సింగ్‌కాలనీ మిట్ట, మేలుపట్ల మలుపు, శుభారాం డిగ్రీ కళాశాల వెనుక, పెద్దిరెడ్డికాలనీ వీధులకు పురపాలక ట్యాంకర్లతో చాలీచాలని నీటిని అందిస్తున్నారు. పలమనేరులో మొన్నటి వరకు మూడు రోజులకోసారి వచ్చే నీళ్లు ప్రస్తుతం వారానికోసారి సరఫరా చేస్తున్నారు. 86 బోర్లలో 20 బోర్లు ఎండిపోగా, 10 బోర్లలో నీటిమట్టం తగ్గిపోయింది.

కుప్పం పురపాలికలో తాత్కాలిక ట్యాంకర్ల ఏర్పాటుకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించింది. చిత్తూరు కార్పొరేషన్‌లో శివారు ప్రాంతాలు, పైపులైన్లు లేని ప్రాంతాలకు ట్యాంకర్లు, అద్దె ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. నగరి పురపాలికలో ప్రస్తుతానికి నీటి సమస్య లేదు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.48లక్షలు, మరో రూ.20లక్షలతో మోటార్లు కొనుగోలు, ఇతర ప్రణాళికలు రూపొందించారు.

## అజిత్ కూతురు అప్పుడే హీరోయిన్ అయిపోయిందా..!

ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్టులుగా నటించిన చిన్నారులంతా ఇప్పుడు హీరోహీరోయిన్లుగా వెండితెరపై రాణిస్తున్నారు. ఇప్పటికే తెలుగులో తేజ సజ్జ, సంతోష్ శోభన్, సంగీత్ శోభన్, శ్రీదివ్య, కావ్య కళ్యాణ్ రామ్, అనిక సురేంద్రన్, ఎస్తేర్ పలు సినిమాల్లో ప్రధాన పాత్రలు పోషిస్తూ కెరీర్ లో ముందుకెళ్తున్నారు. ఈ లిస్ట్ లో యువీనా పార్థవి కూడా ఇప్పుడు హీరోయిన్ గా సిల్వర్ స్క్రీన్ పై సందడి చేస్తోంది. తమిళంలో ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించి అలరించిన యువీనా పలువురు స్టార్ హీరోలతో కలిసి నటించింది. అమాయకపు మాటలు, అల్లరితో ఆడియన్స్ కు దగ్గరైన యువీనా



మధ్యలో స్టడీస్ కోసమని సినిమాలకు దూరమైంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా యాక్టివ్ గా ఉంటున్న యువీనా రెగ్యులర్ గా తన ఫోటోలు, అప్డేట్స్ ను అందిస్తూ ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది. ఒకప్పుడు ఎంతో ముద్దుగా కనిపించిన యువీనా ఇప్పుడు ఎంతో గ్లామరస్ గా కనిపిస్తోంది. 2013లో ఇవాన్ ఏ కమల్ సినిమాతో తమిళ సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది యువీనా.

ఆ తర్వాత మంజాభైమా ప్యాలెస్, కత్తి సినిమాల్లో నటించింది. సూర్య, అజిత్ సినిమాల్లోనూ నటించి బాలనటిగా మంచి పేరు తెచ్చుకున్న యువీనా తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో ఎన్నో సినిమాల్లో నటించింది. వీరమ్ సినిమాలో అజిత్ తో కలిసి నటించిన ఈ చిన్నది అప్పుడే హీరోయిన్ గా మారిందేంటని అందరూ తన ఫోటోలు చూసి షాకవుతున్నారు.

## సొంత గుర్తింపు కోసం శ్రుతిహాసన్ నిజాయితీ

వరుసగా రెండుసార్లు ప్రేమలో వైఫల్యం, నటిగా ఆరంభం ఫ్లాపులు ఎదురైన తర్వాత కూడా శ్రుతిహాసన్ అగ్ర కథానాయికగా పరిశ్రమలో ఎదిగింది. స్టార్ హీరోల సరసన వరుసగా అవకాశాలు అందుకుంది. ఇటీవల ఈ భామ మూడు బ్లాక్ బస్టర్లలో అవకాశాలు దక్కించుకుంది. కంబ్యాక్ లో ఈ మూడూ తనకు సంతృప్తికరమైన ఫలితాన్ని అందించాయి. ఆ మూడు సినిమాలు వీరసింహారెడ్డి, వాల్టెయిర్ వీరయ్య, సలార్: పార్ట్ వన్ – సీజ్ ఫైర్. సలార్ 2 తర్వాత రజనీ–లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లోని కూలి చిత్రంలో నటిస్తోంది. అలాగే విజయ్ సేతుపతితో కలిసి ట్రైన్ అనే ప్రయోగాత్మక చిత్రానికి సంతకం చేసింది. దళపతి విజయ్ తదుపరి చిత్రం జననాయకన్‌లో శ్రుతి ఓ కీలక పాత్రను పోషిస్తుందని కూడా ఊహాగానాలు చెలరేగాయి. దిగ్గజ నటుడు కమల్ హాసన్ కుమార్తె అయినా కానీ, తండ్రి పేరును



ఉపయోగించుకునేందుకు శ్రుతి పూర్తిగా వ్యతిరేకం.

తన తండ్రిని గుర్తించినంతగా తనను గుర్తించరనే భయం తనకు ఉంది. అందుకే తాను చదువుకునేప్పుడు.. కెరీర్ ప్రారంభించిన రోజుల్లో తండ్రి పేరును ఎక్కడా ఉపయోగించలేదని తెలిపింది. అలాగే స్నేహితులకు తన ఐడెంటిటీని కూడా చెప్పేదానిని కాదని వెల్లడించింది. కమల్, సారికల గురించి ప్రజలకు తెలిస్తే వారి గురించి మాట్లాడుతారు కానీ, తన గురించి ఎవరైనా మాట్లాడుతారా? అని కూడా శ్రుతి ఆందోళన చెందింది. తన స్నేహితులకు ఫేక్ ఐడెంటిటీని పరిచయం చేయడం ద్వారా కూడా తప్పించుకుంది. అయితే కథానాయిక అయ్యాక మాత్రం అజ్ఞాతవాసాన్ని దాచలేకపోయింది.

అయినా నటిగా తనదైన ముద్ర వేసి ముందుకు సాగేందుకు చాలా హార్డ్ వర్క్ ను ఆశ్రయించింది. ఇప్పుడు అగ్ర కథానాయిక హోదా వెనక తన కృషి పట్టుదల అసాధారణమైనది.




## నాని 'హిట్ 3'.. బిజినెస్ ఏ రేంజ్ లో జరిగిందంటే..



నేచురల్ స్టార్ నాని కథల ఎంపికలో ఎంత కొత్తగా ఆలోచిస్తాడో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అలాగే సినిమాల ప్రమోషన్లో కూడా అంతే చాకచక్యంగా వ్యవహరిస్తాడు. 'దసరా', 'హాయ్ నాన్న' సినిమాలతో డిఫరెంట్ జానర్స్‌ని టచ్ చేసిన నాని.. ఇటీవల 'సరిపోదా శనివారం'తో కూడా మంచి హిట్ అందుకున్నాడు. వరుస విజయాలతో ఫామ్‌లో ఉన్న నాని.. ఇప్పుడు 'హిట్ 3'తో మరోసారి ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధమయ్యాడు. 'హిట్' సిరీస్‌కి నాని నిర్మాతగానే కాదు.. స్క్రిప్ట్ బ్యాక్ గ్రౌండ్ లో సపోర్ట్ చేసినట్లు టాక్. 'హిట్ 1', 'హిట్ 2' సినిమాల విజయానంతరం ఇప్పుడు 'హిట్ 3'పై భారీ అంచనాలు ఉన్నాయి. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నాని 'అర్జున్ సర్కార్' అనే బ్రూటల్ పోలీస్ పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌తో సినిమా గురించి పాజిటివ్ టాక్ ఏర్పడింది. నాని వాయిస్ ఓవర్, పవర్ ఫుల్ డైలాగ్స్, డార్క్ థ్రిల్లింగ్ నేపథ్యం ఈ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. ఈసారి 'హిట్ 3' లో యాక్షన్ డోస్ గట్టిగానే ఉండనున్నట్లు అర్థమవుతుంది. తన హిట్ ఫామ్‌కి తోడు ప్రమోషన్ ప్లానింగ్‌లో నాని ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ సినిమా ప్రచారానికి హై లెవెల్ ప్లానింగ్‌తో ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికే ట్రైలర్, పాటలు, క్యారెక్టర్ పోస్టర్స్‌తో నాని జట్టు ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తోంది. ఇక బిజినెస్ విషయానికి వస్తే.. తాజా సమాచారం ప్రకారం 'హిట్ 3' ప్రీరిలీజ్ బిజినెస్ దాదాపు రూ.40 కోట్ల రేంజ్‌లో క్లోజ్ అయినట్లు తెలుస్తోంది. ఇది నాని కెరీర్‌లో మూడో హయ్యెస్ట్ ప్రీరిలీజ్ బిజినెస్ కావడం విశేషం. 'దసరా' తర్వాత నాని సినిమాకి ఇలా బజ్ క్రియేట్ కావడం, డిస్ట్రిబ్యూటర్లు, ఓటీటీ సంస్థలు భారీగా అడ్వాన్స్ ఇచ్చేలా చేసిందంటే.. ఈ సినిమాపై ఉన్న నమ్మకం అర్థం చేసుకోవచ్చు. ఓటీటీ రైట్స్, శాటిలైట్, థియేట్రికల్ బిజినెస్ కలిపి హై రేంజ్‌లో గిట్టుబాటు అయినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తుండగా, మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు. విజువల్స్, బీజీఎం, ఎడిటింగ్ అన్నీ ఇంటర్నేషనల్ లెవెల్లో ప్లాన్ చేశారు. హై రేంజ్ షాట్ ప్లానింగ్‌తో తెరకెక్కిన ఈ థ్రిల్లర్ సినిమా టెక్నికల్‌గా చూసినా చాలా స్టాండర్డ్ ఉంది. మే 1న విడుదల కానున్న ఈ చిత్రం డే వన్ నుంచే మంచి ఓపెనింగ్స్ సాధించే అవకాశముంది. మొత్తానికి నాని వరుస హిట్స్‌తో మంచి జోష్‌లో ఉన్న తరుణంలో 'హిట్ 3' ప్రీరిలీజ్ బిజినెస్ కూడా అదే జోరులో ఉండటం విశేషం. మరి సినిమా రిలీజ్ తర్వాత ఈ బజ్‌ను బాక్సాఫీస్ నెంబర్స్‌లోకి మార్చుకుంటాడా నాని? అనే ప్రశ్నకు మే 1న క్లారిటీ రానుంది.


## పోటీ హీరో కోసమా లేక డైరెక్టర్ కోసమా?



సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ కూలీ. ఉపేంద్ర, నాగార్జున, శృతి హాసన్, సత్యరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా కోసం రజినీ ఫ్యాన్స్ తో పాటూ మూవీ లవర్స్ అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. యాక్షన్, గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో రానున్న ఈ సినిమాకు తెలుగులో కూడా మంచి క్రేజ్ ఉంది. ఈ ఏడాది రిలీజ్ కానున్న కూలీ సినిమా తెలుగు హక్కుల కోసం తెలుగులో మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కూలీ తెలుగు డిస్ట్రిబ్యూషన్ హక్కులకు తీవ్ర పోటీ నెలకొంది. సన్ పిక్చర్స్ ప్రొడక్షన్స్ లో కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ సినిమా హక్కుల కోసం టాలీవుడ్ లోని పలు పెద్ద సంస్థలు పోటీ పడుతున్నట్టు సమాచారం. వారిలో ముఖ్యంగా ఏషియన్ సినిమాస్ అధినేత సునీల్ నారంగ్ తో పాటూ సితార ఎంటర్టైన్మెంట్స్ నాగవంశీ ఉన్నట్టు తెలుస్తోంది. అయితే నిర్మాతలు మాత్రం కూలీ రైట్స్ కోసం రూ.40 కోట్లు రేటు చెప్పారని, దానికంటే ఎవరు ఎక్కువ ఇస్తే వారికి కూలీ తెలుగు రైట్స్ ను అమ్మాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమా లానే రీసెంట్ గా సూర్య నటిస్తున్న రెట్రో సినిమా తెలుగు హక్కులకు కూడా తీవ్ర పోటీ ఏర్పడింది. చివరకు దాదాపు రూ. 9 కోట్లతో సితార నాగవంశీ ఆ సినిమా తెలుగు రైట్స్ ను సొంతం చేసుకోగా, ఇప్పుడు మరోసారి కూలీ రైట్స్ కోసం పోటీ పడుతున్నాడు. లోకేష్ దర్శకత్వంలో వచ్చిన ఆఖరి సినిమా లియో తెలుగు హక్కులను కూడా వంశీనే సొంతం చేసుకుని తెలుగులో రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే ప్రస్తుతం కూలీ షూటింగ్ చెన్నై ఎయిర్‌పోర్ట్ లో జరుగుతుంది. మార్చి నెలాఖరుకి షూటింగ్ పూర్తి చేయాలని చూస్తున్న టీమ్, ఈ నెలలోనే టీజర్ ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తోంది. ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకు సౌత్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు.

## నెట్టింట వైరల్ వీడియోలు.. విద్యాబాలన్ స్ట్రాంగ్ రియాక్షన్!


సోషల్ మీడియాలో బాలీవుడ్ నటి విద్యా బాలన్ వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి! ప్రధానంగా... ఫేస్ బుక్ తో పాటు వాట్సప్ గ్రూపుల్లోనూ ఆ వీడియోలు హల్ చల్ చేస్తున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యా బాలన్ స్పందించారు. ఈ సందర్భంగా ఓ సందేశం విడుదల చేశారు. ఇదే సమయంలో.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవును... సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోన్న వీడియోలను ఉద్దేశించి బాలీవుడ్ నటి విద్యా బాలన్ స్పందించారు. ఈ సందర్భంగా ఆ వీడియోలతో తనకు ఏమాత్రం సంబంధం లేదని.. అవన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో క్రియేట్ చేసిన డీప్ ఫేక్ వని తెలిపారు. ఈ విషయంలో నెటిజన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా స్పందించిన విద్యా బాలన్... ఈ మధ్యకాలంలో తనకు సంబంధించిన పలు వీడి



యోలు సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి.. అయితే, అవన్నీ ఏఐ జనరేటేడ్ వీడియోలను తెలిపారు. ఆ వీడియోలతో తనకు ఎటువంటి సంబంధం లేదని.. వాటిని క్రియేట్ చేయడం, షేర్ చేయడంలో తన ప్రమేయం లేదని అన్నారు. ఇదే సమయంలో.. ఆ వీడియోల్లోని కంటెంట్ ను తాను ఏమాత్రం అంగీకరించనని.. అందువల్ల సోషల్ మీడియాలో ఆ వీడియోలు షేర్ చేసే ముందు దయచేసి వాటి గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలని కోరారు. ఏఐ జనరేటెడ్ కంటెంట్ మిమ్మల్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉందని చెబుతూ.. అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాగా... ఈ డీప్ ఫేక్ టెక్నాలజీ కారణంగా ఇప్పటికే ఎంతోమంది హీరోయిన్లు, సెలబ్రెటీలు ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. రష్మిక మందాన, కత్రినా కైఫ్, దీపికా పదుకొణె, అలియా భట్, కాజోల్ వంటి హీరోయిన్లు ఈ టెక్నాలజీ బాధితులే! ఇదే సమయంలో పలువురు క్రీడాకారులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన ఏఐ జనరేటెడ్ కంటెంట్ కూడా నెట్టింట హల్ చల్ చేసిన సంగతి తెలిసిందే.

## చైతూ ఫోటో.. శోభిత హార్ట్ మెల్ట్!

యంగ్ హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ శోభిత ధూళిపాళ్ల.. గత ఏడాది వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. డిసెంబర్ 4వ తేదీన చైతన్య, శోభితల వివాహం గ్రాండ్ గా జరిగింది. కొంత కాలంపాటు ప్రేమలో ఉన్న వీరిద్దరూ.. ఇరు కుటుంబాల అంగీకారంతో హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ లో వేద మంత్రాల మధ్య ఒక్కటయ్యారు. ఆ తర్వాత నుంచి వివిధ సందర్భాల్లో వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. శోభిత.. చైతూపై లవ్ ను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో వ్యక్తపరుస్తుంటారు. రీసెంట్ గా కొన్ని నెలల తర్వాత చైతూ క్లీన్ షేవ్ ఫేస్ ను చూడనున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయం సాధించిన తండేల్ కోసం కొన్ని నెలలుగా నాగచైతన్య గడ్డం పెంచిన విషయం తెలిసిందే. ఇప్పుడు తన భర్త క్యూట్ పిక్ ను పోస్ట్ చేసింది శోభిత. ఇన్ స్టా స్టోరీలో పోస్ట్ చేసిన ఆమె.. హార్ట్ సింబల్ యాడ్ చేయడంతో ఫుల్ వైరల్ గా మారింది. డీజే ప్లేస్ లో ఉన్న చైతూ ఫోటో షేర్ చేసి.. హార్ట్ ఏ chay అంటూ క్యూట్ గా పోస్ట్ పెట్టింది. క్రీమ్ కలర్ స్వెట్



షర్ట్ వేసుకుని చైతూ.. ఫుల్ హ్యాపీ మూడ్ లో ఉన్నట్లు కనిపిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో శోభిత పోస్ట్ వైరల్ గా మారగా.. నెటిజన్లు స్పందిస్తున్నారు. వావ్, సూపర్ పిక్ అని కామెంట్లు పెడుతున్నారు. హార్ట్ ఎమోజీస్ తో కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు. శోభిత పోస్ట్ స్క్రీన్ షాట్ ను వైరల్ చేస్తున్నారు. తమ సోషల్ మీడియా వాల్స్ లో పోస్ట్ చేస్తూ ఫుల్ ఖుషీ అయిపోతున్నారు అక్కినేని ఫ్యాన్స్. మరోవైపు, ఇటీవల శోభిత, చైతూ మంచి మనసు చాటుకున్నారు. క్యాన్సర్ తో పోరాటం చేస్తున్న చిన్నారులను కలిసి వారితో గడిపారు. కొంతసేపు మాట్లాడారు. హైదరాబాద్ లోని సెయింట్ జూడ్ ఇండియా చైల్డ్ కేర్ కు వెళ్లి.. పలువురు చిన్నారులతో సరదాగా గడిపారు. వారికి ధైర్యం కూడా చెప్పారు శోభిత, చైతూ. అంతేకాదు ఆ కేర్ సెంటర్ సిబ్బందితో కూడా మాట్లాడారు. పిల్లల ఆరోగ్యం గురించి వివరాలను క్లియర్ గా అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక సహాయం కూడా చేసినట్లు తెలుస్తోంది. అనంతరం పిల్లలు, కేర్ సిబ్బందితో ఫొటోలు దిగారు. అందుకు సంబంధించిన ఫొటోలు ఇటీవల నెట్టింట వైరల్ గా మారాయి. కొత్త జంట మంచి మనసును అంతా కొనియాడారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536